
రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 39 | మంగళవారం | 28-07-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## కలాం చూపిన నిబద్ధత ప్రతీ భారతీయుడికి ఆదర్శప్రాయం

రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా డాక్టర్ అబ్దుల్ కలాం చూపిన నిబద్ధత, నిరాడంబర జీవనం, అసాధారణ ప్రతిభకు, అచంచలమైన దేశభక్తికి ప్రతీకగా నిలిచిన వారి జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి 'భారతరత్న' డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆ మహనీయుడికి వినమ్ర నివాళులర్పించారు.



## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- రంగనాథ్‌ను తీసేసి మరొకరిని నియమించండి
- కోర్టు ఆదేశాల ఉల్లంఘన కేసులో హైకోర్టు కీలక ఉత్తర్వులు
- 63 ధిక్కరణ కేసులున్నా వైఖరిలో రాని మార్పు
- తీవ్రంగా తప్పుపట్టిన న్యాయమూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

న్యాయస్థానాల ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘిస్తూ, కోర్టు ఎదుట స్వయంగా ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకుండా న్యాయవ్యవస్థ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన స్థానంలో మరో అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాదిన్నర కాలంలో రంగనాథ్‌పై ఏకంగా 63 కోర్టు తరువాయి 8లో

**తప్పుడు సమాచారంతో కోర్టును తప్పుదోవ పట్టించారు : రంగనాథ్** 12



## శాంతియుత నిరసన రాజ్యాంగ హక్కు

### ఆందోళన పేరుతో పోలీసుల బలప్రయోగం సరికాదు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, దాన్ని ఎవరికీ నిరాకరించే అవకాశం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసులు అతిగా బలప్రయోగం చేయడాన్ని సమర్థించలేమని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణకు సంబంధించి ఒకే తరహా మార్గదర్శకాలు రూపొందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా వెల్లడించింది. నీట్‌యుజి ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల వ్యవస్థలో అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల తరువాయి 8లో

### పోలీసుల దాష్టీకంపై

# దద్దరిల్లిన ఉభయసభలు

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఎంపిల నినాదాలు ● లోక్‌సభ, రాజ్యసభలో కొనసాగిన వాయిదాల పర్వం**



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యల అంశానికి సంబంధించి సోమవారం పార్లమెంట్ ఉభయసభలు మరోమారు దద్దరిల్లాయి. ఉదయం ఉభయ సభలు ప్రారంభమైన వెంటనే విద్యార్థులపై పోలీసుల అమానుష దాడి అంశాన్ని ప్రతిపక్ష ఎంపిలు లేవనెత్తా రు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఉదయం ప్రారంభమైన వెంటనే గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభినందించారు. ఆ వెంటనే, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించా రు. ప్రశ్నోత్తరాల సమయం ప్రశ్నలు అడగడానికే తప్ప ఇతర సమస్యలను లేవనెత్తడానికి కాదని బిర్లా వారికి గుర్తు చేశారు. సభకు అంతరాయం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆ తరువాత కూడా వాయిదాల పర్వం కొనసాగింది. కాగా, నీట్ సమస్యపై విద్యార్థుల ఆందోళన సందర్భంగా పోలీసుల చర్యకు వ్యతిరేకంగా సభలో ప్రతిపక్ష పార్టీలు నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో, పేపర్ లీక్‌లను అరికట్టడానికి కఠినమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ఒక బిల్లును ప్రవేశపెట్టింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు'ను ప్రవేశపెట్టిన వెంటనే, తరువాయి 12లో

## ప్రభుత్వ పరీక్షల లీకేజీ నియంత్రణ బిల్లుపై నేడు చర్చ

- ప్రతిపక్షాలు,అన్నిపార్టీలతో చర్చించి ఒప్పించిన స్పీకర్ ఓం బిర్లా
- సమస్యపై ఏకాభిప్రాయంతో వ్యవహరిస్తామని రాహుల్‌గాంధీ ప్రకటన

**న్యూఢిల్లీ:** ప్రతిపక్షాల నిరసనలు, నినాదాల మధ్య ప్రశ్నాపత్రాల లీకేజీలను నివారించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాల నిరసనలు,నీట్ అక్రమాలపై చర్చ జరపాలన్న డిమాండ్,గందరగోళ వాతావరణం ఒకవైపు, బిల్లుపై మాత్రమే చర్చ జరగాలన్న స్పీకర్ ఓం బిర్లా మంకుపట్టు మధ్య సోమవారం ఎలాంటి చర్చా లేకుండానే లోక్‌సభ ముగిసింది. ప్రధానమంత్రి కార్యాలయంలో సహాయమంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. రెండు సార్లు సభ వాయిదా పడటంతో ఎలాంటి చర్చలు లేకుండానే సమావేశం ముగిసింది. బిల్లుపై చర్చకు ఆరు గంటలు సమయం కేటాయించామని స్పీకర్ చెప్పారు. ప్రతిపక్షాలు, తరువాయి 8లో



## ఏ బిడ్డ కూడా బడిలో అర్థాకలితో ఉండొద్దు

- అదే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ ఆశయం
- విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు
- ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం
- సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/ మధిర

విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని ఉచిత పథకాలు అనేవి ప్రభుత్వం ప్రజలపై పెట్టే పెట్టుబడి అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చాలా మంది ఉచిత పథకాలపై విమర్శలు చేస్తున్నారని పరిశ్రమలు, ప్రాజెక్టులు, ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడులు పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనకబడిన వర్గాలు సహా ప్రజలందరిపై ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుందన్నారు. మధిర నియోజక వర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ కూడా అర్థకాలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ఆశయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఒకే సమయానికి వేడిగా అల్పాహారాన్ని అందించడం దేశ చరిత్రలో తరువాయి 8లో




## పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపిల నిరసన

**కేంద్రమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ వివాదం సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా ప్రతిపక్ష ఎంపిలు సోమవారం పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ప్లకార్డులు, ఒక పెద్ద బ్యానర్‌ను పట్టుకుని, పలువురు ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం మెట్ల ముందు నిరసన తెలిపారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దురాగతాలు చేశారన్న ఆరోపణలపై హోం మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ, తరువాయి 12లో

## నీట్ లీకేజీ స్కామ్ విద్యార్థుల ఉసురుతీసింది!

**ఉద్యమపోరుకు తలవంచిన ఢిల్లీ పీఠం**

- విద్యార్థుల పోరాట పటిమ అభినందనీయం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- అత్మహత్య చేసుకున్న విద్యార్థులకు కొవ్వొత్తులతో నివాళి




ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో కోట్లాది మంది విద్యార్థుల ఉసురుతీసిన నీట్‌పేపర్ లీకేజీ కుంభకోణానికి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, విద్యార్థి లోకం సాగించిన వీరోచిత ఉద్యమ పోరుకు ఎట్టకేలకు ఢిల్లీ పీఠం తలవంచక తప్పలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నీటి పరీక్షా పేపర్ల లీకుతో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళి అర్పించారు. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి ఓల్డ్ డిపో వరకు తరువాయి 12లో

## రిజర్వాయర్లలో నీటి నిల్వలు 30 శాతమే!

- ప్రధాన రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం 1059.3 టిఎంసిలకు 335.47 టిఎంసి నిల్వలే
- ఖరీఫ్‌లో సాగు అవుతుంది సగం శాతమే
- ఇప్పటి వరకు 68.4లక్షల ఎకరాల్లోనే పంటలు
- రాష్ట్రంలో పెరుగుతున్న ఎల్‌నినో ప్రభావం
- ఇప్పటికే 34.71శాతం లోటు వర్షపాతం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం అంతకు అంతా పెరుగుతోంది. దీంతో ఖరీఫ్ వ్యవసాయం కీలక మలుపులో నిలిచింది. సాధారణంగా జూన్, జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురువాల్సిన నైరుతి రుతు పవన వర్షాలు ఈసారి అనేక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో కురకపోవడంతో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో గత జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకుసాధారణ వర్షపాతం 342.84 మిల్లీమీటర్లకు గాను కేవలం 223.86 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. రాష్ట్రంలో మొత్తంగా ప్రస్తుతం 34.71 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం ప్రమాద ఘటికలను మోగిస్తోంది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం నిర్ధేశించున్న 135 లక్షల ఎకరాల్లో ఇప్పటి తరువాయి 8లో



| ప్రాజెక్టు | సామర్థ్యం (టిఎంసి) | ప్రస్తుత నిల్వ (టిఎంసి) | ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | అవుట్ ఫ్లో (క్యూసెక్కులు) |
|---|---|---|---|---|
| జూరాల | 9.66 | 7.38 | 24013 | 43 |
| శ్రీశైలం | 215.81 | 41.40 | 163 | 1501 |
| నాగార్జునసాగర్ | 312.05 | 137.16 | 4970 | 4970 |
| సింగూరు | 29.9 | 4.30 | 390 | 470 |
| నిజాంసాగర్ | 17.80 | 6.48 | 899 | 131 |
| కడెం | 4.70 | 0.70 | 189 | 66 |
| శ్రీరాంసాగర్ | 80.50 | 15.98 | 2894 | 752 |
| శ్రీపాద ఎల్లంపల్లి | 20.17 | 8.09 | 940 | 587 |

## వామపక్ష విద్యార్థి సంఘాల విజయోత్సవ ర్యాలీ




- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థులు, యువత ఐక్య పోరాట ఫలితం
- తక్షణమే ఎన్‌టిఎను రద్దు చేయాలి
- ఎన్‌ఇపిని ఉపసంహరించుకోవాలి
- వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎన్‌టిఎను రద్దుచేయడంతో పాటు జాతీయ విద్యా విధానం(ఎన్‌ఇపి–2020)ను ఉపసంహరించుకోవాలని, అప్పటీ వరకు తమ పోరాటం కొనసాగుతుందని వామపక్ష విద్యార్థి సంఘాల నేత లు స్పష్టంచేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఐక్యంగా సాగించిన పోరాటానికి ఇది తరువాయి 12లో




09

## స్వర్ణం ముద్దాడిన ఈషా

- కాంస్యం గెలిచిన మను
- ఐఎస్ఎస్ ప్రపంచకప్‌లో 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్
- పోడియంపై విన్నర్లుగా ఇద్దరు భారత షూటర్లు

## క్యూబాలో ట్రంప్ రాజకీయ మారణహోమం



- ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని డయాజ్ కానెల్ డిమాండ్
- బాటిస్టాపై తొలి తిరుగుబాటుకు 73 ఏళ్ళు : క్యూబాలో వేడుకలు

**హవానా:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆంక్షల పేరుతో క్యూబాలో రాజకీయ మారణహోమం కొనసాగిస్తున్నారని ఆ దేశాధ్యక్షుడు మిగ్యుల్ డయాజ్ కానెల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మానవతా సహాయం అందిస్తున్న ఇతర దేశాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. క్యూబాను శాంతియుతంగా జీవించనివ్వండి, అమెరికా సహా ఎవ్వరికీ మా దేశం వ్యతిరేకం కాదు, ఏనాడు ఏ ఇతర దేశంపైనా దాడి చేయలేదు అని గుర్తుచేశారు. అమెరికాలో మానవహక్కులకోసం పోరాటం చేస్తున్న శ్రే ష్ఠులైన ప్రజలను కూడా సురక్షితంగా జీవించనివ్వండి అని కోరారు. అమెరికా మద్దతుగల నియంత పుల్జెన్సి యో బాటిస్టాకు వ్యతిరేకంగా 1953లో క్యూబన్ విప్లవానికి నాంది పలికిన తిరుగుబాటుకు గుర్తుగా జులై 26వ తేదీన క్యూబా వ్యాప్తంగా జాతీయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పినార్ తరువాయి 12లో

# ఈ ప్రశ్నకు బదులేదీ?

జులై 20న క్రాక్రోచ్ జనతాపార్టీ(సిజెపి) పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై పాశవికంగా దాడులు చేయటానికి ఆదేశాలిచ్చిందెవరు? హోంమంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించరా? ఈ రోజు (జులై 27) పార్లమెంటు ఉభయ సభలు ప్రభుత్వ శాసన ఎజండా చేపట్టకుండానే పలుమార్లు వాయిదాపడి, చివరకు సభాపతులు రేపటికి వాయిదా వేయటానికి కారణం ఈ ప్రశ్నలే. ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధి ఆదివారంనాడే హోంమంత్రి అమిత్ షాకు రాసిన లేఖలో, ఢిల్లీలో 20వ తేదీన శాంతియుతంగా ప్రదర్శన జరుపుతున్న విద్యార్థులపై పాశవిక దాడికి షా జవాబుదారీతనం వహించాలని కోరారు. ఎందుకంటే, కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీ పోలీసులు హోంమంత్రిత్వశాఖ కిందే పనిచేస్తారు. ''వందలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు. విద్యార్థినులపై మగ పోలీసులు దాడి చేశారు, అసభ్యంగా ప్రవర్తించారు. ప్రాణాంతకమైన పెల్లెట్ తుపాకులు ఉపయోగించటం మహాదారుణం. హోం మంత్రిగా మీరు, విద్యార్థులపై పెల్లెట్ గన్స్ సహా దారుణమైన బలప్రయోగానికి పాల్పడటాన్ని ఆమోదిస్తారా? మీరు కాకపోతే ఎవరు అనుమతించారు? సాధారణ దుస్తుల్లో లాఠీలతో విద్యార్థులపై దాడిచేస్తూ కనిపించినవారు పోలీసులా? వలంటీర్లా? వారిని నియోగించిందెవరు? మన సొంత దళాలు భారతదేశ భవిష్యత్‌పై కాల్పులు జరపటాన్ని మేము అనుమతించబోము. దీన్ని పార్లమెంటులో ప్రధాన సమస్యగా లేవనెత్తుతాం''అని రాహుల్ ముందే హెచ్చరించారు.

వారం రోజుల వాష్‌ఔట్ తదుపరి సోమవారం పునఃప్రారంభమైన పార్లమెంటు సమావేశాల్లో అదే జరిగింది? ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రశ్నాపత్రా ల లీకేజీపై దోషులకు శిక్షలు, జరిమానాలు పెంపుచేసే బిల్లును ప్రవేశపెట్టి పరిస్థితిని శాంతింపచేయాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించలేదు. లోక్‌సభలో టిఎంసి, కాంగ్రెస్, రెండు సభల్లో డిఎంకె సభ్యులు ప్రభుత్వ జవాబుదారీతనాన్ని డిమాండ్‌చేస్తూ వాయిదా తీర్మానాలు ప్రతిపాదించారు. సభాపతులు షరామామూలుగా వాటిని తిరస్కరించినా ప్రతిపక్షసభ్యుల నినాదాలతో కార్యక్రమాలు ముందుకు సాగక సభలు పలుమార్లు వాయిదాపడ్డాయి. చివరకు సాయంత్రం 5గంటలకు పునఃసమావేశమైన లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడకతప్పలేదు. జితేంద్రసింగ్ ప్రవేశపెట్టిన బిల్లుపై మంగళవారం చర్చ జరుగుతుంది.

విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి నాయకులు ఆందోళనను నిలుపుచేయటంతో, దాన్నుండి దృష్టిని, చర్చను మళ్లించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం చకచకా కొన్ని పైపూత చర్యలు ప్రకటించింది. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజి వ్యవహారంలో విద్యార్థుల మనసు గెలిచేందుకు ప్రధానమంత్రి స్వయంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియోల పోస్టింగ్ దౌత్యం చేబట్టారు. లీకేజి నేరస్థులను జైల్లో బంధించామని, సత్వర విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని ముందు ప్రకటించారు. అయినా విద్యార్థులు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై పట్టువీడకపోవటం, ఎన్ని ఆటంకాలు, నిర్బంధాలకు పాల్పడుతున్నా జంతర్‌మంతర్‌కు చేరుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, సామాజిక శక్తులు పెరుగుతుండటంతో శనివారం ప్రధాన్ చేత రాజీనామా చేయించారు. అదే సమయంలో సిజెపి నాయకులతో చర్చలు కొనసాగించి వారి ఇతర కోర్కెలు – విద్యార్థి మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, విద్యార్థులపై క్రూరంగా దాడిచేసిన పోలీసులపై చర్య, దేశమంతటా విద్యార్థులపై కేసులు ఎత్తివేత – అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. తమకిచ్చిన హామీల అమలుకు విద్యార్థి నాయకులు ప్రభుత్వానికి నెలరోజులు గడువు విధించారు. జాతీయ పరీక్షల ఏజన్సీని ప్రక్షాళన చేస్తున్నట్లు 47మంది ఉద్యోగులను ప్రభుత్వం తొలగించింది. పరీక్షల నిర్వహణను సంస్కరించి, సాంకేతికంగా పకడ్బందీ చేసేందుకు యుఐడిఎఐ మాజీ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలో ప్రధాని ప్రత్యేక టాస్క్‌ఫోర్‌ను ప్రకటించారు. దీన్ని దెబ్బతిన్న ప్రధాని ప్రతిష్ట పునరుద్ధరణ ప్రయత్నంగా కాంగ్రెస్ నేత జై రాం రమేష్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే ఎన్‌టిఎ సంస్కరణపై కె.రాధాకృష్ణన్ కమిటీ చేసిన 101 సిఫారసులను మోదీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. కమిటీలు వారికి కాలయాపన, దృష్టి మళ్లింపు సాధనాలే. ప్రభుత్వం తెచ్చిన సవరణ బిల్లును 'బ్యాండ్ ఎయిడ్'గా అభివర్ణించిన రమేష్, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, విద్యావ్యవస్థలో సవాళ్లపై సమగ్ర బిల్లు తేవాలన్నారు. హోంమంత్రి సభకు వచ్చి ఢిల్లీలో పెల్లెట్ గన్స్, పట్నాలో ఎకె–47 తుపాకీ ఉపయోగించటంపై వివరణ ఇవ్వాలని కె.సి.వేణుగోపాల్ కోరారు.

ఢిల్లీలో పెల్లెట్ గన్స్ ఉపయోగించటాన్ని తొలుత తిరస్కరించిన పోలీసు అధికారులు, బాధితుణ్ణి ప్రతిపక్షం మీడియా ముందుకు తేవటంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఉపయోగించినట్లు ధృవీకరించింది. ప్రజల ఆందోళనల సందర్భంగా నియంత్రించే చర్యలు స్టాండర్డ్ ప్రొసీజర్ ప్రకారం ఉండాలని ఆదేశించారు. కాని అతిక్రమించినపోలీసులపై చర్యలు లేవు. ప్రభుత్వ వైఖరే అందుకు కారణమనవచ్చు. మహాశక్తిశాలిగా తనను తాను భావించుకుంటున్న, అటువంటి చిత్రాన్ని దేశం ముందుంచుతున్న మోదీ ప్రభుత్వం కాక్రోచ్‌ల ఆందోళనపై అపవాదులు కొనసాగిస్తూనే ఉంది. ఉద్యమం వెనుక విదేశీ శక్తులున్నాయని, దేశద్రోహులు అందులో చేరారని, పాతనేరస్థులు, సంఘ వ్యతిరేక శక్తులు అరాచకానికి పాల్పడ్డాయని ఢిల్లీనుంచి గల్లీదాకా దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు. విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేస్తామని ఢిల్లీలో అంగీకరించారు. కాని పట్నా, కలకత్తా తదితర నగరాల్లో కేసులు బనాయిస్తూనే ఉన్నారు. ఇదే బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వ ద్వంద్వవైఖరి. విద్యార్థులపై కేసులు పెట్టటం వాగ్దాన ఉల్లంఘనగా సిజెపి నాయకులు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనను సుప్రీంకోర్టు సమర్థిస్తూ, ఎటువైపునుంచీ హింసకు తావులేదని వ్యాఖ్యానించింది. పోలీసుల బలప్రయోగాన్ని తప్పుపట్టింది.


లీకేజి వ్యతిరేక బిల్లు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, ప్రత్యేక కోర్టులు – ఇవన్నీ ప్రస్తుతం ప్రభుత్వం పరువుతీసిన సిజెపి ఉద్యమం, ప్రతిపక్షాల ప్రతిఘటననుంచి తననుతాను కాపాడుకునేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న తాత్కాలిక చర్యలే. విద్యావ్యవస్థను కాషాయమయం చేస్తున్న విధానాలను సరిదిద్దుకోనంతవరకు ఈ సంక్షోభం ఏదోక రూపంలో కొనసాగుతూనే ఉంటుంది. ●



## ఇక ఇ–20 వంతు

దేశంలోని యువత ఏకమై తమ గళాన్ని వినిపించడంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రధానితో నా వినతి.. అదే చేతితో ఇ–20 పెట్రోల్ సమస్యకు కూడా పరిష్కారం చూపండి. ప్రజల వాహనాలలో మైలేజీ తగ్గిపోతుంది. పాడైపోతున్నాయి. దీనిపై మనమంతా ఏకమై గళమెత్తితేనే ప్రధాని మన గొంతు వింటారు. అందుకే మేము శనివారం (ఆగస్టు 1న) 'నేషనల్ టౌన్ హాల్ అగైనెస్ట్ ఇ–20' పేరుతో ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో మధ్యాహ్నం 12:30 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. ఇందులో ఎవరైనా పాల్గొనవచ్చు. ఇ–20పై మీ అభిప్రాయాలను పంచుకోవచ్చు. మీరు ఆన్‌లైన్ ద్వారా కూడా ఇందులో చేరవచ్చు. మీ అందరికీ ఆహ్వానం.

– అరవింద్ కేజ్రీవాల్,
ఆప్ జాతీయ కన్వీనర్




# అప్రమత్తత తోనే హెపటైటిస్ దూరం

మానవ శరీరంలో కాలేయం అత్యంత కీలకమైన అవయవం. రక్తంలో వ్యర్థాలను తొలగించడం, జీర్ణక్రియకు తోడ్పడటం మరియు శక్తిని నిల్వ చేయడంలో కాలేయం పాత్ర అమోఘం. అయితే, వైరల్ ఇన్ఫెక్షన్లు, అసమతుల్య జీవనశైలి కారణంగా సంభవించే 'హెపటైటిస్' (కాలేయ వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్) నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారింది. ఈ వ్యాధిపట్ల ప్రజల్లో అవగాహన పెంచడానికి, నివారణ, చికిత్స మార్గాలను విస్తృతం చేయడానికి ప్రతి సంవత్సరం జులై 28న 'ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం' నిర్వహిస్తారు. నోబెల్ బహుమతి గ్రహీత, హెపటైటిస్‌బి వైరస్‌ను కనుగొన్న డాక్టర్ బరూచ్ శామ్యూల్ బ్లూమ్ బర్గ్ జయంతిని పురస్కరించుకుని ఈ రోజును ఎంచుకున్నారు. హెపటైటిస్ వ్యాధి ప్రధానంగా A, B, C, D మరియు E అనే ఐదు రకాల వైరస్‌ల వల్ల వస్తుంది. వీటిలో హెపటైటిస్ B, C రకాలు అత్యంత ప్రమాదకరమైనవి. ఇవి కాలక్రమేణా తీవ్రరూపం దాల్చి కాలేయ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్ వంటి ప్రాణాంతక పరిస్థితులకు దారితీస్తాయి. కలుషితమైన ఆహారం, నీటిద్వారా హెపటైటిస్ A,E వ్యాపిస్తే ...రక్తం, సురక్షితం కాని శృంగారం, తల్లి నుండి బిడ్డకు హెపటైటిస్ B, C,D రకాలు సంక్రమిస్తాయి. ప్రారంభ దశలో లక్షణాలు పెద్దగా కనిపించకపోవడం వల్ల దీనిని 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తారు.

ఈ సంవత్సరం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం 'ఇది వేచి ఉండదు: కాలేయ రక్షణే మన ప్రాథమ్యం' అనే నినాదంతో ముందడుగు వేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యాల ప్రకారం 2030 నాటికి వైరల్ హెపటైటిస్‌ను అంతం చేయడమే ప్రధాన ధ్యేయం. అయితే, అవగాహన రాహిత్యం, గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో లేకపోవడం, వ్యాక్సిన్లపై సరైన సమాచా రం లేకపోవడం ఈ లక్ష్యానికి ప్రధాన ప్రతిబంధకాలుగా మారాయి. హెపటైటిస్ A, B రకాలకు సమర్థవంతమైన టీకాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా పుట్టిన వెంటనే పిల్లలకు హెపటైటిస్–బి టీకా అందించడం అత్యంత ఆవశ్యకం. అలాగే హెపటైటిస్–సిని నయం చేయడానికి ఇప్పుడు అద్భుతమైన యాంటివైరల్ మందులు అందుబాటులోకి వచ్చాయి.

**భవిష్యత్తు కార్యాచరణ మరియు బాధ్యత**

హెపటైటిస్ రహిత ప్రపంచాన్ని ఆవిష్కరించాలంటే ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య నిపుణులు కలిసికట్టుగా విస్తృతస్థాయి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ప్రత్యేక శిబిరాలు నిర్వహించి హెపటైటిస్ టీకాలు, స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా లేదా తక్కువ ధరలకే అందుబాటులోకి తేవాలి. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తమ కాలేయాన్ని కాపాడుకోవడమే కాకుండా, సమాజంలో తోటివారికి కూడా అవగాహన కల్పించాలి. కాలేయాన్ని కాపాడుకోవడం అంటే జీవితాన్ని కాపాడుకోవడమే అనే సత్యాన్ని గ్రహించి, ప్రతి ఒక్కరూ హెపటైటిస్ నివారణకు నడుం బిగించాలి.

*(జులై 28 ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం)*

సుధాకర్.ఏ.వి, 9000674747

# సంచలనం సృష్టించిన తరిమెల నాగిరెడ్డి కుట్రకేసు!

**ముప్పాళ్ళ భార్గవ శ్రీ**
**98481 20105**

1969 డిసెంబర్ 19వ తేదీన మద్రాసులోని అన్నా నగర్‌లోని ఒక ఇంటిలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్ట్ విప్లవకారుల రాష్ట్ర కమిటీ సమావేశం రహస్యంగా జరుగుతున్న మొదటి రోజున పోలీసులు దాడిచేసి రాష్ట్ర కమిటీ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో దేవులపల్లి వెంకటేశ్వరరావు(డి వి), తరిమెల నాగిరెడ్డి (టిఎన్) తదితర నాయకులు ఉండగా చంద్ర పుల్లారెడ్డి అనుకున్న సమయానికి రాని ఫలితంగా అరెస్టు కాలేదు. మద్రాసు సమావేశానికి హాజరైన నాయకులతో పాటు మరి కొంతమంది ముఖ్య నాయకులను కలిపి మొత్తం 68 మందిపై ఆనాడు కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా, జలగం వెంగళరావు హోం మంత్రిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్ర భారత చరిత్రలో రాజకీయ ప్రేరేపితమైన తొలి కుట్రకేసును బనాయించింది. దానికి ప్రభుత్వం పెట్టినపేరు 'హైదరాబాదు కుట్రకేసు' అయితే అది జనంలో 'నాగిరెడ్డి కుట్రకేసు'గా బహుళ ప్రచారం పొందింది.

దీనికి ముఖ్యమైన కారణం వీరిపై పెట్టబడిన కుట్ర కేసును డివి, టియన్‌లు స్వయంగా వాదించి.. మేము ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి కుట్రపన్నలేదు, కమ్యూనిస్టులు ఎప్పుడూ తమ భావాలను బాహాటంగా ప్రకటిస్తారని.. ప్రకటించి సంచలనం సృష్టించారు. వీరు స్వయం గా కోర్టులో వాదించటానికి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, భారత విప్లవోద్యమంలోనూ నాటి విప్లవకారులు నెలకొల్పిన విప్లవ సాంప్రదాయాల వెలుగులో డివి, టిఎన్ లు నడిచారు. వారికి ప్రేరణ కలిగించిన వాటిలో ముఖ్యమైనది రీచ్ స్టాగ్ కుట్ర కేసు. బల్గేరియా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు జార్జ్ డిమిట్రావ్ బెర్లిన్ లోని పార్లమెంటు భవనం రీచ్ స్థాగ్ ని తగలబెట్టారనే నెపంతో పెట్టిన కుట్రకేసులో డిమిట్రోవ్ తాను స్వయంగా కోర్టులో వాదించి నిర్దోషిగా బయటపడి సంచలనం సృష్టించారు. మనదేశంలో బ్రిటిష్ వాళ్ళ చేత పెట్టబడిన మీరట్, కాన్పూర్ కుట్రకేసుల్లో ముద్దాయిలు కోర్టులో తాము కమ్యూనిస్టులమని సగర్వంగా ప్రకటించుకున్నారు. టిఎన్, డివిలు కుట్ర కేసుల విషయంలో ఆనాటి కమ్యూనిస్టు నాయకులు పెట్టిన వరవడిని ఆదర్శంగా తీసుకున్నారు.

మద్రాసులో అరెస్టయిన వీరిపై పెట్టబడిన కుట్ర కేసును 1969 ఏప్రిల్ నెలలో కృష్ణా జిల్లా అట్లప్రగడలో రహస్యంగా జరిగిన రాష్ట్ర ప్లీనములో ఆమోదించిన 'తక్షణ కార్యక్రమం' డాక్యుమెంట్ ఆధారంగా ప్రభుత్వం బనాయించింది. జనతా ప్రజాతంత్ర విప్లవ దశలో కమ్యూనిస్టు విప్లవకారుల వ్యూహం – ఎత్తుగడల స్థూల రూపమే ఈ తక్షణ కార్యక్రమం. ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు కమిటీ ప్రకటించిన 'తక్షణ కార్యక్రమం' ఆధారంగా దాన్ని ఈ ప్రభుత్వాన్ని కూల్చటానికి పన్నిన కుట్రగా ముద్రవేయడానికి పూనుకుంది. 1970 జూన్‌లో ఈ కుట్ర కేసు విచారణ హైదరాబాద్ అదనపు సెషన్స్ జడ్జి కోర్టులో జరిగిన సందర్భం లో డివి, టిఎన్ లు కమ్యూనిస్టు విప్లవకారులు రూపొందించిన మౌలిక డాక్యుమెంటు అయిన 'తక్షణ కార్యక్రమం'ను సొంతం చేసుకొని, దాన్ని పూర్తిగా సమర్థిస్తూ తమ వాదనలను దృఢం గా వినిపించారు. అంతేకాదు ఈ కేసులో తమకు తీవ్రమైన శిక్షలు పడతాయని తెలిసికూడా పార్టీ విధానాలను సమర్థించాలనే నిర్ణయం తీసుకుని కమ్యూనిస్టుల విప్లవ సంప్రదాయాలకు పట్టం కట్టారు. అందరూ ఊహించినట్టుగానే హైదరాబాద్ లోని సెషన్స్ కోర్టులో 48 మంది ముద్దాయిలను విచారించి 18 మందికి నాలుగు సంవత్సరాల మూడు నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. హైకోర్టు ఈ శిక్షలను ఖరారు చేసింది. 1972 మే నెలలో కఠోరమైన బెయిల్ కండిషన్స్ పైన జైలులో ఉన్న నాయకులు బయటకు వచ్చారు. 1975 జూన్ 25వ తేదీన ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించడం తో ఈ కుట్ర కేసులో ఉన్న ముఖ్య నాయకులందరూ డివి, టిఎన్‌లతో సహా రహస్యజీవితానికి వెళ్లిపోయారు.

కామ్రేడ్స్ డివి, టిఎన్‌లు ఈ కుట్రకేసులో జైల్లో ఉన్న కాలంలో జైలును ఒక అధ్యయన కేంద్రంగా మార్చుకున్నారు. 'కమ్యూనిస్టు విప్లవకారుల వ్యూహం ఎత్తుగడలు' అన్న స్టేట్ మెంట్ ను కుట్రకేసులో ఉన్న అందరి తరపున డి.వి తయారుచేసి కేసు విచారణ సందర్భంగా కోర్టులో వివరించారు. ఈ ప్రకటన డివి స్టేట్మెంట్ గా బహుళ ప్రచారం పొందింది. జైలు జీవితంలో ఉన్న టిఎన్ 'తాకట్టులో భారతదేశం' పేరుతో తగిన గణాంక వివరాలతో సమకాలీన జాతీయ అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ పరిణామాలను 'తక్షణ కార్యక్రమం' కు అన్వయించి రాసిన స్టేట్మెంట్ను టిఎన్ కోర్టులో రెండు గంటలపాటు ఎంతో శక్తివంతంగా వివరించారు. కమ్యూనిస్టు విప్లవకారులమైన మేము ప్రజాయుద్ధ సిద్ధాంతాన్ని ఎందుకు నమ్ముతున్నామో వివరించారు. ప్రభుత్వం కుట్ర



కా|| తరిమెల నాగిరెడ్డి
జననం: 11-2-1917 మరణం: 28-7-1976

కేసు ద్వారా విప్లవకారులపై ఏవైతే ఆరోపణలు చేసిందో వాటిని రాజకీయంగా సమర్థించుకుంటూ కోర్టులో బాహాటంగా ప్రకటించటం విప్లవకారుల ప్రతిష్టను ఎవరెస్ట్ శిఖరం అంత ఎత్తుకు పెంచింది.

ఈ కుట్ర కేసులో పెట్టబడిన ముద్దాయిలు డివి, టిఎన్ లతో సహా ముఖ్య నాయకులు పి రామనర్సయ్య, నీలం రామచంద్రయ్య, మాదల నారాయణ స్వామి, వసంతాడ రామలింగాచారి, మండ్ల సుబ్బారెడ్డి, ఎన్ వి కృష్ణయ్య, చల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పుల మోహన్ రెడ్డి తదితరులు వివిధ కారణాలతో చనిపోయారు. అయితే జూలై నెలకున్న ప్రాధాన్యత ఏమిటంటే ఈ కుట్ర కేసులోని ప్రముఖ నాయకులు డివి అనారోగ్యంతో జులై 12, 1984లో చనిపోగా, టిఎన్ ఎమర్జెన్సీ కాలములో రహస్యంగా ఉంటూ అనారోగ్యంతో హైదరాబాదు ఉస్మానియా హాస్పిటల్‌లో జులై 28, 1976లో చనిపోయారు. రాజీలేని పోరాటం సాగించిన భారత విప్లవోద్యమ ముద్దుబిడ్డలు డివి, టిఎన్ లకు విప్లవ జోహార్లు అర్పిద్దాం!

## ''పదిపెట్టి గుణకారం చేసిన మంచితనం'' తరిమెల నాగిరెడ్డి

**చెరుకూరి సత్యనారాయణ**

''ఇప్పటి వరకూ కమ్యూనిస్టులంటే నాకు చాలా చులకన భావం వుండేది. ఈ రోజు నీ ఉపన్యాసం విన్న తర్వాత ఆ భావం పోవటమేగాక మీ పార్టీపై గౌరవభావం ఏర్పడింది'' మద్రాసు నగరంలో 1952లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రతిపక్ష నాయకునిగా వున్న సిపిఐ నాయకులు తరిమెల నాగిరెడ్డి మూడు గంటలు ఉపన్యాసమిచ్చి అలసిపోయి క్వార్టర్సుకి వెళ్ళి నిద్రపోతుంటే ఆయన లేచిన దాకా వేచి వుండి ప్రఖ్యాత చరిత్రకారులు, రచయిత వెల్లంపల్లి సోమశేఖర శర్మ గారన్న మాటలవి. ఆనాటి ఆందోళన ఫలితంగా కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర శాసనసభలో కూడా నాగిరెడ్డి గారే ప్రతిపక్ష నాయకులు. రాజాజీ, ప్రకాశం పంతులు లాంటి ఉద్దండులైన ముఖ్యమంత్రుల ముందు ప్రతిపక్ష నాయకునిగా అధికారపక్షంతో సమానంగా బలమున్న కమ్యూనిస్టు పక్షనాయకునిగా రాణించి అసాధారణమైన ప్రతిభ కన్పరచి ప్రజల జేజేలు అందుకున్న వ్యక్తి తరిమెల నాగిరెడ్డి.

తరిమెల నాగిరెడ్డి గారు ప్రముఖ పాత్రికేయులు విద్వాన్ విశ్వం గారితో కల్సి వారి స్వగ్రామం తరిమెల వీధి బడిలో చదివారు. జిడ్డు కృష్ణమూర్తి గారు స్థాపించిన ఋషివ్యాలి స్కూలుకు ఆర్థికంగా భూరి విరాళ మిచ్చిన నీలం చిన్నపరెడ్డి, తరిమెల సుబ్బారెడ్డి గార్లు వారి పెద్దకుమారులైన నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి గార్లని ఆ స్కూలులో చేర్పించారు. అక్కడి నుండి మద్రాసు అడయార్ (గిండీ)లోని థియోసాఫికల్ స్కూల్ లో చేరిన నాగిరెడ్డి అనిబిసెంట్ స్వయం పర్యవేక్షణలో పెరిగారు. ఆ తర్వాత మద్రాసు లయోలా కాలేజీ లో చదివారు. ఇక్కడే జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. లయోలా కాలేజ్ వాతావరణం జాతీయోద్యమానికి వ్యతిరేకంగా ఉందనే అభిప్రాయంతో తర్వాత చదువులకు కాశీ (బెనారస్) హిందూ విశ్వ విద్యాలయానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. తండ్రి సుబ్బారెడ్డికి ఇష్టం లేకపోయినా ఆనాటి రాయలసీమ కాంగ్రెసు నాయకులు కల్లూరి సుబ్బారావు గారిని తోడుగా ఇచ్చి నాగిరెడ్డిని బెనారస్ పంపించాడు. నాగిరెడ్డితో పాటు నీలం రాజశేఖరరెడ్డి కూడా బెనారస్‌కి బయలు దేరాడు. వీరు బెనారస్ వెళ్తూ దారిలో వార్ధాలో దిగి గాంధీ ఆశ్రమానికి వెళ్ళారు.

నాగిరెడ్డి 1939లో బెనారస్ విశ్వవిద్యాలయం విద్యార్థి యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ పదవికి ఎన్నికైన తొలి దక్షిణ భారతీయుడు నాగిరెడ్డే. అప్పటికే ఆయన అచ్యుత పట్వర్ధన్, కమలాదేవి ఛటోపద్యాయ, జయప్రకాష్ నారాయణల వలన ప్రభావితుడై గాంధీ మార్గంపై విశ్వాసం సడలి, సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనే శక్తి కమ్యూనిజానికి ఉందని నమ్మి పార్టీ సభ్యుడిగా మారాడు. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటి సభ్యులు భరద్వాజ గారి ద్వారా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కమ్యూనిస్టు సాహిత్యం విరివిగా చదివాడు.లా డిగ్రీ తీసుకుని వచ్చి ప్రాక్టీసు చేస్తాడని ఆశతో అనంతపురం క్లాక్‌టవర్ సెంటర్‌లో పెద్ద మేడ కట్టించి ఎదురుచూస్తున్న ఆయన తండ్రి సుబ్బారెడ్డి లా డిగ్రీ లేకుండా రెండు ట్రంకు పెట్టెల నిండా కమ్యూనిస్టుల సాహిత్యం తీసుకుని రైలుదిగిన కుమారుణ్ణి చూసి హతాశుడయ్యాడు. ఇక తను ఊహించే స్థాయికి నాగిరెడ్డి పనికి పనికిరాడని నిర్ణయించుకొని తన అల్లుడు మేనల్లుడు అయిన నీలం సంజీవరెడ్డి ఎదుగుదలకు తోడ్పడాలని నిర్ణయించుకున్నాడు.

ఆ నిర్ణయంతో సుబ్బారెడ్డి కొడుక్కి, అతను నాయకునిగా వున్న కమ్యూనిస్టు పార్టీ, పార్టీకి అండగా వున్న తరిమెల గ్రామ పేద ప్రజలకు వ్యతిరేకంగా మారి, ప్రజలపై అక్రమ కేసులు బనాయిస్తూ భూములనుండి బేదఖల్ చేస్తూ అజ్ఞాతంలో వున్న నాగిరెడ్డిని పట్టుకునేందుకు కాపలా మనుషుల్ని ఏర్పాటు చేసి పార్టీ కదలికలు పోలీసులకు చేరవేస్తూ ప్రజా కంటకునిగా మారటంతో తండ్రిని చంపాలనే నిర్ణయానికి వచ్చిన నాగిరెడ్డి ఆ విషయాన్నే తెలియజేస్తూ తండ్రికి లేఖ రాశాడు. ఈ విషయాలన్నీ వివరిస్తూ సోదరుడు కృష్ణారెడ్డికి మరో ఉత్తరంరాస్తూ విషయాలన్నీ తల్లికి తెలియజేయమని కోరాడు. పార్టీలో కొందరు ఆమోదించనందున ఇతరత్రా కారణాల వలన సుబ్బారెడ్డిని చంపటం కార్యరూపం దాల్చలేదు. ఈలోగా ముఖ్యమంత్రి సంజీవరెడ్డి గ్రామంలో బహిరంగ సభ జరిపి తన మామకు ఏమైనా హాని జరిగితే గ్రామంలోని కమ్యూనిస్టులందర్నీ కాల్చి చంపి, వారి గృహాల్ని నేలమట్టం చేస్తామని సంజీవరెడ్డి రెచ్చగొట్టాడు. తండ్రికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిల్చిన నాగిరెడ్డి ప్రజా నాయకునిగా జిల్లాలో స్థిరపడ్డాడు. తర్వాతి కాలంలో ఎన్నికలు జరగటం 1952లో సంజీవరెడ్డిపై జైలు నుండే నాగిరెడ్డి గెలవటం, సురక్షితమైన అనంతపురం నియోజకవర్గం వదలి పుట్లూరు నియోజకవర్గానికి మారి 55 మధ్యంతర ఎన్నికల్లో నాగిరెడ్డి ఓడిపోయి 1957 ఎన్నికల్లో అనంతపురం నుండి పార్లమెంటుకి ఎన్నిక కావటం, 1962లో పుట్లూరు నుండే గెలవటం, 55, 62 రెండుసార్లూ తన కజిన్ రామచంద్రారెడ్డే ప్రత్యర్థిగా వుండటం, 1967లో అనంతపురం నుండి శాసనసభకు ఎన్నికవ్వటం అంతా ఒక చరిత్ర. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభలోనూ, కర్నూలు రాజధానిగా వున్న శాసనసభలోనూ ప్రతిపక్ష నాయకునిగా, 1962 తర్వాత ప్రతిపక్ష ఉపనాయకునిగా (గన్నవరం నుండి శాసనసభకు ఎన్నికైన సుందరయ్య గారు అప్పుడు ప్రతిపక్ష నాయకునిగా వున్నారు) 57 నుండి 62 వరకు కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన నాగిరెడ్డి 1966లో విశాఖ ఉక్కు ఉద్యమంలో భాగంగానూ, 1969లో చట్టసభలపై విశ్వాసం కోల్పోయాననే కారణంతోనూ శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు.


**( జులై 28న టిఎన్ వర్ధంతి సందర్భంగా )**

# భారత విద్యావ్యవస్థలోని లోతైన సంక్షోభం

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థ పై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు. ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్–జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. అందువల్ల ఈ ఉద్యమం ఒక పరీక్ష గురించి మాత్రమే కాకుండా, ఒక తరం భవిష్యత్తు గురించి సాగిన పోరాటంగా మారింది.

ఈ పరిణామం రాజకీయ బాధ్యత గురించి కూడా ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూల స్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియ కూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణ లో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది.

విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం మరియు శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటిస్తూ, పోలీసు చర్యలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పౌరహక్కులను గౌరవించే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యం విభేదాలను అణచివేయడం వల్ల కాదు; ప్రజల ఆందోళనలను నిర్మాణాత్మకంగా వినడంవల్ల బలపడుతుంది.



సమకాలీన రాజకీయ చర్చలను ప్రభావితం చేయడం లో సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఎంతో పెరిగింది. మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, డిజిటల్ ప్రచారాలు ప్రజల దృష్టిని ఆకర్షించే శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అయితే అవి సంక్లిష్టమైన విధాన చర్చలను అతిగా సరళీకరించే ప్రమాదం కూడా ఉంది. ప్రజాభిప్రాయం వైరల్ కథనాల కంటే ఆధారాలతో కూడిన సమాచారంపై ఆధారపడాలి. అదే విధంగా, ఈ–20 ఇథనాల్ మిశ్రమ ఇంధనం చుట్టూ జరిగిన చర్చలు ప్రజల విశ్వాసం పారదర్శకమైన శాస్త్రీయ సమాచారంపై ఆధారపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, సాంకేతిక మార్పులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు నిరంతర ప్రజా చర్చకు లోనవ్వాలి. ప్రజలకు ప్రయోజనాలు, ఖర్చులు, దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన ఆధారాలతో కూడిన సమాచారం అందించాలి. ఈ రాజీనామా భారత రాజకీయాల్లో ఒక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రజల నిరంతర ఒత్తిడి ప్రభుత్వాలను తమ నిర్ణయాలను పునఃపరిశీలించడానికి దారితీయగలదనే విషయాన్ని ఇది సూచిస్తుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది తీర్పు భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి సంఘటనలు కాలక్రమేణా పౌరులు– ప్రభుత్వాల సంబంధాన్ని పునర్నిర్వచిస్తాయి.

అత్యంత ముఖ్యంగా, భారత విద్యా సంక్షోభం ప్రశ్నాపత్రాల లీకులతో మాత్రమే పరిమితం కాదు. పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం, విద్యాసంస్థల్లో ఖాళీలు, ఉన్నత విద్యలో తగిన పెట్టుబడుల కొరత, విద్యా రంగం వాణిజ్యీకరణ– ఇవన్నీ కలిసి విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. విద్యా పరిపాలనలో సమగ్ర సంస్కరణలు లేకుండా పరీక్షా సంస్కరణలు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించలేవు. భారతదేశానికి అత్యవసరంగా సమగ్ర పరీక్షా సమగ్రత వ్యవస్థ అవసరం. సురక్షితమైన డిజిటల్ మౌలిక వసతులు, స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలు, బలమైన సైబర్ భద్రతా వ్యవస్థ లు, నియామక ప్రక్రియల పారదర్శక ఆడిట్లు, పరీక్షా మోసాలపై వేగవంతమైన న్యాయ చర్యలు, సమాచార బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ, పోటీ పరీక్షలకు దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులకు మానసిక సలహా, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలి. చివరికి, ఏ విద్యార్థి ఉద్యమానికైనా నిజమైన విజయాన్ని కేవలం ఒక మంత్రి రాజీనామాతో కొలవలేం. అది శాశ్వతమైన సంస్థాగత సంస్కరణలకు దారితీస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. రాజకీయ విజయాలు తాత్కాలికం; నిర్మాణాత్మక సంస్కరణలే శాశ్వత మార్పును తీసుకువస్తాయి. విద్య అనేది కేవలం పరిపాలనా రంగం కాదు; అది కోట్లాది భారత యువత కలలు, ఆశయాలు, భవిష్యత్తుకు ప్రతీక. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో, విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు రక్షించడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడంలో జాతీయ ప్రాధాన్య అంశాలు మారాలి. అప్పుడే భారతదేశం ప్రజల ఆగ్రహాన్ని అర్థవంతమైన విద్యా సంస్కరణలు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనంగా మార్చగలదు.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

## తెలంగాణ అభివృద్ధి కోసం
# కేంద్రంతో సమన్వయం

తాడిచెర్ల-2 ప్రాజెక్టును వేగవంతం చేయాలి

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.10వేల పెన్షన్ అందించాలి

కేంద్ర మంత్రులను కోరిన మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపి వంశీకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ, కార్మిక సంక్షేమం, గనుల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తామని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ సోమవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ముందుగా కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయను కలిసి తెలంగాణలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల విస్తరణతో పాటు కేంద్ర పథకాల అమలులో రాష్ట్రానికి మరింత సహకారం అందించాలని కోరారు. అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని కలిసి యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల విస్తరణపై చర్చించారు. అనంతరం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తాడిచెర్ల–2 బొగ్గు గని ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పూర్తయితే స్థానిక యువతకు కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద సమగ్ర పునరావాసం కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీసం నెలకు రూ.10 వేల పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. అలాగే సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర సహకారం అందించాలని కోరారు. మంత్రి వివేక్ వెంకటస్వామి సమర్పించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ‘నీటి సంరక్షణ’ను ఉద్యమంగా నిర్వహించాలి

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటి సంరక్షణ కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొని, ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు కృషిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ కార్యక్రమం ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉన్నదన్నారు. వర్షం నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా భూగర్భ జలాలను పెరుగుతాయని సీతక్క సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం జల సంరక్షణ బాధ్యతను స్వీకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘తెలంగాణ జలసిరి’ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంగా విజయవంతం చేయాలన్నారు.

మహిళా సంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ నీటి సంరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మించాలనే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఈ నిర్మాణాల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని వివరించారు.


తెలంగాణా ప్రభుత్వము

ఫారం-6

(ప్రాథమిక ప్రకటన)

(చట్టం 30/2013 లోని 11(1) మరియు సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

| | |
|---|---|
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ ఆర్.సి.నెం. బి /342//2024 | తేది: 10-07-2026 |
| జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2033/2026 | తేది: 13-07-2026 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/33/2026 | తేది: 18-07-2026 |

ఈ దిగువ నిర్దిష్ట పరచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా **బూర్గంపాడు** మండలం, **ఇరవెండి** గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎ.3-06 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమ్మిత్తం అనగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద డిస్ట్రిబ్యూటరి కెనాల్-1L (LM2), ప్యాకేజి నెం.1, ఇరవెండి గ్రామము వద్ద ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించినందున భూసేకరణ, పుణరావాస, పునఃనిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారిచేయనైనది. భూసేకరణ వలన భూనిర్వాసితులయ్యే కుటుంబాలు ఏమియులేవు. నిర్వాసిత కుటుంబాల పుణరావాస, పునఃనిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించబడినారు. కావున ఈ ప్రాజెక్ట్ క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా **బూర్గంపాడు** మండలం, **ఇరవెండి** గ్రామంలోని విస్తీర్ణం **ఎ.3-06 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధంగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచయనైనది.

షెడ్యూల్

షెడ్యూల్ గ్రామం:: ఇరవెండి మండలం:: బూర్గంపాడు జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం

| క్ర. సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి స్వభావం (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించవలసిన విస్తీర్ణం | భూమి (యాజమాన్యం) | అనుభవదారుని పేరు | కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 95/2 | 95/A | పట్టా | మెట్ట | 0.07 | కంభంపాటి నాగభూషణం | పగడాల కృష్ణారెడ్డి తం: సత్తిరెడ్డి | లేవు |
| 2 | 95/2 | 94/AA/1 | పట్టా | మెట్ట | 0.23 | పగడాల వీరారెడ్డి తం: పద్మారెడ్డి | పగడాల వీరారెడ్డి తం: పద్మారెడ్డి | లేవు |
| 3 | 95/2 | 94/AA/2 | పట్టా | మెట్ట | 0.16 1/2 | పగడాల రామిరెడ్డి తం: పద్మారెడ్డి | పగడాల రామిరెడ్డి తం: పద్మారెడ్డి | లేవు |
| 4 | 96/1/2 | 96/2/UU | పట్టా | మెట్ట | 0.12 | బద్ది సోమయ్య తం: రామలింగయ్య | బద్ది సోమయ్య తం: రామలింగయ్య | లేవు |
| 5 | 96/1/2 | 96/6/AA/1 | పట్టా | మెట్ట | 0.14 | గొడుగు యల్లయ్య తం: కృష్ణయ్య | గొడుగు యల్లయ్య తం: కృష్ణయ్య | లేవు |
| 6 | 96/1/2 | 96/6/AA/2/1 | పట్టా | మెట్ట | 0.02 | గొడుగు వీరయ్య తం: కృష్ణయ్య | గొడుగు వీరయ్య తం: కృష్ణయ్య | లేవు |
| 7 | 96/1/2 | 96/6/E/1 | పట్టా | మెట్ట | 0.11 | బద్ది సాయిలు తం: మల్లయ్య | బద్ది సాయిలు తం: మల్లయ్య | లేవు |
| 8 | 96/1/2 | 96/6/E/2 | పట్టా | మెట్ట | 0.09 | బద్ది శ్రీశైలం | కోమటిరెడ్డి అంజిరెడ్డి తం: లింగారెడ్డి | లేవు |
| 9 | 96/1/2 | 96/6/U | పట్టా | మెట్ట | 0.00 1/2 | బద్ది వీరయ్య తం: రామలింగయ్య | బద్ది వీరయ్య తం: రామలింగయ్య | లేవు |
| 10 | 96/1/2 | 95/A | పట్టా | మెట్ట | 0.08 1/4 | కంభంపాటి నాగభూషణం | బద్ది రాములు తం: రామలింగయ్య | లేవు |
| 11 | 96/1/2 | 95/A | పట్టా | మెట్ట | 0.10 1/4 | కంభంపాటి నాగభూషణం | బద్ది వెంకన్న తం: రామలింగయ్య | లేవు |
| 12 | 96/1/2 | 96/1/EE | పట్టా | మెట్ట | 0.08 | మందడి అనసుర్య W/o వీరారెడ్డి | పగడాల కృష్ణారెడ్డి తం: సత్తిరెడ్డి | లేవు |
| 13 | 117/15/2 | 117 | పట్టా | మెట్ట | 0.01 3/4 | ప్రభుత్వ భూమి | రోడ్డు | లేవు |
| 14 | 117/15/2 | 117/14/1 | పట్టా | మెట్ట | 0.02 3/4 | ధర్మపురి కస్తూరి రంగయ్య తం: అప్పయ్య | అల్లివరపు సాయి రెడ్డి తం: అంజిరెడ్డి | లేవు |
| | | మొత్తం విస్తీర్ణం | | | 3-06 | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాశితులు పునరావాసం మరియు పునఃనిర్మాణం చట్టం, 2013 (నెం.30/2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబదిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమీయొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్& ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ గారి కార్యాలయంలో ఉంచనైనది సంబధిత వ్యక్తులు ఏదైన పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖి చేసుకోవచ్చును.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి.యూనిట్-I, పాల్వంచ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణ సంబంధిత సెక్షన్12 ప్రకారం పైతెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టాడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారిచేసిన తేదినుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూమి హక్కు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టారాదు.

భూసేకరణ విషయాలో సంబందించిన భూయజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టం 15వ విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం /భూసేకరణ అధికారి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ వారికి ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినములలోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసి ఉన్నది.

| సం/- | సం/- | సం/- |
|---|---|---|
| యం.వి.రవింద్రనాథ్ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్ట్, యూనిట్-1, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | డి.వేణుగోపాల్ అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | అంకిత్ ఐ.ఏ.ఎస్., కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా |

DIPR RO NO. 535/LA/PP/Advt/Pub/2026-27


## తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలి

ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిహార్‌లో అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు రౌషన్ కుమార్ సిన్హా సహా ఇతర విద్యార్థి, యువజన నాయకులపై నమోదు చేసిన తప్పుడు, రాజకీయ ప్రేరేపిత ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. అక్రమ కేసులను నిరసిస్తూ సోమవారం ఎఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, విద్యార్థులపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా ఎఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, నాయకులు షేక్ మహమూద్, మొగిలి లక్ష్మణ్, సైఫ్ అలీ ఖాన్, కళ్యాణ్ సి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌ను రద్దు చేసి రాష్ట్రాలకే ప్రవేశ పరీక్షల
# నిర్వహణ బాధ్యత అప్పగించాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

నీట్ పేపర్ లీకేజ్ వలన చనిపోయిన విద్యార్థులకు నివాళులు అర్పించిన సిపిఐ

హనుమకొండలో కాళోజి సెంటర్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ




**ప్రజాపక్షం/హనుమకొండ :** నీట్ వంటి కేంద్రీకృత ప్రవేశ పరీక్షలను రద్దు చేసి, రాష్ట్రాలే తమ పరిస్థితులకు అనుగుణంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే హక్కును కల్పించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విద్యను సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్రాల హక్కుగా పరిగణించాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వలన ప్రాణాలు కోల్పోయిన విద్యార్థినీ విద్యార్థులకు సిపిఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ కాళోజి సెంటర్ వద్ద సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఐక్యంగా సాగించిన ఉద్యమ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, సిబిఎస్ఇ మూల్యాంకనంలో జరిగిన వైఫల్యాలు, సియుఇటీ పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఎ చేసిన తప్పిదాలు, విద్యా కేంద్రీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్బంధంతో అణచివేయాలని ప్రయత్నించిందని విమర్శించారు.ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ సందర్భంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీచార్జీలు, భాష్పవాయువు ప్రయోగాలు, పెల్లెట్ దాడులు వంటి దమనకాండకు పాల్పడిందన్నారు. ఈ నిర్బంధాలను ఏమాత్రం లెక్కచేయకుండా ధైర్యంగా ఎదుర్కొని, తమ రక్తాన్ని చిందించి ఉద్యమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, యువతకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోనే పోరాటం ముగియలేదని, దేశ విద్యా వ్యవస్థను కాపాడేందుకు విద్య కేంద్రీకరణ విధానాలను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు, ఎన్‌టిఎను రద్దు చేసే వరకు, జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి 2020)ను ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, హనుమకొండ మండల కార్యదర్శి అశోక్ స్టాలిన్, నాయకులు ఏదునూరి వెంకటరాజం, కొట్టేపాక రవి, గుంటి రాజేందర్, మాలోతు మంగ తదితరులు పాల్గొన్నారు.

# మరింత మెరుగైన వైద్యాన్ని అందించాలి

బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి మరింత మెరుగైన వైద్యాన్ని అందించాలని బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కె.చంద్రశేఖర్‌రావు వైద్యులకు సూచించారు. సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి చికిత్స అందుతున్న ఐసియు వార్డ్‌కు చేరుకుని వైద్యులతో కెసిఆర్ మాట్లాడారు. ఐసియులో ఉన్న సుదర్శన్ రెడ్డిని చూసి ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. దాదాపు అరగంట సేపు అక్కడే ఉండి వైద్యులతో చికిత్స అందుతున్న తీరుపైన ఆరా తీశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని కెసిఆర్‌కు వైద్యులు తెలిపారు.

అనంతరం సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు భార్య స్వప్న, కొడుకు నిదర్శన్ రెడ్డి, కూతురు ధర్మిష్ట, సోదరులు శ్రీనివాసరెడ్డి రవీందర్ రెడ్డి, సోదరి స్వాతి తదితరులతో కెసిఆర్ మాట్లాడి, వారికి ధైర్యాన్ని, భరోసాను నింపారు.

అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ఓదార్చారు. కెసిఆర్ వెంట మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, మాజీ ఎంపిలు బోయినపల్లి వినోద్ కుమార్, జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు గ్యాదరి బాలమల్లు, సతీష్ రెడ్డి, రజిని సాయి చంద్, పల్లె రవికుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తాం: మంత్రి సీతక్క**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిక్సిత పొందుతున్న సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిని మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సోమవారం సందర్శించారు.

పెద్ది సుదర్శన్ రెడ్డికి అందుతున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

# బలోపేతమైన ఎఫ్ఎస్ఎల్

కొత్తగా 57మంది శాస్త్రీయ నిపుణుల చేరిక

డిఎన్ఎ, సైబర్, నార్కోటిక్స్ కేసుల దర్యాప్తు మరింత వేగవంతం : డిజిపి సివి ఆనంద్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (టిజిఎఫ్ఎస్ఎల్)లో 57 మంది కొత్త శాస్త్రీయ సిబ్బందిని నియమించడంతో సంస్థ శాస్త్రీయ సామర్థ్యం మరింత బలోపేతమైంది. హైదరాబాద్‌లోని టిజిఎఫ్ఎస్ఎల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ డిజిపి సివి ఆనంద్ నూతనంగా ఎంపికైన సిబ్బందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి, ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయెల్ మాట్లాడుతూ కొత్తగా చేరిన సిబ్బందికి సంస్థ పనితీరు, సామర్థ్యాలు, విజయాలు, భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం శాస్త్రీయ సిబ్బంది కొరత ఉన్నప్పటికీ టిజిఎఫ్ఎస్ఎల్ తనకు వచ్చే కేసుల్లో 80 శాతానికి పైగా పరిష్కరిస్తోందని తెలిపారు. 2025 సంవత్సరంలో మొత్తం 18,647 కేసులను పరిశీలించి 86 శాతం డిస్పోజల్ రేటు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రాధాన్యమైన, కాలపరిమితి ఉన్న కేసులను నిర్ణీత గడువులో పూర్తి చేసి పోలీసు దర్యాప్తుకు సకాలంలో ఫోరెన్సిక్ సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డిఎన్ఎ విశ్లేషణ, కంప్యూటర్ ఫోరెన్సిక్స్, నార్కోటిక్స్, టాక్సికాలజీతో పాటు ఇతర ఫోరెన్సిక్ విభాగాల్లో అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న మాదకద్రవ్యాలు, డిజిటల్ నేరాల దర్యాప్తు అవసరాలకు అనుగుణంగా ప్రయోగశాలలను మరింత ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా నియమితులైన 57 మందిలో 36 మంది పిహెచ్‌డి, 12 మంది ఎంఎస్సీ, 6 మంది ఎం.టెక్, ముగ్గురు ఎంసిఎ అర్హతలు కలిగిన నిపుణులని పేర్కొన్నారు. వీరి చేరికతో రాష్ట్రంలో శాస్త్రీయ ఆధారాలపై జరిగే దర్యాప్తు మరింత వేగవంతంగా, నాణ్యంగా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ డిజిపి కొత్తగా చేరిన శాస్త్రీయ సిబ్బందిని అభినందించారు. కొత్త క్రిమినల్ చట్టాల అమలులో శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యం మరింత పెరిగిందని, ప్రతి కేసులో నాణ్యతకు భంగం కలగకుండా వేగంగా, కచ్చితత్వంతో ఆధారాలను పరిశీలించాలని సూచించారు. తమ శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి శాస్త్రీయ దర్యాప్తుకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. పరిమిత సిబ్బంది, వనరులతోనూ టిజిఎఫ్ఎస్ఎల్ సమర్థవంతంగా పనిచేస్తోందని డిజిపి ప్రశంసించారు. కొత్తగా చేరిన 57 మంది అత్యున్నత అర్హతలున్న శాస్త్రీయ నిపుణులతో ప్రయోగశాల సామర్థ్యం మరింత పెరుగుతుందని, అవసరమైన మౌలిక సదుపాయాలు, అధునాతన పరికరాలు, సిబ్బంది బలోపేతానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోతే ‘కాక్రోచ్’ తరహా ఉద్యమం

ఆగస్టులో బిసి విద్యార్థులతో మిలియన్ మార్చ్: జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ‘కాక్రోచ్’ తరహా ఉద్యమాన్ని చేపడతామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఆగస్టు నెలలో బిసి విద్యార్థులతో మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో జెన్‌జీ ఉద్యమం ముగిసిపోలేదని, అవినీతి, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు, ధన రాజకీయాలు ఉన్నంతకాలం అది వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన ‘కాక్రోచ్’ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, విద్యార్థులు, నిరుద్యోగులు, యువతను పాలకులు తక్కువ అంచనా వేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో అవినీతి, పేపర్ లీకేజీలు, అక్రమాల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలు కాకపోవడం, ఫీజుల బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయండి

ప్రభుత్వానికి ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒబిసివర్గాల ప్రతినిధిగా విద్యార్థులు, బిసి సంఘాల నుంచి తనపై ఒత్తిడి వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టారని, ఆయన హయాంలో ఈ పథకం సమర్థంగా అమలైందని చెప్పారు. అయితే ఆ తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు సక్రమంగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు దెబ్బతింటాయని, ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడుతుందని హెచ్చరించారు. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ నేను ఉంటాను. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం నా గొంతు ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది‘ అని వి.హనుమంతరావు స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాల వల్లే కేంద్ర ప్రభుత్వం తలవంచాల్సిన పరిస్థితి వచ్చిందని, కేంద్ర మంత్రి రాజీనామా చేయడం దేశ రాజకీయ చరిత్రలో ఒక కీలక పరిణామమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటం శుభపరిణామాలకు దారితీస్తుందని అన్నారు.

21ఏళ్ల యువకుడిని విద్యాశాఖ మంత్రిగా నియమించేలా బిల్లు తీసుకొస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం స్వాగతించదగ్గ విషయమని, ఆ నిర్ణయానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.


## మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కార్యాలయం

E2/2836/EOI/OC/2026 ఆసక్తి వ్యక్తీకరణ (EOI) Dated: 27.07.2026

మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టే అన్ని రకాల పనులకోసం థర్డ్ పార్టీ నాణ్యతా ప్రమాణాల నియంత్రణల సంప్రదింపుల సేవలు అందించడానికి ఆసక్తిగల సంస్థల నుండి ప్రతిపాదనలను మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ఆహ్వానిస్తున్నారు.ఆసక్తిగల సంస్థలు నగరపాలక సంస్థలో ఒకటో డివిజన్ మొదలుకొని 60వ డివిజన్ వరకూ అన్ని రకాల పనులను చేపట్టేందుకు తమ ఆర్థి ప్రతిపాదనలు, అవసరమైన పత్రాలను కలిపి మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌కు తేదీ: 04.08.2026 సాయంత్రం 3.00 గంటల సమయానికి అందజేయవలసిందిగా కోరడమైనది. ఈ ప్రతిపాదనలను అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు తెరచి చూడబడును.

**కన్సల్టెన్సీ సంస్థలకు ఉండాల్సిన అర్హతలు:**

ఎ. సంస్థ కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే రిజిస్ట్రేషన్ పొంది ఉండవలెను.
బి. కన్సల్టెన్సీ సంస్థ కనీసం పది సంవత్సరాలుగా ఉనికిలో ఉండి కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండాలి.
సి. సదరు కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వరంగంలో థర్డ్‌పార్టీ నాణ్యతా ప్రమాణాల సంప్రదింపులకర్తగా కనీసం పది సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలి.
డి. టెండరుదారుడు గడచిన ఐదు సంవత్సరాలకాలంలో లెక్కచూసినప్పుడు ఏదోఒక సంవత్సరంలో ఏడాది టర్నోవరు రూ.1.00 కోట్లు ఉండాలి. టెండరుదారుడు చార్టర్డ్ ఎకౌంటెంటు ధృవీకరించిన ఆడిట్ ప్రతిని మాకు సమర్పించాలి.
ఇ. సదరు కన్సల్టెన్సీ సంస్థ ఒకే యు.ఎల్.బి. అంటే అర్బన్ లోకల్ బాడీలో ఒక టి.పి.క్యూ.సి ఏజన్సీగా రూ.100 కోట్ల పనులను (ప్రాజెక్టు/వర్కులు) నిర్వహించి ఉండాలి. సదరు సంస్థ సంబంధిత అనుభవంగల పత్రాలను సమర్పించాలి. ఈ పత్రాలను ధృవీకరించే అధికారి హోదా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్థాయికి తగ్గకూడదు. అంతకంటే తక్కువస్థాయివారు ఈ ధృవీకరణలు ఇవ్వకూడదు.
ఎఫ్. తెలంగాణ రాష్ట్రంలోని ఏ నగర పాలక సంస్థలోనైనా సదస్సు కన్సల్టెన్సీ సంస్థకు టి.పి.క్యూ.సి సేవలు అందించడంలో పది సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలి. సంబంధిత ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా మాకు సమర్పించాలి.
జి. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం నెం: 14436/E1/2012-1 తేదీ:27.07.2026 ప్రకారం సదరు కన్సల్టెన్సీ సంస్థ ఐఎస్ఓ/బిఐఎస్ సర్టిఫికేషన్ కలిగి ఉండాలి. గడచిన పది సంవత్సరాలకు సంబంధించిన సర్టిఫికేషన్ ప్రతిని మాకు సమర్పించాలి.
హెచ్.సదరు సంస్థ ఎన్.ఎ.బి.ఎల్ (నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్)వారి గుర్తింపు పొంది ఉండాలి. ఈ గుర్తింపు గడచిన ఐదు సంవత్సరాలుగా ఉనికిలో ఉంటూ చెల్లుబాటైనదిగా ఉండాలి.
(మరొక సంస్థతో ఉమ్మడిగా కలిసి కార్యక్రమాలు నిర్వహించినా,అనుసంధానంతో వ్యవహరించినా సదరు గుర్తింపు అనుమతించబడదు)
ఐ. కన్సల్టెన్సీ సంస్థకు జి.ఎస్.టి. కోసం చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ ఉండాలి. తాజా జి.ఎస్.టి రిజిస్ట్రేషన్ ప్రతిని మాకు సమర్పించాలి.
జె. సదరు కన్సల్టెన్సీ సంస్థకు వృత్తిపనున్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
కె. కన్సల్టెన్సీ సంస్థకు ప్రావిడెంట్ ఫండ్ పి.ఎఫ్&ఇ.ఎస్.ఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
ఎల్. టెండరుదారుడు తప్పనిసరిగా తన పాన్‌కార్డును, సంస్థ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను మాకు సమర్పించాలి.
ఎం. టెండరుదారుడు తప్పనిసరిగా తన సొంత సంస్థకు సంబంధించిన అనుభవాన్ని కూడా తెలియజేయాలి.

ఆసక్తిగల కన్సల్టెంట్లు ఇతర వివరాలకోసం 9705710924 ఫోన్ నంబరు ద్వారా కార్యాలయం పనివేళలో సంప్రదించగలరు.

సం/- కమిషనర్
మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్

DIPR R.O. No. : 6835-PP/CL/ADVT/2026-27, Date: 27-07-2026

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
28-07-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD

# 'నీట్' విద్యార్థులకు సిపిఐ ఘననివాళి






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్షా పత్రం లీక్ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న 23 మంది విద్యార్థులకు సిపిఐ శ్రేణులు నివాళ్లు అర్పించారు. విద్యార్థుల ఆశయ సాధనకు పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం రాత్రి హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో సిపిఐ శ్రేణులు మరణించిన విద్యార్థులకు సంతాపం సూచికగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళ్లు అర్పించారు. నీట్ విధానం కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్‌ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని , విద్యా వ్యవస్థలో సమాన అవకాశాలు కల్పించాలని నినాదాలు చేశారు.

### సికింద్రాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలు, విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా సిపిఐసికింద్రాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నీట్ విద్యార్థుల మరణానికి సంతాపం వ్యక్తం చేస్తూ సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు కొమురెల్లి బాబు, ఉమర్ఖాన్, సోమయ్య, బాలమణి, సయ్యద్ గౌస్, గడ్డం యాదగిరి, నాగమణి, పద్మ, లక్ష్మి , వంశీ, అంబాల శ్రీనివాస్, సుమన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వల్లీ ఉల్లాఖాద్రీ మాట్లాడుతూ నీట్ అక్రమాల వల్ల ప్రాణాలు కోల్పోయిన ప్రతి విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


### ముషీరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో...

సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గ కౌన్సిల్ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థులకు కొవ్వొత్తులతో కవాడిగూడ డివిజన్‌లోని బీమా మైదాన్ బస్తీ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి చెట్టుకింది శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, నాయకులు, అనిల్. భాను. అరుణ్. భీమమైదాన్ బస్తివాసులు కొప్పుల శంకర్. యాదగిరి. అంతటి నరసింహ. కేశవులు, విద్యార్థులు పాల్గొని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్ష విధానం విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని పెంచుతోందని అన్నారు. వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు, అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



## మున్సిపల్ కార్మికులకు సెలవులు అమలు చేయాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సెలవులు అమలు చేయాలని మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి డిమాండ్ చేశారు. సోమవారం ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో వారి కార్యాలయంలో కలిసి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి ఎఐటియుసి, ఎల్‌బి నగర్ జోన్ అధ్యక్షులు బి.రాములు, సుఖమ్మ, జ్యోతి, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** యువతకు అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం కావాలని మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప అన్నారు. సోమవారం ఫరూక్‌నగర్ ఎంపిడిఒ కార్యాలయం ముందు మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, నేతలు శ్రీనివాస్ యాదవ్, చందులాల్, కత్తి చంద్రశేఖర్ అప్ప, మహమూద్, ముబారక్ అలీఖాన్, బాస్కర్ గౌడ్, జయప్రకాష్, శేఖర్, శ్రీహరిగౌడ్, బాబునాయక్, శ్రీనివాస్, మాదవ్, జగదీష్, సాజిద్, టిజేఏసి నేతలు జనార్ధన్, టెలిపోన్ వెంకటయ్య పాల్గొన్నారు.

## రవాణా వ్యవస్థ మెరుగు పరిచేందుకు విస్తరణ పనులు : ఆర్‌డిఒ సరిత



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రహదారి విస్తరణకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తుండటం అభినందనీయమని ఆర్‌డిఒ ఎన్.ఆర్ సరిత తెలిపారు. సోమవారం పట్టణంలోని పరిగి రోడ్డు పోచమ్మ దేవాలయం నుండి ఇరువైపుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. రహదారి మద్య నుండి ఇరువైపుల 50అడుగుల మేర ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తు ముందుకు వెళ్ళారు. షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, ఆర్‌డిఓ సరిత, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, తహసీల్దార్ నాగయ్య, విద్యుత్ ఏఈ వినోద్‌ల సారధ్యంలో బారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపుల ఉన్న నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ పెరుగుతన్న జనాభా, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రజల నుండి వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా చౌరస్తా విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ, మున్సిపల్ శాఖ, రెవిన్యూ శాఖ, ఎక్సైజ్‌శాఖ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు ఒక మొక్క నాటాలని యాచారం ఎంపిడిఒ రాధరాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో జలసిరిపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామసభకు ఎంపిడిఒ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, పంచాయతీ కార్యదర్శి శీలత, సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, వార్డు మెంబర్లు ఆడాల శ్రీకాంత్, ఎరుకలి జ్యోతి, అండేకార్ అనిల్, భూరే కళమ్మ, ఆలంపల్లి మహేశ్, వంగూరి మనోహర, కలకోండ పద్మ, వంగూరి జంగయ్య, నల్లోల్ల చంద్రయ్య, ఐకెపి సిసి సునిత, ఐకెపి వివోఎలు హైమవతి, స్వప్న, రమాదేవి, అంగన్ వాడి కార్యకర్తలు రాజ్యలక్ష్మి , విజయలక్ష్మి , ఫిల్డ్ అసిస్టెంట్ జగన్ పాల్గొన్నారు.

## జిఒ 641రద్దు చేసే వరకు ఉద్యమం



**ప్రజాపక్షం/కొత్తూరు:** సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు వ్యవహారంలో తీసుకువచ్చిన జీవో 641ని తక్షణమే రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హెచ్చరించారు. సోమవారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో చెత్త డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన జేఏసి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ జీవోను రద్దు చేసే వరకు ప్రత్యక్ష కార్యచరణ రూపొంధించి ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లెందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకువస్తూ సిద్దాపూర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పోరాట జాయింట్ యాక్షన్ కమిటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జెఎసి చైర్మెన్ రాంబల్‌నాయక్, జేఏసి కన్వీనర్ పినపాక ప్రభాకర్, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్‌జామి, రాజావరప్రసాద్, కో చైర్మెన్లు దొడ్డి శ్రీనివాస్, ఎమ్మె సత్యనారాయణ, బొజ్జా శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె బాలయ్య, రజిత నాయక్, బుద్దుల జంగయ్య, ఈశ్వర్‌నాయక్, రవీంద్రనాథ్, టిజి శ్రీనివాస్, అర్జున్, శ్రీకాంత్, ఆకాష్ నాయక్, పెంటనోళ్ల నర్సింహా, బచ్చానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రుక్మారెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** హయత్ నగర్ మండలం మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ కాలనీఫేజ్ 2 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.రుక్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి.మురళీధర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి డాక్టర్ పి.వెంకట్ రాంరెడ్డి, కోశాధికారిగా ఎం రవితేజారెడ్డితోపాటు సభ్యులుగా కె.సంజీవ రెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, కె.మల్లికార్జున్, పి.శ్రీకాంత్‌రెడ్డి, పి.రాంరెడ్డి, ఎం. పెంటారెడ్డి లను ఎన్నుకోవడం జరిగిందని కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.వెంకట్ రాంరెడ్డి తెలిపారు.

## గర్భిణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గర్భిణులకు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంతోపాటు ప్రసవానంతర కాలంలో అవసరమైన వైద్య సేవలలో ఎటువంటి లోపం లేకుండా నాణ్యమైన వైద్యసేవలు అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మాతృ మరణాలపై అదనపు కలెక్టర్ కిరణ్మయి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లాలో నమోదైన మాతృ మరణాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ గర్భిణులకు గర్భధారణ ప్రారంభం నుంచే నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో పాటు, అధిక ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతర కాలంలో అవసరమైన వైద్య సేవలు ఎటువంటి లోపం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించే విధంగా సమర్థవంతమైన రిఫరల్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాల నివారణకు ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రత్యేక దృష్టి

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి



**ప్రజాపక్షం/కొత్తూరు:** సైబర్ నేరాల పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో పాటు గ్రేవ్ అన్‌డిటెక్టెవ్ (యుఐ) కేసులను సాంకేతిక ఆధారాలతో చేధించేందుకు కృషి చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి సూచించారు. సోమవారం సాయంత్రం నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతివనాన్ని పరిశీలించడంతోపాటు నందిగామ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అంధించారు. ఈ సందర్భంగా కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా చేధించడంతో పాటు సాంకేతిక ఆధారాలతో పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. విజిబుల్ పోలిసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నిబంధనల అమలు పై ప్రజలకు, వాహనదారులకు అవగాహక కల్పించాలని సూచించారు. సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరిచేందుకు సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కన్హాశాంతి వనంలో నిర్వాహకులతో సంస్థ కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో మాట్లాడి, కొంత సమయం గడిపారు. చిన్నారులను ప్రోత్సహిస్తూ విద్య, విలువలు, మంచి భవిష్యత్ కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిసిపి శిరీష, ఎసిపి ఎస్.లక్ష్మీనారాయణ, నందిగామ సిఐ వీరబాబు, ఎస్ఐ దేవరాజ్ పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి సహకారం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** దేవాలయ అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అంధించేందుకు తాను ఎల్లప్పుడు సిద్దంగా ఉంటానని మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప వివరించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో ఉన్న పోచమ్మ దేవాలయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి సిసి రోడ్డు వేయించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బచ్చలి నరేష్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, నేతలు చందులాల్, తంగడిపల్లి శంకర్, కత్తి చంద్రశేఖర్ అప్ప, జుట్టు అనిల్, మేకల వెంకటేష్, బచ్చలి రమేష్, ప్రవీణ్, శ్రీనివాస్, శంకరయ్య, రామచందర్, రమేష్, తిరుపతిగౌడ్, యాదయ్య, రంగన్న, చంద్రకళ, జయమ్మ, నిర్మల, యశోద, అనసూయ పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/హయత్ నగర్:** ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ యువ నాయకులు పోచంపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు. బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఎస్‌ఎఫ్‌ఐ. సిబ్బందికి బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో అనంతుల రాజారెడ్డి, చేర్కు ప్రశాంత్ గౌడ్, తూర్పటి చిరంజీవి, సతీష్ యాదవ్, పల్లె సీతారాములు, కోలన్ చంద్రశేఖర్ అజాద్, శిల్పారెడ్డి, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, బద్దం నరేందర్ గౌడ్, చిత్రాల జగదీష్, రమేష్ రాజు, శంకర్, రాహుల్, భాస్కర్ రెడ్డి, ప్రదీప్ గౌడ్, వెంకటరమణ, నరేష్ పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి కేంద్రీకరించండి

రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి కేంద్రీకరించేందుకు రైతులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ సురేంద్రమోహన్ సూచించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం వెల్‌జర్ల రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ సురేంద్రమోహన్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన మేళాలో వివిధ రకాల విత్తనాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సురేంద్రమోహన్ మాట్లాడుతూ నీరు అధికంగా అవసరం ఉన్న పంటలను సాగు చేయకుండా తక్కువ నీటితో ఉండే పంటలను సాగు చేసుకునేందుకు రైతులు కృషి చేయాలని సూచించారు. కందులు, పెసర్లు, మినుములు, సజ్జలు వంటి అరుతడి పంటలను సాగుచేయాలని అన్నదాతలకు సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలను సాగుచేస్తే ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అస్కారం ఉంటుందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు కంది, పెసర, మినుములు, కూరగాయలు వంటి తక్కువ నీరు అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై గ్రామాల్లో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ, అనుబంద శాఖల అధికారులు అందుబాటులో ఉండి వివరించాలని పేర్కొన్నారు. రైతులు ఫారం ఫాండ్ కొరకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సబ్సిడిని అన్నదాతలు వినియోగించుకోవాలని సూచించారు. నీటి వనరులు ఎక్కువగా ఉన్న అన్నదాతలు ఆయిల్‌పామ్ పంటలను సాగుచేసేందుకు కృషి చేయాలని, అందుకు తగిన ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, భరత్, సురేష్, వెల్‌జర్ల సర్పంచ్ బాబునాయక్, కొండన్నగూడ సర్పంచ్ అనురాధ సురేష్ గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, టెక్నికల్ ఏడిఏ రమాదేవి, షాద్‌నగర్ ఏడిఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారిణి హిమబిందుతోపాటు విస్తరణ అధికారులు, వివిధ గ్రామాల ఉప సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## ఎల్‌బి నగర్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్‌కు మధుయాష్కీ గౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి విజ్ఞప్తి





**ప్రజాపక్షం/హయత్ నగర్/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో వారి కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను పురోగతి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై జోనల్ కమిషర్‌తో చర్చించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బానోతు సుజాత నాయక్, ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్, వజీర్ ప్రకాష్ గౌడ్, యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, సుధీర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

**పనుల పరిశీలన...** వనస్థలిపురం డివిజన్ నాగార్జున కాలనీలో చేపడుతున్న బాక్స్ డ్రైన్ పనులను మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మధుయాష్కీ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రైనేజీ, వరద నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపడుతున్నామని తెలిపారు. నాగార్జున కాలనీ సంక్షేమ సంఘం మొదటి అంతస్తు నిర్మాణానికి తగిన నిధులు కేటాయించడమే కాకుండా డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు కొల్లూరి శ్రీనాథ్, పి. గణేష్‌రెడ్డి, కవిత, మార్కెట్ మిటీ డైరెక్టర్ రామారావు, డిసిసి ప్రధాన కార్యదర్శి స్వర్ణమాధవి, నాయకులు హరిందర్‌రెడ్డి, సాయి కిరణ్, శేఖర్, కాలనీ అధ్యక్షులు చంద్రారెడ్డి, రామకృష్ణ, లక్ష్మ ణ్, వెంకట్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానగరి
GREATER HYDERABAD
హైదరాబాద్
మంగళవారం
28-07-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## వైద్య సేవల్లో నిర్లక్ష్యం కనబరిస్తే సహించం : డిఎంహెచ్ఒ ఆనంద్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వైద్య సేవల్లో నిర్లక్ష్యం కనపరిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామంటూ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.ఆనంద్ హెచ్చరించారు. సోమవారం ఆయన చక్రిపురంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ ఉన్న రోగులతో నేరుగా మాట్లాడి ఏ మేరకు వైద్య సేవలందుతున్నాయని, ఏవైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన అక్కడి వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ



తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు, మాతా శిశు ఆరోగ్య సేవలు, క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమం, ఔషధాల లభ్యత తదితర విషయాలను రిజిస్టర్ల ద్వారా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణీలను క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ప్రభుత్వం అందించే పోషకాహారాలను అందిస్తుండాలన్నారు. ప్రస్తుత వానాకాలం దృష్ట్యా డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియాలాంటి అంటువ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉంటూ జ్వరాలకు సంబంధించి సర్వేలు చేయాలన్నారు.



## ఎస్ఐఆర్ పూర్తి దిశగా కీలక అడుగు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మున్సిపల్ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేస్తూ బ్రూక్‌బాండ్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఓటర్ల నుంచి సేకరించిన గణన ఫారాల్లో సుమార్ 70శాతం బూత్ స్థాయి అధికారులకు అందజేశారు. మిగిలిన ఆరు రోజుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేసేందుకు బూత్ స్థాయి అధికారులు, బూత్‌స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. ఘట్‌కేసర్ 6వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రూక్‌బాండ్ కాలనీలో 312నుంచి 319 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 6వ డివిజన్ సమన్వయకర్త పాషా, ఎస్ఐఆర్ డైరెక్టర్ అశ్విన్ పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు. గడ్డి అన్నారం మార్కెట్ డైరెక్టర్ మచ్చేందర్ రెడ్డి, కడుపోల్ల మల్లేష్,వెంకటేష్ ముదిరాజ్, మీసాల సుధాకర్, మాజీ రైతు సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాలనీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు గణపతిరెడ్డి, శివప్రసాద్‌గౌడ్‌లు అన్నారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని పరిమళా నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా గణపతిరెడ్డి, శివప్రసాద్ రెడ్డి ఉపాధ్యక్షులుగా ఆనంద్‌రాజ్, గోపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వినోద్‌కుమార్, శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా నాగమల్లేశ్వరరెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి,కోశాధికారిగా హేమంత్‌కుమార్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. రాజకీయాలకు అతీతంగా తమ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.




## ప్రజావాణికి 165 దరఖాస్తులు స్వీకరణ

**ప్రజాపక్షం/వికారాబాద్:** కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజావాణికి 165 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటచారి, ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్, డిఆర్ఓ స్వర్ణలత, డిప్యూటి ట్రైనింగ్ కలెక్టర్ పూజ, తదితరులు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడలో యువకుడు అదృశ్యం

### కేసు నమోదు చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** దమ్మాయిగూడలోని ఒక షాపులో పనిచేస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. జవహర్ నగర్ ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరిలోని ఆనంద్ నగర్‌కు చెందిన ముకిద్ (20) అనే యువకుడు గత మూడు సంవత్సరాలుగా దమ్మాయిగూడలోని 3డి వీల్స్ షాప్‌లో మెకానిక్‌గా పని మనిషిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన మల్కాజిగిరిలోని తన సొంత ఇంటికి వెళ్లిన ముకిద్, తిరిగి జులై 25న ఉదయం 9 గంటలకు దమ్మాయిగూడలోని షాప్‌కు విధులకు హాజరయ్యాడు. అయితే అదే రోజు ఉదయం 11 గంటల ప్రాంతంలో షాప్ ఓనర్ అమరేందర్ రెడ్డి,



ముకిద్ తండ్రి జిలానీకి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. షాప్ వద్ద ముకిద్‌కు చెందిన స్కూటీ మాత్రమే ఉందని, ముకిద్ అక్కడ లేడని తెలిపారు. అంతే కాకుండా అతని ఫోన్ నంబర్‌కు డయల్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తోందని చెప్పారు. విషయం తెలుసుకున్న తండ్రి జిలానీ హుటాహుటిన దమ్మాయిగూడకు చేరుకుని, షాప్ పరిసర ప్రాంతాలలో వెతకడమే కాకుండా బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీశారు. ఎంత వెతికినా కొడుకు ఆచూకీ లభించకపోవడంతో, తండ్రి జిలానీ పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ముకిద్ ఆచూకీ కోసం సిసిటివి ఫుటేజీలను పరిశీలిస్తూ, అన్ని కోణాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. ముకిద్ గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

డ్రగ్స్ సేవించి రచ్చ..రచ్చ..

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్ట్

* మత్తు మానుకుంటానని ఈగల్ అధికారులకు హామీ
* రీహ్యాబిటేషన్ సెంటర్‌కు తరలింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో చిత్తుగా డ్రగ్స్ సేవించి తరచూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఈగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అమెరికాలో ఉన్న సమయంలో డ్రగ్స్ అలవాటు అయ్యాయని, ఇకపై మత్తుకు దూరంగా ఉంటానని హామీ ఇవ్వడంతో సదరు నిదితుడు నాగినేని మోహన్‌ను నార్కొటిక్ అధికారులు రీహ్యాబిటేషన్ సెంటర్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఈనెల 23న కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి 5వ ఫేజ్‌లోని శ్రీ సత్య సాయి సదన్ అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై నాగినేని మోహన్ ఎండిపిఎస్ డ్రగ్స్ సేవించి గట్టిగా అరుస్తూ, అడ్డొచ్చిన వారిని బెదిరిస్తూ న్యూసెన్స్ చేశాడు. నాగినేని మోహన్ తరచూ మాదకద్రవ్యాలు సేవిస్తూ ఆ ప్రాంతంలో ఇబ్బంది కలిగిస్తున్నాడని ఈగల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో హైదరాబాద్ నార్కోటిక్స్, ఈగిల్ ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగి కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి 5వ ఫేజ్‌లోని శ్రీ సత్య సాయి సదన్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి నాగినేని మోహన్‌ను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈగల్ పోలీసులు నిందితుడు నాగినేని మోహన్‌కు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎంతకాలం నుంచి మత్తుకు అలవాటు పడ్డావన్న అంశాలపై ప్రశ్నించారు. అయితే తనకు ఏలాంటి అలవాట్లు లేవని అతను దాటవేసే సమాధానాలు ఇచ్చాడు, ఈ క్రమంలో ఈగల్ ఫోర్స్ తనదైన శైలిలో విచారించగా నిందితుడు నాగినేని మోహన్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సమయంలో డ్రగ్స్‌కు అలవాటు పడినట్లు తెలిపాడు. హైదరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తుల నుండి కొకైన్‌ను కొనుగోలు చేసిసేవిస్తున్నట్లు అంగీకరించాడు.

కొకైన్, ఇతర మత్తుపదార్థాలను కలిగి ఉండటం, అమ్మడం, కొనడం, రవాణా చేయడం మరియు సేవించడం ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం నేరమని సదరు నిందితునికి ఈగల్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం నిందితునికి మూత్ర పరీక్షలు నిర్వహించగా కొకైన్‌కు పాజిటివ్‌గా తేలింది.

ఈ నేపథ్యంలో నిందితుడు మత్తుపదార్థాలను సేవించే అలవా టు మానుకోవాలని నిర్ణయించుకున్నానని, రీ హ్యాబిటేషన్ సెంటర్‌లో పునరావాసం పొందడానికి సిద్ధంగా ఉన్నట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో ఎన్‌డిపిఎస్ చట్టంలోని సెక్షన్ 64ఎ నిబంధనల ప్రకారం, చికిత్సకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వ్యసనపరులకు ప్రాసిక్యూషన్ నుండి మినహాయింపు ఇస్తూ నిందితుడు నాగినేని మోహన్‌ను తెలంగాణ ప్రభుత్వ అధీకృత వ్యసన విముక్తి కేంద్రానికి తరలించారు.

## బోనాల పండుగకు మౌలిక వసతులు కల్పిస్తాం

### ఎంసిపల్లి చైర్మన్ జాం రవి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బోనాల పండగకు మున్సిపల్ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతామని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో బోనాల పండగపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లోని అన్ని వారుల్లో వీధి దీపా లు, ఆలయాలకు సీరియల్ బల్బ్‌లు, విద్యుత్ దీపాలు, పారిశుద్య పనులు, తాగునీటి ఏర్పాటు, భక్తులకు అవసరమైన ఇతర మౌళిక వసతులు కల్పించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చైర్మన్ జాం రవి అన్నారు. ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసి బోనాల పండగను విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, వైస్ చైర్మన్ మొర్సుబాయి శశిరేఖ, కౌన్సిలర్లు, డిఇ స్ఫూర్తి, ఆర్ఓ హర్షద్, ఆర్ఐలు రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్ సింగ్, మల్లిఖార్జున్, ఎటిపిఓ దేవేందర్‌రావు, సుభాష్ పాల్గొన్నారు.

**అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతాం : ఎంసిపల్లి చైర్మన్ జాం రవి**

వర్షాకాలంలో అంటువ్యాదులు ప్రభలకుండా తగు జాగ్రత్తలు చేపడుతామని మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జాం రవి, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌తో కలిసి అంటువ్యాధుల నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టడం, తాగునీటిని మరిగించి లేదా శుద్ధి చేసి వినియోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడి పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు.




ఈ కార్యక్రమంలో టిఎంసి నర్సింహ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌సింగ్, మల్లిఖార్జున్, జిల్లా మహిళా సమైఖ్య అధ్యక్షురాలు అజయలక్ష్మి, బిట్స్ పిలాని స్టూడెంట్ దీప్తిరాజు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించండి




**ప్రజాపక్షం/చర్లపల్లి:** జమ్మిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టాయిలెట్లు దయనీయ స్థితిలో ఉండి రోగులకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయని స్థానికులు, రోగులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస మౌలిక వసతులు కల్పించడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలం అయ్యారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రంలో టాయిలెట్లు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవ లు అందించాల్సిన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఈ స్థితిలో ఉండడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ కూడా సరిగ్గా లేకపోవడం వల్ల రోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.

**మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు**

ప్రాథమిక ఆరోగ్యంలో మంచినీటి సౌకర్యం లేక రోగులు ఇబ్బందులకు గురువుతున్నారని ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వాటర్ బాటిల్ తీసుకురావాలని సిబ్బంది ముందే చెప్తున్నారు. అక్కడ వచ్చేవారికి నీటి సదుపాయం లేక పక్కన ఉన్న షాపులో వాటర్ బాటిల్ కొనుక్కోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టాయిలెట్లు లేక ఇబ్బందులు**

స్కానింగ్‌కు వచ్చే గర్భిణులు, రోగులకు డాక్టర్ నీళ్లు నిండుగా తాగితే స్కానింగ్ బాగా వస్తుందని సలహ ఇస్తున్నారు. తీరా స్కానింగ్ అయిపోయాక టాయిలెట్‌కు వెళ్దామంటే ఆరోగ్య కేంద్రంలో టాయిలెట్లు లేక రోగులు ఇబ్బందులకు గురువుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు.

## స్కూల్ ఆడిట్ రిపోర్ట్స్ జిఒపై చర్చ

### డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌తో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్‌ను కలిసన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి అనంతరం రాష్ట్రంలోని అన్ని డిఓ ఆఫీస్ నుంచి జారీ చేయబడిన స్కూల్ ఆడిట్ రిపోర్ట్స్‌కు సంబంధించిన జీవో గురించి చర్చించారు ఈ చర్చలో బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల్లో చాలా పాఠశాలల్లో చాలా తక్కువ విద్యార్థులు ఉండటం కారణంగా టర్నోవర్ చాలా తక్కువగా ఉంటుందని వారిని ఆడిట్ రిపోర్ట్ నుంచి మినహాయించవలసిందిగా కోరారు. ఈటిఆర్ రెన్యువల్‌కు సంబంధించి కేవలం ఆన్లైన్లో మాత్రమే అప్లికేషన్స్ సబ్మిట్ చేయవలెను కానీ సంబంధిత అధికారులు మాన్యువల్ కాపీని కూడా అడగడం జరుగుతుందనీ, ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి కేవలం ఆన్లైన్ అప్లికేషన్స్ మాత్రమే తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. అదే విధంగా డిసిఇబి సంబంధించి ఆన్లైన్లో ఎంట్రీ అయిపోయిన తర్వాత హార్ట్ కాపీసు సంబంధిత అధికారులకు ఇవ్వకూడదని కూడా కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జయ నాగరాజు, సెక్రెటరీ అశోక్ కుమార్, ట్రెజరర్ పరశురామ్ గౌడ్, ఐట ప్రెసిడెంట్, హైదరాబాద్ జిల్లా కోశాధికారి సోహెల్, బండ్లగూడ మండల అధ్యక్షులు అబ్దుల్ సాబుర్, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు జి.తిరుపతి రెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ చారి, ఉప్పల్ మండల్ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి, నరేందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు



## నూతన ఎస్‌హెచ్ఒగా విజయ్‌కుమార్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా విజయ్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన ఉప్పల్ సిసిఎస్ విభాగంలో పనిచేస్తూ బదిలీ అయ్యా రు. కాగా ఇక్కడ పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న సత్యనారాయణ ఆర్థిక నేరాల విభాగానికి (ఈఓడబ్ల్యు)కు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌హెచ్‌ఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటూ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలు సైతం తమ వంతు బాధ్యతగా పోలీసులకు సహకరించిన నాడే సత్ఫలితాలు సాధించగలుగుతామన్నారు.




## బోనాలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ తండా2లో ఆగస్టు 1న అభిషేకం, ఆగస్టు 2న శ్రీ యెల్ల మ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించనున్న సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నెహ్రూ నాయక్, ప్రేమ్ సింగ్ నాయక్, శాంతాబాయి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ నివాసి



ఉదిత్ నారాయణ్ ఉప్పల్ స్టేడియం వైపు బైకుపై వెళుతుండగా రోడ్డు దాటుతున్న వరంగల్ నివాసి వైష్ణవ్ విశ్వనాథంను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయాలకు గురైన వారిద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా ఉదిత్ నారాయణ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు, వైష్ణవ్ చికిత్స పొందుతున్నాడని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## వివాహిత అదృశ్యం

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** చిట్టీల నిర్వహణ విషయంలో భర్తతో తలెత్తిన వివాదం కారణంగా ఓ వివాహిత ఇల్లు వదిలి అదృశ్యమైన సంఘటన దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో వెలుగు చూసింది. బాధితుడు నరేష్, జవహర్ నగర్ ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడ ఇంద్రమ్మ కాలనీ (ఫేజ్ 2)కి చెందిన స్వాతి




(30) గత కొంతకాలంగా చిట్టీలు నిర్వహిస్తోంది. అయితే, చిట్టీల లెక్కల విషయంలో భర్త నరేష్ అడగ్గా ఆమె సరిగా చెప్పకపోవడంతో పాటు, ఇంట్లోని బంగారాన్ని కూడా తాకట్టు పెట్టినట్లు తెలిసింది. ఈ విషయమై మనస్తాపానికి గురైన స్వాతి, ఈ నెల 26న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. భర్త నరేష్ బంధువులు, తెలిసిన వారివద్ద ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. స్వాతి గురించి ఏమైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## కళ్యాణ లక్ష్మికి లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన మోత్కూర్ జిపిఒ జగదీష్

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండలంలోని కళ్యాణలక్ష్మి పథకంకోసం దరఖాస్తు చేసుకున్న పేదవారిని వేధించిన మోత్కూర్ జిపిఒ జగదీస్ ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మొదట రూ.6వేలు లంచం డిమాండ్ చేశాడు అనంతరం మరొ



కసారి కలిసినపుడు రూ.2000ఇవ్వమని అడగగా బాధితులు ఎసిబిని ఆశ్రయించారు. 2000రూపాయిలు ఇస్తున్న క్రమంలో జగదీష్ ఎసిబి అధికారులకు పట్టుబడట్లు తెలిపారు. ఆయనపై విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఎవరైన లంచం అడిగేతే ఎసిబిని ఆశ్రయించాలని ప్రజలను కోరారు.



## కలాం ఆశయాలే యువతకు విజయమార్గం

### ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఆశయాలు యువతకు మార్గదర్శకమని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘనపూర్ గ్రామంలో అధ్యక్షుడు సామల అమర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వేముల మహేష్ గౌడ్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి కలాం చేసిన సేవలు చిరస్మరణీయమని యువత ఉన్నతమైన కలలు కని వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలాం ఆశయాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్ సింగ్ నాయక్, వేముల మమత గౌడ్, విశ్వనాథం, వేముల సత్తయ్యగౌడ్, పరమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**చర్లపల్లి (ఇసీనగర్‌లో):** మాజీ రాష్ట్రపతి,భారత రత్న డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతిని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇసీ నగర్ కాలనీలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ హలులో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ హరిప్రసాద్,హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.సాధారణ కుటుంబం నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణారెడ్డి, ఎం మల్లేష్, గోవర్ధన్, శరత్, బిక్షపతి, వాచస్పతి, ఆర్, తదితరులు పాల్గొన్నారు.






## త్వరలో ఎస్ఐఆర్ 100 శాతం నమోదు పూర్తి చేస్తాం : సర్పంచ్ అనిత ఆంజనేయులు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గ్రామంలో మొత్తం 563 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం గ్రామంలో నివసిస్తున్న వారందరి వివరాల నమోదు దాదాపు పూర్తయిందని గ్రామ సర్పంచ్ అనిత ఆంజనేయులు అన్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని కోజ్జవనం పల్లి గ్రామంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తూ 98 శాతం పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ అనితఆంజనేయులు తెలిపారు. గ్రామంలో మొత్తం 563 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం గ్రామంలో నివసిస్తున్న వారందరి వివరాల నమోదు దాదాపు పూర్తయిందని ఆమె వెల్లడించారు. గ్రామానికి వెలుపల ఉన్న కొందరు ఓటర్ల వివరాలు, అవసరమైన పత్రాలు అందిన వెంటనే వారి నమోదును కూడా పూర్తి చేస్తామని తెలిపారు. మిగిలిన రెండు శాతం ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి కోజ్జవనం పల్లి గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలోని బూత్ నంబర్ 1లో బిఎల్ఓ శకుంతల ఆధ్వర్యంలో 94 శాతం, బూత్ నంబర్3లో బీఎల్వో దేవమ్మ ఆధ్వర్యంలో 99 శాతం ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది, గ్రామ ప్రజలు అందించిన సహకారం అభినందనీయమని సర్పంచ్ అనితఆంజనేయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బాల్‌రాజ్, జీపీఓ శారద, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, బీఎల్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఇల్లు లేని పేద కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని కీసర డివిజన్ కాంగ్రె స్ పార్టీ అధ్యక్షులు రామిడి స్వప్నవిజయ్‌రెడ్డి అన్నారు.సోమవారం



కీసర డివిజన్ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.నూతనంగా గృహ ప్రవేశం చేసిన కుటుంబాన్ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తి చేయాలి

### ఎంసిపల్లి చైర్మన్ జాం రవి రూ. 51 వేలు విరాళం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ కొల్తూర్‌లో నిర్మిస్తున్న మాతమ్మ ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తి చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆలయ కమిటి సభ్యులకు రూ. 51 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఆలయానికి విరాళం అందించిన మున్సిపల్ చైర్మన్ జాం రవికి గ్రామస్థులే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ శశిరేఖ, కౌన్సిలర్ గిరిపల్లి రమేష్, గ్రామస్థులు స్వామి, కృష్ణ, సత్తయ్య, కిష్టయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీఫీట్ అవగాహన




**ప్రజాపక్షం/మలక్‌పేట్:** దేశంలోనే మొట్టమొదటి అడ్వాన్స్‌డ్ ఊండ్ హీలింగ్ అండ్ లింబ్ సాల్వేజ్ ఇనిస్టిట్యూట్‌ను హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించడం జరిగింది. మూసా రాంబాగ్‌లో ఏర్పాటైన సెంటర్‌లో హ్యాపీ ఫీట్ అనే ప్రజా అవగాహన క్యాంపెయిన్ కూడా ఆరంభమైంది. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, డయాబెటిక్ ఫుట్ గాయాలతో బాధపడుతున్న రోగులలో కాళ్ల తొలగింపును అడ్డుకునేందుకు అవగాహన, అధునాతన చికిత్స, మానవతా దృక్పథంతో కూడిన వైద్య సంరక్షణ, రోగి కేంద్రీకృత విధానానికి శ్రీకారం చుట్టడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో అడ్వాన్స్‌డ్ ఊండ్ సర్జన్ క్లినిక్స్ ఛైర్మన్, ఇండియన్ పోడియాట్రీ అసోసియేషన్ (తెలంగాణ చాప్టర్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేవీఎన్ఎన్ సంతోష్ మూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## పోరాడే వారే నాయకులు



**ప్రజాపక్షం/కవాడిగూడ:** జనం సమస్యలపై పోరాడి పరిష్కరించేవాడే జన నాయకుడని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో జరిగిన అరుంధతినగర్ బస్తీ ఎన్నికలలో తొమ్మిదవ సారి గెలిచిన తెలంగాణ జన సమితి ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన అభినందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు జయపాల్‌రెడ్డి, లక్ష్మ ణ్, కోశాధికారి సురేష్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్ యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు అజయ్ గౌడ్, బస్తీ వాసులు పాల్గొన్నారు

## ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/చార్మినార్:** ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జెడ్‌సీ కన్నం సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, జోనల్ ఏయంసీ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## సర్ హెల్ప్‌హెస్క్‌ల ఏర్పాటు



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** సర్ ప్రక్రియ గురించి కలిగే అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసేందుకు డిసిసి సికింద్రాబాద్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చెర్క జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటైన సెంటర్లలో నేతలు అందుబాటులో ఉన్నారు. షేక్‌పేట్‌లోని ఓయూ కాలనీ డివిజన్లో ఏర్పాటైన హెల్ప్‌డెస్క్‌లను ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో నేతలు సత్యనారాయణ యాదవ్, డివిజన్ యూత్ ప్రెసిడెంట్ రఘునందన్, అనంతరెడ్డి, వినోద్‌కుమార్, ఫిరోజ్ హుస్సేన్, లత, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం గురించి వివరించాలి



**ప్రజాపక్షం/రాంనగర్:** ప్రజలకు సంక్షేమ పథకాలు, నియోజకవర్గం అభివృద్ధి పనులను తెలియజేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులకు సూచించారు. సోమవారం రాంనగర్ డివిజన్ పార్టీ కార్యాలయంలో బిఎల్ఏలతో సర్ కార్యక్రమంపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యువ నాయకుడు ముఠాజై సింహ, డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, గోక నవీన్, ముదిగొండ మురళి, మహిళా నాయకురాళ్లు లీలాదేవి, గజ్జల సంపూర్ణ, శశికళ, గీతారెడ్డి, సాలమ్మ, శోభ, తులసి, మంజుల, అనురాధ, మేరీ, మేరమ్మ, అనురాధ, సబిత తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నేత ధనుంజయ మృతి



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** అంబర్‌పేట్ డివిజన్ భరత్‌నగర్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు ఇ.ఎస్. ధనుజయ (57) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగిన ధనుంజయ మూడు దశాబ్దాల పాటు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఆయన బీఆర్ఎస్ లో చేరారు. ప్రస్తుతం బిజెపిలో ఉన్నారు. అజాతశత్రువుగా ఉంటూ అందరితో మంచి సంబంధాలు కలిగిన ధనుంజయ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నివాళ్లు అర్పించిన వారిలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, సీనియర్ నాయకులు కన్నె రమేష్ యాదవ్, ఎడెల్లి అజయ్ కుమార్, వనం రమేష్, చుక్క జగన్, కుచ్చల కంటి దుర్గాప్రసాద్‌రెడ్డి, దూసరి శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్ చంద్రమోహన్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఉన్నారు. సాయంత్రం మోహిన్‌చెరు శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

# ప్రారంభానికి సిద్ధమైన నల్లగొండ ఫ్లైఓవర్

**35 నిమిషాల ప్రయాణం ఇక 5 నిమిషాల్లో**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీ కూడళ్లలో ఒకటైన నల్లగొండ ఎక్స్ రోడ్స్ వద్ద నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక ఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరుకున్నాయి. రూ.620 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. మొత్తం 3.3 కిలోమీటర్ల పొడవుతో (ర్యాంపులతో కలిపి) నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్‌లో 85 స్పాన్లకు సంబంధించిన డెక్ స్లాబ్లు, గిర్డర్ల ఏర్పాటు పూర్తయ్యాయి. ప్రధాన ఫ్లైఓవర్‌పై బిటి రోడ్డు పనులు ఇప్పటికే పూర్తవ్వగా, ప్రస్తుతం రోడ్డు మార్కింగ్‌లు,పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. సైడ్ ర్యాంపుల నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత నల్లగొండ ఎక్స్ రోడ్స్, అక్బరాబాగ్, చంచల్‌గూడ, సైదాబాద్, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్, ఒవైసీ ఆసుపత్రి జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణానికి సగటున 35 నిమిషాలు పడుతుండగా, ఫ్లైఓవర్ ప్రారంభం అనంతరం అదే ప్రయాణం కేవలం 5 నిమిషాల్లో పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన ఉపశమనం లభించనుందని సహదేవ్ రత్నాకర్ అన్నారు.

# ప్రజల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- 'సర్' డిజిటలైజేషన్‌ను పర్యవేక్షించాలి
- చేయూత పింఛన్లపై తగు చర్యలు : కలెక్టర్ ప్రియాంక ఆల



**ప్రజాపక్షం /హైదరాబాద్ సిటీ :** ప్రజావాణిలో సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. సిఎం ప్రజావాణి, కలక్టరేట్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి వచ్చే ప్రజావాణి నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. 'సర్' ముగింపు సమయం దగ్గర పడుతున్నందున నియోజక వర్గాల వారీగా సమీక్షించి ప్రజలు నమోదుచేసిన ఫారాలను బిఎల్ఓలకు అందజేయాలన్నారు. అలాగే డిజిటలైజేషన్ ప్రక్రియను సంబందిత ఏఇఆర్‌ఓలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. చేయూత ఫించన్లపై మండలాల వారీగా సమీక్షించి దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనికోసం అదనపు సిబ్బందిని కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రజావాణిలో మొత్తం 2433 దరఖాస్తులు రాగా వీటిలో రెండు పడక గదులకు సంబంధించినవే 2254, ఫించన్లకు సంబంధించినవి 153, రెవెన్యూ శాఖవి 16, ఇతర శాఖలవి 10 ఆర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదివరన్ పలని, జితేందర్ రెడ్డి, డిఆర్ఓ డాక్టర్ నారాయణ, హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, సిపిఓ డాక్టర్ సురేందర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలి

శాలివాహననగర్ బస్తీవాసుల డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కారణంగా ఇళ్లు కోల్పోయిన తమలాంటి అసలైన లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే ఇళ్లు కేటాయించాలని ముసారాంబాగ్ శాలివాహననగర్, అంబేద్కర్ నగర్ బస్తీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు బకారం యాదగిరి, ఇందిరా, అశోక్ మాట్లాడారు.మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితులైన తమకు ఇప్పటికీ ఇళ్ల కేటాయింపు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, అసలైన అర్హులను పక్కన బెట్టి కొందరు ఎంఐఎం నాయకుల అనుచరులు, వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తులకు మాత్రమే ఇళ్లు కేటాయించారని ఆరోపించారు.అంతేకాకుండా, అక్రమంగా కేటాయించిన ఇళ్లను కొందరు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాణి, స్వప్న, నాగయ్యతో పాటు సుమారు 70 మంది బస్తీవాసులు పాల్గొన్నారు.

## జిపిఎ చేసుకుని రూ.కోట్లు మోసం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** భారీ భవన నిర్మాణాల వద్దకు వెళ్లి భవన నిర్మాణాలకు సహకరించడంతో పాటు విక్రయించి పెడతానని నమ్మించి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిఎ) చేయించుకొని కోట్లలో మోసానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు కృష్ణారెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డిలు న్యాయవాది భరత్‌తో కలిసి మాట్లాడారు. లోలం శేఖర్ అనే వ్యక్తి భవన నిర్మాణాల వద్దకు వచ్చి అన్ని రకాలుగా సహకరిస్తానని చెప్పి జిపిఏ చేసుకొని మోసానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. జిపిఏ సమయంలో ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకపోగా తమ ప్రమేయం లేకుండానే భవనాలను విక్రయిస్తూ తమను నిండా ముంచుతున్నాడని కన్నీరు పెట్టుకున్నారు. ఎంతో శ్రమించి నిర్మించుకున్న భవనాల వద్దకు అసలు యజమానులుగా వెళ్లిన తమపైనే దాడులకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఓ జాతీయ పార్టీకి చెందిన ఎంపీ, గతంలో అదే పార్టీ నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే తనకు బంధువు అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు.

కుల వివక్ష.. పేదరిక నిర్మూలన కోసం..

# పోరాటాలకు సిద్ధం కావాలి

ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ




**ప్రజాపక్షం/ముషీరాబాద్:** కులవివక్ష, పేదరిక నిర్మూలన కోసం భవిష్యత్‌లో పోరాటాలకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం రాంనగర్‌లో వెంకటస్వామి మాదిగ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో కుల వ్యవస్థతో ప్రజలందరికీ తీవ్ర నష్టం, పేదరికం వల్ల ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ, రాజీ లేని పోరాటాన్ని చేసి సాధించిన ఎస్సీ వర్గీకరణతో విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిగ, ఉప కులాల యువతరం గణనీయమైన ఫలితాలను నేడు పొందుతుందన్నారు. ఈ పోరాటానికి అన్ని రాజకీయ పక్షాలు, మేధావులు అన్ని సామాజిక వర్గాల చెందిన ప్రజలు తమ సంపూర్ణమైన మద్దతును తెలిపారని గుర్తు చేశారు. జాతి బాధ్యతతో పాటు సమాజ బాధ్యత కూడా ఎమ్మార్పీఎస్ మీద ఉందన్నారు. పీడిత వర్గాల ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు భవిష్యత్ ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.ఉద్యమాన్ని శక్తివంతంగా చేసేందుకు 40 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ గోవింద్ నరేష్ మాదిగ, సీనియర్ నాయకులు ఎల్లయ్య మాదిగ, కృష్ణ మాదిగ, యాదయ్య మాదిగ, నరసింహ మాదిగ, మల్లికార్జున్ మాదిగ, గజ్జల రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ల నిర్వహణ మెరుగుపడాలి

హెచ్ఎంఆర్ఎల్ అదనపు ఎండి బి.అజిత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** మెట్రో స్టేషన్ల పరిసరాల్లో నెలకొన్న పరిస్థితులపై హెచ్ఎంఆర్ఎల్ అదనపు ఎండీ బి.అజిత్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. స్టేషన్ల ఫుట్‌పాత్‌ల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, పిల్లర్ల మధ్యన సెంట్రల్ మీడియన్‌ల నిర్వహణ మెరుగు పడాలని.. నిర్వహణ చూసే ఏజెన్సీల పని తీరు పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ... స్వచ్ఛత, పనుల నాణ్యతలో రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన హైదరాబాద్ మెట్రో స్టేషన్లు, వాటి సమీపంలోని వీధి స్థాయిలో ఉన్న సౌకర్యాలు, వాణిజ్య సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బేగంపేట్ స్టేషన్ నుంచి రాయదుర్గ్ మెట్రో స్టేషన్ వరకు ఆయన మెట్రోలో ప్రయాణించి బేగంపేట్, అమీర్‌పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్ల ప్లాట్ ఫామ్‌లు, కాంకోర్సులను పరిశీలించారు. వీధి స్థాయిలో ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా చేపట్టాల్సిందిగా సూచించారు. ప్రయోగాత్మకంగా మొదట పది మెట్రో స్టేషన్లను ఎంపిక చేసుకుని, అన్ని విధాలా అభివృద్ధి జరిగేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగింది. అదనపు ఎండీ వెంట హెచ్ఎంఆర్ చీఫ్ ఇంజనీర్ వై.సాయపరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.శ్యామ్‌మోహన్, జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ) శ్రీనాథ్‌రెడ్డి, డిఎస్పిలు జగన్నాథ్‌రెడ్డి, శివరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

## తట్టు వైరస్‌తో వచ్చే ప్రాణాంతక ఎస్ఎస్‌పిఇపై పరిశోధనకు శ్రీకారం

ఆగస్టు 9న హైదరాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం: రెస్‌ప్లైస్ ఆటిజం రీసెర్చ్ ఫౌండేషన్





**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తట్టు వైరస్ మీ బిడ్డను మీ నుంచి దూరం చేసే ప్రమాదం ఉంది. మీజిల్స్ సోకిన కొద్దిమందిలో మాత్రమే ఎందుకు ఎస్ఎస్‌పిఇ అభివృద్ధి చెందుతుందో తెలుసుకోవడమే మా పరిశోధన లక్ష్యం' అని రెస్‌ప్లైస్ ఆటిజం రీసెర్చ్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి తెలిపారు. తట్టు (మీజిల్స్) వైరస్ వల్ల చాలా అరుదుగా వచ్చే, ప్రస్తుతం శాశ్వత చికిత్స లేని ప్రాణాంతక నాడీ సంబంధిత వ్యాధి 'సబ్‌అక్యూట్ స్క్లెరోసింగ్ పాన్‌ఎన్సెఫలైటిస్ (ఎస్ఎస్‌పిఇ)పై సమగ్ర పరిశోధన చేపట్టనున్నట్లు రెస్‌ప్లైస్ ఆటిజం రీసెర్చ్ ఫౌండేషన్ అండ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి మాట్లాడుతూ తట్టు వ్యాధి చరిత్ర ఉన్న పిల్లలు, ఎస్ఎస్‌పిఇ నిర్ధారణ అయినవారు, తట్టు లేదా ఎంఎంఆర్ టీకా తర్వాత తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు ఎదుర్కొన్న పిల్లలను ఈ పరిశోధనలో భాగంగా సమగ్ర వైద్య పరీక్షలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాధికి శాశ్వత చికిత్స లేదని, మరణాల రేటు దాదాపు 100 శాతం ఉంటుందని చెప్పారు. ఆగస్టు 9న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మణికొండలోని రెస్‌ప్లైస్ ఆటిజం రీసెర్చ్ ఫౌండేషన్‌లో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరంలో అర్హులైన పిల్లలకు పరీక్షలు నిర్వహించనున్నారు. పేర్ల నమోదుకు 9100065552, 8433529769 నంబర్లను సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

## నెమలి అప్పగింత



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** ఎక్కడి నుంచో వచ్చిన జాతీయ పక్షి నెమలిని మధురానగర్ పోలీసులు సోమవారం జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్కు సిబ్బందికి అప్పగించారు. పరిసర ప్రాంతాల్లో తిరుగాడే నెమళ్లలో ఒకటి దారితప్పి పీఎస్ ఆవరణలోకి వచ్చిందని, దీంతో ఆ జాతీయ పక్షిని తాము సురక్షితంగా కేబీఆర్ పార్కు సిబ్బందికి అప్పగించామని మధురానగర్ ఎస్‌హెచ్‌ఓ ప్రభాకర్ తెలిపారు.

## ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 నియామకాలు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న 732 ఫార్మాసిస్ట్ గ్రేడ్2 పోస్టుల భర్తీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు కార్యదర్శికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్ సోమవారం వినతిపత్రం అందజేశారు.

## ఆర్‌జిఐఎ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు న్యాయం చేయండి

తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ వినతి



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద (ఆర్‌జిఐఎ) రూపన్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ ప్రై.లిమిటెడ్, నూతన ట్రాన్స్‌పోర్టేషన్ ప్రై.లిమిటెడ్ సంస్థల ప్రతినిధులంతా ఆటో, క్యాబ్ డ్రైవర్లపై దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నారని తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు శాబాంకర్ దయానంద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర రవాణా శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను తన కార్యాలయంలో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిఏ నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణికులను, అధిక లగేజీని వాహనాల్లో తీసుకెళ్లాలని ర్యాపిడో సిబ్బంది డ్రైవర్లను రూపన్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ ప్రతినిధులు బలవంతం చేస్తున్నారని తెలిపారు. తాము చెప్పింది వినకుంటే ఐడిలు బ్లాక్ చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఈ విషయమై రవాణా శాఖ అధికారులు స్పందించి, ఆటో క్యాబ్ డ్రైవర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర నేతలు మెరుగు నగేశ్, సత్య నరేశ్, షేక్ సలీం మాలిక్, ఎండి జలీల్ ప్రవీణ్ ఉన్నారు.

## 'సర్'లో తప్పనిసరిగా పాల్గొనాలి



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ సర్‌లో భాగంగా సోమవారం మాజీ కార్పొరేటర్ ఎ.పావని కుటుంబ సభ్యుల ఎనుమరేషన్ ఫారంలను జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ పుష్పలత, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ అందచేసారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ... సర్ ప్రక్రియలో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు గోపాలకృష్ణ, వినయ్ పాల్గొన్నారు.

## సంఘం బలోపేతమే లక్ష్యం



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** పద్మశాలి సంఘం బలోపేతమే లక్ష్యంగా తొలి సమీక్ష సమావేశం నిర్వహించామని సంఘం అధ్యక్షుడు మంద జగన్ పేర్కొన్నారు. సమావేశంలో సంఘ బలోపేతం, సభ్యుల ఐక్యత, భవిష్యత్ సేవా కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం జనరల్ సెక్రటరీ రాజు, సభ్యులు చింతకింది మల్లేష్, భోగ సంజీవ్‌కుమార్, ఒగ్గు శ్రీధర్, రాజు, శ్రీకాంత్, వెల్దండ సాయి, చింతకింది సాయి కిరణ్, శ్యామల శివ, ఆనందాస్ కరుణాకర్, తౌటం సతీష్, కర్నాటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## క్వ్యూర్ లోపాలను సరిచేయాల్సిందే

-రౌండ్ సమావేశంలో వక్తలు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** క్వ్యూర్ బిల్లులోని లోపాలను సరిచేసిన తర్వాతే చట్టసభల్లో ప్రవేశపెట్టాలని రౌండ్ టేండ్ సమావేశంలో వక్తలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ద సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు ధూళిపాళ సీతారాం అధ్యక్షతన క్వ్యూర్ బిల్ 2026పై రౌండ్ టేండ్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సామాజికవేత్త వివి రావు, ధర్మారెడ్డి కాలనీ ఫేస్ 2 జనరల్ సెక్రెటరీ చికోటి దయాకర్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బిల్లులో అనేక లోపాలు ఉన్నాయని అన్నారు. అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎలాంటి జవాబుదారితనం ఈ బిల్లులో లేదని చెప్పారు. కేవలం టాక్స్‌లను పెంచుకునే వేసులుబాటు, కేంద్రీకృత అధికారాలు కల్పించబడుతున్నాయని అన్నారు.వివిధ వర్గాల నుంచి వస్తున్న అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొని ఆయా వర్గాలు లేవని ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని మార్పులు చేసిన అనంతరమే బిల్లును చట్టసభల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

## దూదిమెట్లకు పరామర్శ

**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** ప్రమాదానికి గురై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్‌ను అంబర్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్ సోమవారం పరామర్శించారు. యాదాద్రి ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ఈశ్వరమ్మ యాదవ్‌తో కలిసి ఆయన బాలరాజ్ యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. యాదవ సంఘం నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇబ్రహీం, రాహుల్ ముదిరాజ్, హరీశ్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య విరాళాల వివాదంపై

# సిట్ దర్యాప్తు పురోగతిపై రెండు వారాల్లో నివేదిక

**యు.పి ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం**
**ఫోరెన్సిక్ ఆడిటర్‌ను సభ్యుడుగా చేర్చాలని సూచన**




**న్యూఢిల్లీ:**అయోధ్య రామాలయ విరాళాల అవినీతి వివాదం కేసులో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా సభ్యుడుగా చేర్చాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఎలాంటి అరమరికలు లేకుండా,రహస్యాలకు తావు లేకుండా దర్యాప్తు కొనసాగాలని కోరింది.ప్రస్తుతం కొనసాగుతున్న దర్యాప్తుపై సాధించిన పురోగతి గురించి రాబోయే రెండు వారాల్లో ఒక నివేదికను కూడా తమకు సమర్పించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దర్యాప్తు బృందాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం,తాము ఎప్పటికప్పుడు ఈ అంశాన్ని కనిపెట్టుకునే ఉంటామని తెలియజేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి,జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం కేసు విచారణ సందర్భంగా పై విషయాలను స్పష్టం చేసింది. ఐ.జి.పి కిరణ్ ఎస్ నాయకత్వంలో యు.పి ప్రభుత్వం ఈ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని జులై 25వ తేదీన నియమించింది. తగిన పరిష్కార చర్యలు తీసుకోవాలని కూడా ధర్మాసనం తెలియజేసింది. ఈ కేసులో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో ఒక డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, ఒక సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్, ఒక అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ధర్మాసనం చెప్పినట్లే ఒక ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా సిట్ దర్యాప్తు బృందంలో సభ్యుడుగా చేరుస్తామని చెప్పారు. అయోధ్య విరాళాల అవినీతి వివాదంపై అనేకమంది కేసులు దాఖలు చేశారు. వీరిలో ఒక పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ మాట్లాడుతూ, భక్తులు తమ విరాళాలను రూ.500,రూ.1000 నోట్ల రూపంలో చెల్లించారని చెప్పారు. అంతిమంగా ఈ ధనం ట్రస్టుకు చేరుకోలేదని, ట్రస్టుకు చేరిన విరాళాల వివరాలను బాహాటత్వ పద్ధతులలో ఆన్‌లైన్ ద్వారా అందరికీ తెలియజేసే అవకాశం ఉందని, తద్వారా ప్రజలకు ఎంత విరాళం వచ్చిందీ, ఎందరు విరాళాలు ఇచ్చారన్న విషయాన్ని తెలుసుకోగలుగుతారని చెప్పారు. ఈ విధమైన విజ్ఞప్తి న్యాయబద్ధమైనదని, ప్రజావ్యతిరేకమైనది,చట్టవ్యతిరేకమైనది కాదని తెలియజేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ప్రతి విషయంపైనా దర్యాప్తు చేసేందుకు అన్ని విషయాలు తెలుసుకునే హక్కు,అవకాశం సిట్‌కు ఉందని, ఈ విషయం ఇంతటితో ముగిసిపోలేదని, ఇప్పుడు ధర్మాసనం దృష్టి అంతా ఈ దర్యాప్తు పైనే సారించిందని, ఈ దర్యాప్తు సత్వరం,నాణ్యతా ప్రమాణాలతో కొనసాగాలని పేర్కొంది. వారిని ఒక నివేదిక సమర్పించాలని కోరామని, మిగతా విషయాలన్నీ తదుపరి విచారణ దశలో నివేదికకు అనుగుణంగా నిర్ధారిస్తామని ధర్మాసనం సీనియర్ న్యాయవాదికి తెలియజేసింది. ఈ దర్యాప్తు అంశాలను రాజకీయం చేయవద్దని కూడా ప్రధాన న్యాయమూర్తి కోరారు. న్యాయస్థానంలో రాజకీయాలకు తావులేదని,ఇది ఒక నేరం జరిగిందని దాఖలైన కేసు కాబట్టి విచారణ సక్రమంగా జరుగుతోందా?లేదా? అనే విషయాన్ని న్యాయస్థానం పరిశీలిస్తుందని హెచ్చరించారు.

మతం మారితే....

# ఎస్‌సి హోదా పోయినట్టే

- గత తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు
- మతం మారిన వ్యక్తి తిరిగి పూర్వపు మతంలోకి రావాలంటే మూడు షరతులు పాటించాల్సిందేనని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** ఎస్‌సి హోదాపై దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. హిందూ, సిక్కు, బౌద్ధమతం కాకుండా వేరే మతంలోకి మారిన షెడ్యూల్డ్ కులానికి చెందిన వారు తమ 'ఎస్‌సి' హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు ఇంతకు ముందు తీర్పు చెప్పింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ లతో కూడిన ధర్మాసనం తాజాగా తిరస్కరించింది. 2026 మార్చి 24న తాము ఇచ్చిన తీర్పును పరిశీలించామని, అందులో ఎలాంటి తప్పులు కనిపించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2026 మార్చి 24న సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు మినహా, ఇతర మతాల్లోకి మారిన ఎస్‌సి వ్యక్తి, పుట్టుకతో సంబంధం లేకుండా మత మార్పిడి జరిగిన క్షణం నుంచే ఎస్‌సి హోదా కోల్పోతారని స్పష్టం చేసింది. 'ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే, అతను లేదా ఆమె తన ఎస్‌సి హోదాను తక్షణమే పూర్తిగా కోల్పోతారు అని గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 క్లాజ్ (1) ప్రకారం, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన తెగలను నిర్ధరిస్తూ భారత రాష్ట్రపతి 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగల) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వు ప్రకారం, ఒక వ్యక్తి ఆ తెగకు చెందిన సంప్రదాయాలను నిజాయితీగా కొనసాగిస్తేనే ప్రయోజనాలు పొందగలరు. ఒకవేళ మత మార్పిడి జరిగినా లేదా తెగ ఆచారాలను దీర్ఘకాలంగా వదిలివేయడం వల్ల వారి గిరిజన గుర్తింపు రద్దు అవుతుంది. లేదా విచారణ ద్వారా ఆ గుర్తింపు ఉంచాలా, వద్దా అనేది తేల్చాల్సి ఉంటుందని తెలిపింది అని న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాగే హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాన్ని కాకుండా వేరే మతాన్ని అవలంభించే ఏ వ్యక్తినీ షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా పరిగణించలేం. 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాల) ఉత్తర్వులోని క్లాజ్ 3 కింద ఉన్న ఈ నిబంధన స్పష్టమైనది, సంపూర్ణమైనది. నిర్దేశిత మతాలు కాకుండా వేరే మతంలోకి మారితే పుట్టుకతో సంబంధం లేకుండా ఎస్‌సి హోదా తక్షణమే, పూర్తిగా రద్దు అవుతుంది అని కోర్టు తేల్చిచెప్పింది.

**ఎస్‌సి హోదా పోతే- ఆ ప్రయోజనాలన్నీ కట్**

షెడ్యూల్డ్ తెగకు చెందిన వ్యక్తి వేరే మతంలోకి మారినప్పుడు, కాలక్రమేణా ఆ తెగ ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, ఇతర లక్షణాలు అంతరించిపోయే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. ఒక వ్యక్తి తన తెగా ఆచారాలను పూర్తిగా వదిలివేసి, మారిన మతంలోని పద్ధతులను అవలంబిస్తున్నట్లు రుజువు అయితే, ఆ వ్యక్తిని ఇకపై ఆ తెగలో భాగంగా పరిగణించలేమని న్యాయస్థానం పేర్కొంది. 1950 నాటి ఉత్తర్వుల ప్రకారం, ఒక వ్యక్తి ఎస్‌సి హోదా కోల్పోయినప్పుడు, ఆ హోదా ఆధారంగా లభించే చట్టబద్ధమైన ప్రయోజనాలు, రక్షణలు, రిజర్వేషన్లు, అర్హతలు అన్నీ తక్షణమే, స్వయంచాలకంగా రద్దు అవుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ 1950 నాటి ఉత్తర్వు కేవలం హిందూ మతాన్ని అవలంబించే వారికి మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చేసింది. ఆ తర్వాత 1956లో సిక్కులను, 1990లో బౌద్ధులను ఇందులో చేర్చుతూ సవరణలు చేశారు. 'ఈ సవరణల్లో ఎక్కడా క్రైస్తవ మతాన్ని చేర్చలేదు అనే విషయాన్ని గమనించాలి. క్రైస్తవ మత సిద్ధాంతాల ప్రకారం కుల వ్యవస్థకు గుర్తింపు లేదు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ కులం లేదా తెగ హోదాను కోరే వ్యక్తి, 1950 ఉత్తర్వుల ప్రకారం, నోటిఫై చేసిన కులానికి లేదా తెగకు చెందినవారై ఉండాలి. అంతేకాదు దానికి సంబంధించిన స్పష్టమైన, తిరుగులేని ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఒక వ్యక్తి నిర్దేశిత మతాలు కాకుండా, వేరే మతాన్ని పాటిస్తూ, అదే సమయంలో ఎస్‌సి హోదా ప్రయోజనాలను చట్టబద్ధంగా పొందలేరని స్పష్టం చేసింది.

**హిందూ మతంలోకి మళ్లీ వస్తే?**

మతం మారిన వ్యక్తి తిరిగి హిందూ, సిక్కు, బౌద్ధ మతంలోకి మారినప్పుడు (రీకన్వర్షన్) ఎస్‌సి హోదా తిరిగి పొందాలంటే మూడు నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోర్టు తెలిపింది. అవి ఏమిటంటే? సదరు వ్యక్తి మొదట 1950 ఉత్తర్వుల పరిధిలోని కులానికి చెందినవాడై ఉండాలి. తిరిగి స్వమతంలోకి మారినట్లు నమ్మదగిన ఆధారాలు ఉండాలి. ఆ మూల కులానికి చెందినవారు లేదా సమాజం అతనిని తిరిగి అంగీకరించి, తమలో కలుపుకున్నట్లు స్పష్టమైన సాక్ష్యాలు ఉండాలి

# హామీని నిలబెట్టుకోండి

- విద్యార్థులను అదుపులోకి తీసుకోవడంపై సిజెపి ఆందోళన
- కేంద్రం తన హామీకి కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా విద్యార్థులను అదుపులోకి తీసుకోవడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవలి దేశవ్యాప్త ఆందోళనలో పాల్గొన్న వారిపై ఎటువంటి శిక్షాత్మక చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చినప్పటికీ, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో విద్యార్థులు, ఇతర నిరసనకారులను అదుపులోకి తీసుకోవడం లేదా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించింది. మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ ప్రధాన డిమాండ్‌ను కేంద్రం అంగీకరించిన తర్వాత, శాంతియుత నిరసనకారులపై ఎటువంటి చర్యలు తీసుకోబోమని కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్ హామీ ఇవ్వడంతో, సిజెపి తన 36 రోజుల నిరసనను విరమించిన కొద్ది రోజులకే ఈ ప్రకటన వెలువడింది. పరీక్షల నిర్వహణలో అవకతవకల ఆరోపణలతో జూన్ 20న ప్రారంభమైన ఆందోళన, సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షతో ఉధృతమై, ప్రభుత్వ హామీల తర్వాత సద్దుమణిగింది. అయితే అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో విద్యార్థులు, ఇతర నిరసనకారులను వివిధ రాష్ట్ర ఏజెన్సీలు లక్ష్యంగా చేసుకుని, అదుపులోకి తీసుకోవడం లేదా అరెస్టు చేయడం వంటి అనేక నివేదికలు తమకు అందాయని సిజెపి పేర్కొంది. 'బిజెపి లేదా ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల్లో ఏ నిరసనకారుడిపైనా ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఎటువంటి శిక్షాత్మక చర్యలు తీసుకోబోమని భారత ప్రభుత్వం మాకు హామీ ఇచ్చిన తర్వాతే సిజెపి తన దేశవ్యాప్త నిరసనను విరమించిందని, అందువల్ల ఈ రాష్ట్రాల నుండి వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగించేవిగా ఉన్నాయని ఆ పార్టీ పేర్కొంది. అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయించడానికి, న్యాయ సహాయం అందించడానికి సంబంధిత రాష్ట్రాల్లోని న్యాయవాదులతో తమ న్యాయ బృందం సమన్వయం చేసుకుంటోందని ఆ సంస్థ తెలిపింది. అలాగే, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయడం ద్వారా దేశంలో ఎక్కడైనా నిరసనకారులపై బలవంతపు లేదా ప్రతీకార చర్యలను నివారించడం ద్వారా చర్చల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి, ముఖ్యంగా నడ్డా, సింగ్‌లకు ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది. నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను కూడా ఉపసంహరించుకోవాలని సూచించింది. ఈ అంశంపై మంగళవారం నాటికి లిఖితపూర్వక హామీ ఇస్తామని కేంద్రం అంగీకరించిందని గుర్తు చేసిన సిజెపి, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరింది. 'దేశవ్యాప్త నిరసనను నిలిపివేసే మా నిర్ణయం, ప్రభుత్వం తన మాటకు కట్టుబడి ఉంటుందన్న హామీ ఆధారంగా, సద్భావనతో మాత్రమే తీసుకోబడింది. యువ భారతీయుల ప్రజావిశ్వాసాన్ని కూడా ఉల్లంఘించినట్లే అవుతుంది' అని అది పేర్కొంది.

**విద్యార్థులపై ఎకె 47తో దాడి...**

# ప్రధాని క్షమాపణ చెప్పాలి

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**
**బిహార్‌లో ఘటనపై రాహుల్‌గాంధీ డిమాండ్**



**న్యూఢిల్లీ/పాట్నా :** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం మోదీ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. బిహార్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఎకె 47 రైఫిళ్లతో దాడిపై ఆయన తీవ్రంగా మండిపడ్డా. విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కూడా గాంధీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిజాయితీ లేనిది అని, సంస్కరణలు దాని సామర్థ్యానికి మించినవని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. 'మొత్తం వ్యవస్థ విద్యార్థుల పట్ల పూర్తిగా హంతకంగా ప్రవర్తిస్తోంది. బిహార్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులపై ఎకె47లతో కాల్పులు జరిపినట్లు నివేదికలు వస్తున్నాయి. వందలాది మందిని అరెస్టు చేసి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు' అని రాహుల్‌గాంధీ 'ఎక్స్ ఇన్ హిందీ'లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'మోదీ జీ, విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని మీరు ఇచ్చిన హామీ ఏమైంది? దానికి బదులుగా, వారు ప్రాణాంతక దాడులకు, క్రూరత్వానికి గురవుతున్నారు' అని ఆయన అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు, బిహార్‌లో ఎకె47లు ఉపయోగించారని, ఉత్తర ప్రదేశ్ అయినా, పశ్చిమ బెంగాల్ అయినా, బీహార్ అయినా, ఢిల్లీ అయినా అన్నిచోట్లా ఒకే తీరు కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి నిజాయితీ లేదని, సంస్కరణలు చేపట్టడం దాని సామర్థ్యానికి మించినదని తాను ఇదివరకే చెప్పానన్నారు. కేంద్ర తన వాగ్దానాలను ఉల్లంఘించి, విద్యార్థుల గొంతులను అణచివేయడానికి ప్రతీ ఎత్తుగడను ప్రయోగిస్తుందని దుయ్యబట్టారు. విద్యార్థులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా, దేశ విద్యార్థులకు మోదీ క్షమాపణ చెప్పాలని, వారిపై దాడి చేసి క్రూరంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ పేపర్ లీక్, నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త బంద్‌కు మద్దతుగా శనివారం బిహార్ వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రదర్శనలు నిర్వహించాయి, వాటిలో కొన్ని హింసాత్మకంగా మారాయి. సీవాన్‌లో జరిగిన నిరసన సందర్భంగా నిరసనకారులపై పోలీసులు ఎకె47లతో కాల్పులు జరిపారని బిహార్ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ ఆరోపించారు.



**కానిస్టేబుల్ సస్పెన్షన్**

బిహార్‌లోని సివాన్ జిల్లాలో ఈనెల 25న జరిగిన విద్యార్థుల నిరసన సందర్భంగా ఒక పోలీస్ కానిస్టేబుల్ ఎకె 47 రైఫిల్‌ను ఉపయోగిస్తున్నట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆ కానిస్టేబుల్‌ను సస్పెండ చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. సివాన్ ఎస్‌పి పూరన్ కుమార్ ఝా పిటిఐతో మాట్లాడుతూ, 'జిల్లా ఇంటెలిజెన్స్ యూనిట్ (డిఐయు)లో పనిచేస్తున్న సదరు కానిస్టేబుల్, విద్యార్థుల నిరసన సమయంలో ఎకె47 రైఫిల్‌ను ఉపయోగిస్తున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ కావడంతో తక్షణమే సస్పెండ్ అయ్యారని, అతనిపై శాఖాపరమైన చర్యలు కూడా ప్రారంభించినట్లు చెప్పారు. నిరసన సమయంలో ఆ కానిస్టేబుల్ ఏ పరిస్థితుల్లో ఎకె47 రైఫిల్‌ను ఉపయోగించారో తెలుసుకోవడానికి విచారణ ప్రారంభించినట్లు ఎస్‌పి చెప్పారు. నిరసన ప్రదర్శన సమయంలో కాల్పులు జరపకూడదని పోలీసు బలగాలకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు.

# 'జిందాబాద్'... 'పేపర్ చోర్'

- పార్లమెంట్ ఆవరణలో ధర్మేంద్రకు స్వాగతంపై బిజెపి, ప్రతిపక్ష ఎంపిల పరస్పర నినాదాలు
- విద్యా వ్యవస్థ సంస్కరణల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని విపక్షాల విమర్శ



**న్యూఢిల్లీ :** నీట్ వివాదంపై విద్యార్థుల నిరసనల నేపథ్యంలో రాజీనామా చేసిన కేంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి, బిజెపి ఎంపి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం పార్లమెంట్‌కు విచ్చేశారు. అయితే ఆయనకు పార్లమెంట్ ప్రాంగణంలో కొందరు బిజెపి నాయకులు 'ప్రధాన్ జిందాబాద్' వంటి నినాదాలు చేస్తూ సాంప్రదాయ టోపీ, కండువాతో ఘనస్వాగతం పలికారు. అదే సమయంలో ప్రతిపక్ష ఎంపిలు 'చోర్ చోర్, పేపర్ చోర్ (దొంగ దొంగ, పేపర్ దొంగ)' వంటి నినాదాలు చేస్తూ, ప్రధాన్‌ను సన్మానించిన అధికార పక్షంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా మాట్లాడుతూ 'బిల్కిస్ బానో కేసులో అత్యాచార నిందితులను కూడా స్వాగతించిన వారు వీరే, కాబట్టి వారిని పక్కన పెట్టేద్దాం. ప్రధాన్ ఆర్‌ఎస్‌ఎస్ హీరో, ఎందుకంటే ఆయన విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలు చేశారన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గోగోయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ విద్యా వ్యవస్థ సంస్కరణల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ప్రతిపాదిత పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని ఒక 'పైపై మెరుగుల బిల్లు'గా అభివర్ణించారు. 'భారత విద్యా వ్యవస్థ సంస్కరణల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని నాకు కనిపిస్తోంది. అందుకే, వారు ఒక పైపై మెరుగుల బిల్లును తీసుకొచ్చారు... గతంలో జరిగిన ఒక కుంభకోణంలో ప్రధాన నిందితుడిని కోర్టు వదిలిపెట్టిందన్న విషయం మనకు ఇప్పటికే తెలుసు. తగినంత సాక్ష్యాధారాలు సేకరించనందున, ఈ ఫాస్ట్‌ట్రాక్ సవరణ బిల్లుతో ఏం ప్రయోజనం? ఇలాంటి కుంభకోణాలన్నింటికీ పాల్పడుతున్న వారిని కాపాడటానికే ఈ బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుంది' అని గోగోయ్ అన్నారు. విద్యా సంస్కరణలపై కొత్త ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ప్రకటనను కూడా గోగోయ్ ప్రశ్నించారు. రెండేళ్ల క్రితం కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో ఇలాంటి కమిటీనే ఏర్పాటు చేశారని, కానీ ఏమీ జరగలేదని, అది కేవలం కాగితాలకే పరిమితమైందని ఆయన అన్నారు. 'రెండవది, ప్రధానమంత్రి మోదీ స్వయంగా ఈ కొత్త ఉన్నత స్థాయి కమిటీని ఒక పెద్ద సంస్కరణ అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. కానీ కేవలం రెండేళ్ల క్రితం, కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో ఇదే లక్ష్యంతో మరో కమిటీ ఉండేది. ఏమీ జరగలేదు, కేవలం కాగితాలకే పరిమితమైంది. వారి దృష్టిలో ఈనాటికీ ప్రధాన్ ఒక విజయవంతమైన విద్యాశాఖ మంత్రిగానే ఉన్నారు' అని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వానికి, ప్రధానమంత్రి మోదీకి భారత విద్యా వ్యవస్థను సంస్కరించాలనే ఉద్దేశమే లేదన్నారు. పరీక్షా విధానంలో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు అవసరమైన సంస్కరణలను సూచించేందుకు, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని మోదీ ఆదివారం ప్రకటించారు. 20న విద్యార్థి నిరసనకారులపై పోలీసులు జరిపిన చర్యల గురించి ప్రస్తావిస్తూ, హోంమంత్రి అమిత్ షాను కాపాడాలని ప్రభుత్వం భావిస్తోందని గొగోయ్ ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులు ఎఫ్ఐఆర్‌లు, అరెస్టులను ఎదుర్కొంటున్నారని, తద్వారా ప్రతీకార చర్యల భయం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ పోలీసు చర్యపై హోం మంత్రి పార్లమెంటులో ప్రకటన చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఆయన పునరుద్ఘాటించారు.

## సోనమ్ వాంగ్‌చుక్ డిశ్చార్జ్



**న్యూఢిల్లీ :** పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మెదాంత ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. లఢాఖ్‌కు తిరిగి వెళ్లే ముందు ఆయన రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'చివరకు... నేను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్నాను. మహాత్మా గాంధీకి నివాళులర్పించేందుకు రాజ్‌ఘాట్‌కు వెళ్లి, ఆ తర్వాత తిరిగి పర్వతాలకు వెళ్తాను. మీ అందరికీ ధన్యవాదాలు, ముఖ్యంగా గురుగ్రామ్‌లోని మెదాంత ఆసుపత్రి అద్భుతమైన వైద్యుల బృందానికి, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు' అని డిశ్చార్చ్ కావాడనికి ముందు ఎక్స్‌లో పోస్టు చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నిరసనగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించే ముందు, వాంగ్‌చుక్ జూన్ 28న రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. ఆయన జూన్ 28న ఈ ఆందోళనలో చేరి, 26 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్షలో కొనసాగారు. జూలై 18న, ఆయనను బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ తనను నిర్బంధంలో ఉంచినట్లుగా అనిపించిందని ఆయన అన్నారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశం మేరకు వాంగ్‌చుక్‌ను మెదాంత ఆసుపత్రికి తరలించారు. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో జరిగిన 36 రోజుల ఆందోళన, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో శనివారం ముగిసింది. ఈ నిరసన జూన్ 20న ప్రారంభమైంది.

## జమ్ములో విరిగిపడిన కొండచరియలు



**జమ్ము:** ఉధంపూర్ జిల్లాలో సోమవారం కొండచరియలు విరిగిపడటంతో 250 కిలోమీటర్ల మేర జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి మూసుకుపోయింది. వందలాది వాహనాలు నిలిచిపోయాయి. దోడా జిలాలో వంతెనకు పగుళ్లు వచ్చాయనే అనుమానంతో వాహనాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఉధంపూర్ జిల్లాలోని దేవాల్ దగ్గర జమ్ము-శ్రీనగర్ రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో ఇరువైపులా వాహనాలు నిలిపివేయాల్సి వచ్చిందని ట్రాఫిక్ అధికారి తెలిపారు. హైవే మూసివేత కారణంగా ఉధంపూర్ బనిహాల్ మధ్య 1700 ట్రక్కులు మరియు అనేక ప్రయాణికుల వాహనాలు చిక్కుకుపోయాయని, వాటిని సింగిల్ వే ద్వారా తరలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు జమ్ము నుంచి శ్రీనగర్, దోడా, రాంబన్, మరియు పట్నీటాప్ వైపు కొత్త వాహనాలను అనుమతించబోమని, ప్రయాణికుల వాహనాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అధికారి తెలిపారు. అలాగే ఎన్‌హెచ్ఎఐ అధికారులు పెద్దమొత్తంలో యంత్రాలను మోహరించి వేగంగా శిథిలాలను తొలగిస్తున్నారన్నారు. మళ్లీ కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున..రహదారి సురక్షితమని చెప్పేవరకు ఎవరూ ప్రయాణించరాదని అధికారులు సూచించారు. రెండవ దారి అందుబాటులోకి వచ్చాక సాధారణ ట్రాఫిక్ పునఃప్రారంభమవుతుందని, పునరుద్ధరణ పనులు అంతరాయం లేకుండా పూర్తిచేయడానికి వాహనాలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఫుల్ దోడా వంతెనపై పగుళ్లు స్పష్టంగా కనిపించాయనే నివేదికల ఆధారంగా ఆదివారం రాత్రి అధికారులు వంతెనను మూసివేశారు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఇఇ అనిల్ మెహ్రా మాట్లాడుతూ.. ఇంజినీర్లు చేసిన తనిఖీల్లో అవి పగుళ్లు కావని, జాయింట్ల వద్ద కాంక్రీట్ తొలగడం వల్ల ఏర్పడిన పగుళ్లుగా గుర్తించామన్నారు. వంతెన సురక్షితమని తేలిన తర్వాతే వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు.

# ఆ నియామకాలు చెల్లవ్

**కరూర్ బాధితులకు ఇచ్చిన ఉద్యోగాలు రద్దు చేసిన మద్రాస్ హైకోర్టు**




**చెన్నై:** తమిళనాడులోని విజయ్ సర్కార్‌కు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలకు టివికె విజయ్ సర్కార్ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాల్ని కోర్టు రద్దు చేసింది. ఈ ఉద్యోగాల నియామకం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడులోని కరూర్‌లో టివికె పార్టీ ఆధ్వర్యంలో విజయ్ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు భారీగా జనం తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తానని విజయ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారం చేపట్టిన తర్వాత సిఎం విజయ్ బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై జస్టిస్ సివి కార్తికేయన్, జస్టిస్ ఆర్ శక్తివేల్ ఆధ్వర్యంలోని బెంచ్ సోమవారం విచారణ జరిపింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తూ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లను ఉల్లంఘించడమే అని కోర్టు అభిప్రాయపడింది. ఒకవేళ ఇలా బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తే, భవిష్యత్‌లో ఈ తరహా ఉద్యోగాల కేటాయింపునకు ఇది తలుపులు తెరిచినట్లు అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. చాలామంది బాధితులు ఇదే రకంగా ఉద్యోగాల కోసం ఎదురుచూ సే పరిస్థితి వస్తుందని హైకోర్ట్ బెంచ్ వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ఇలాంటి ఆదేశా లు జారీ చేసేముందు రాజ్యాంగాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది. "ఉద్యోగాల్ని రాష్ట్ర ప్రభుత్వం అలా ఇచ్చేయకూడదని, అది కష్టపడి సాధించుకోవాలని, దాని విలువను, గౌరవాన్ని ప్రభుత్వం గుర్తించాలి. చాలామంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు'' అని కోర్టు వ్యాఖ్యానించింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిబిఐ విచారణ జరుగుతోందని, సుప్రీంకోర్టు కూడా ఈ విచారణను పర్యవేక్షిస్తోందని, అందువల్ల ఈ కేసు విచారణపై మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని కోర్టు తెలిపింది.

## షాడోల్‌లో పిడుగుపాటుకు ముగ్గురు మృతి

**షాడోల్ (మధ్యప్రదేశ్):** మధ్యప్రదేశ్‌లోని షాడోల్ జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు పిడుగుపాటు ఘటనల్లో 11 ఏళ్ల బాలుడితో సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాలో భారీ వర్షం సమయంలో ఈ దుర్ఘటనలు సంభవించినట్లు పోలీసులు వెల్లడించారు. దర్సీలా పోలీస్ అవుట్‌పోస్ట్ పరిధిలోని చుట్కి టోలా గ్రామంలో పొలంలో వరి నాట్లు వేస్తుండగా పిడుగుపాటుకు గురై 45 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గ్రామస్తులు గాయపడి చికిత్స పొందుతున్నారు. ఇదేవిధంగా ఝింక్ గ్రామంలో వరి నాట్లు వేస్తున్న 28 ఏళ్ల మహిళ బలైపోయారని పోలీసులు తెలిపారు.

## 16 మంది మావోయిస్టుల లొంగుబాటు

**రాంచీ :** 16మంది మావోయిస్టులు మంగళవారం రాంచీలోని పోలీసుల ఎదుట లొంగిపోయారు. జార్ఖండ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారి మాట్లాడుతూ.. 16మంది మావోయిస్టులతో పాటు సంతోష్ అలియాస్ బాసుదేవ్ దా అలియాస్ దిలీప్ కూడా లొంగిపోయారు. ఇతనిపై రూ.15 లక్షల రివార్డు ఉందన్నారు. 16 మందిలో ఆరుగురిపై రూ.39 లక్షల రివార్డు ఉందని, ఇందులో రీజినల్ కమిటీ మెంబర్, ఒకరు జోనల్ కమిటీ మెంబర్, ఇద్దరు సబ్ జోనల్ కమిటీ మెంబర్లు, మరో ఇద్దరు ఏరియా కమిటీ మెంబర్లు ఉన్నారన్నారు. ఈ గ్రూపులో మహిళలు కూడా ఉన్నారని తెలిపారు. రీజినల్ కమిటీ మెంబర్ సంతోష్ సిపిఐ (మావోయిస్టు) గ్రూప్‌కు చెందిన వాడని ఇతనిపై పలు పోలీస్ స్టేషన్‌లలో 128 కేసులు నమోదయ్యాయని, రూ.15లక్షల రివార్డు ఉందన్నారు. సబ్ జోనల్ కమిటీ మెంబర్లు అనిల్ తురి అలియాస్ ఉజ్వల్, సుఖ్‌లాల్ బిర్జియాన్ అలియాస్ అకేలాపై రూ.5 లక్షల రివార్డు ఉందన్నారు. ఏరియా కమిటీ మెంబర్లు సుదేశ్ హోన్‌హగా అలియాస్ సోనరమ్ హోన్‌హగా, రిసివ్‌లపై , జోనల్ కమిటీ మెంబర్ సంతోష్ మాంజీ అలియాస్ జగబందులపై తలో రూ.2లక్షల రివార్డు ఉందని తెలిపారు. వారి దగ్గర నుంచి ఆరు ఐఎన్‌ఎస్ఎఎస్ రైఫిళ్లు, రెండు ఏకె 47లు, ఒకటి హెచ్ 33, యుఎస్ కార్బైన్ ఎం-16 రైఫిళ్లు, 38 తుపాకులు, 1562 తుపాకీ గుండ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## ఒమన్‌తో చర్చల్లో అమెరికా ప్రమేయం లేదు

### హోర్ముజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్ ప్రకటన

**టెహ్రాన్:** హోర్ముజ్ జలసంధిని నిర్వహించడానికి అవరోధాత్మకమైన విధివిధానాలు అమలు చేసేందుకు ఒమన్‌తో జరుగుతున్న వరుస సాంకేతిక చర్చల్లో అమెరికాకు ఎలాంటి ప్రమేయం లేదని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి టెహ్రాన్‌లో జరిగిన పత్రికాగోష్టిలో చెప్పారు. ఈ చర్చలతో అమెరికాకు ఎలాంటి సంబంధంలేదు, ఇది ఇరాన్–ఒమన్ మధ్య ద్వైపాక్షికంశం, ఈ సాంకేతిక చర్చలు కొనసాగుతున్నాయి, అదేవిధంగా "హోర్ముజ్ జలసంధిని మూసే ఉంచాం" అని వివరణ ఇచ్చారు.ఈ జలసంధి ద్వారా ప్రయాణం చేసే వాణిజ్య నౌకల రాకపోకలకు సంబంధించిన ఉమ్మడి సూత్రాలు,కార్యాచరణ యంత్రాంగాలపై రెండు దేశాలు తాజా విడతగా శుక్ర,శనివారాలనాటి చర్చలు ముగించాయని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా–ఇజ్రాయెల్ పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభించిన తర్వాత నుండి హోర్ముజ్ జలసంధి తమ అధీనంలోనే ఉంటుందని చెప్పారు. హోర్ముజ్ జలసంధి అమెరికా–ఇరాన్ మధ్య ప్రధాన వివాదాస్పద కేంద్రంగా మారింది. ఈ జలసంధిపై తమ అధిపత్యమే ఉండాలని రెండు దేశాలు వాదిస్తున్నాయి. సేవారుసుముల వసూళ్ళతోపాటు జలమార్గాలను నిర్దేశించే అధికారం, నిర్వహణ యాజమాన్యాన్ని ఒమన్ భాగస్వామ్యంతో తామే కొనసాగిస్తామని ఇరాన్ స్పష్టంగా ప్రకటించింది.

**ఎర్ర సముద్రంలో స్తంభించిన నౌకల రాకపోకలు**

ఆసియా–ఆఫ్రికా మధ్య ప్రాంతంలోంచి హిందూ మహాసముద్రంలోకి రాకపోకలు సాగించే సముద్ర ప్రాంతం రెడ్ సీ (ఎర్ర సముద్రం) కూడా హోర్ముజ్ జలసంధి తరహాలోనే వివాదాస్పద ప్రాంతంగా మారింది. ఎర్ర సముద్రంలోని సౌదీ అరేబియా నౌకలను ప్రవేశించనివ్వకుండా యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు దిగ్బంధనం అమలు చేయడంతో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్ట చేరాయి. ఇప్పుడు ఎర్ర సముద్రంలో, హోర్ముజ్ జలసంధిలోనే వాణిజ్య నౌకల రాకపోకలు దాదాపు నిలిచిపోయాయి. ఎర్ర సముద్రంలో ఆదివారం కేవలం 11 నౌకలు మాత్రే ప్రయాణం చేశాయి. బాబ్ ఎల్–మండాబ్ జలసంధి హౌతీలు మూసివేశారు. దీంతో ప్రాంతీయ వాణిజ్య కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. హోర్ముజ్ జలసంధిలో కూడా నౌకలు ఆపోయాయి. ఐతే ఇజ్రాయెల్ వర్గాల సమాచారం ప్రకారం, అమెరికా తాత్కాలికంగా దాడులు నిలిపివేసినప్పటికీ, ట్రంప్ ఉద్ధృతస్థాయిలో ఇరాన్‌పై దాడులకు ఇంకా ప్రణాళిక చేస్తున్నారని ఇరాన్ నమ్ముతోంది. అమెరికా నుండి ఇజ్రాయెల్‌కు గణనీయస్థాయిలో యుద్ధ విమానాలు,ఇంధనం నింపే యుద్ధ విమానాలు, ఆయుధ సామాగ్రి రవాణా జరుగుతూనే ఉంది

# దాడులు విరమించిన ఇరాన్: చర్చలకు షరతులు!

- ప్రత్యక్ష చర్చల్లో పాల్గొనడంలేదు: బఖాయి
- హోర్ముజ్ మాదే: నిధులపై ఆంక్షలు తొలగించాలి
- ఎంఒయుకు లెబనాన్ కీలకం: ఖమేనీ
- అణు పదార్థంపై తుది దశలోనే తీరిగ్గా చర్చలు మాఫియా ముఠాను పోలిన అమెరికా తీరుతెన్నులు
- ఇజ్రాయెల్ మాటలు నమ్మి ఊబిలో కూరుకుపోయారు



**దుబాయ్:** పశ్చిమాసియాలో జరుగుతున్న మారణహోమానికి అంతం పలికేందుకు వీలుగా అమెరికా ఒక మెట్టు కిందకు దిగడంతో ఇరాన్ కూడా అదే బాటలో తాత్కాలికంగా దాడులు నిలిపివేసింది. మొదటి నుండీ తమది ప్రతీకార దాడుల వ్యూహమేనని, ఆత్మరక్షణ దాడులేనని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి మొహ్మద్ అక్రమినియా చెప్పారు. 13 రోజులపాటు వరుసగా కొనసాగించిన దాడులను చర్చలకు వీలుగా నిలిపివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొదట ప్రకటించారు. దీనిపై మధ్యవర్తి దేశాల ప్రతినిధులు స్పందిస్తూ, చర్చల్లో తాము గణనీయ పురోగతి చూస్తున్నామన్నారు. ఎంఒయులో లెబనాన్ తమకు కీలకమని మొజ్తాబా ఖమేనీ ప్రకటించారు.హెజ్బొల్లాకు మద్దతు ఇచ్చారు.

ఐతే చర్చల బల్ల వద్దకు వెళ్ళేందుకు ఇరాన్ రెండు ప్రధాన షరతులు విధించింది. శనివారం తెల్లవారుజాము నుండి పోరాటం నిలిపివేసినప్పటికీ, అమెరికాపై విశ్వసనీయత లేకపోవడంవల్ల వారి నుండి సందేశాలు అందుతున్నప్పటికీ తాము ఎలాంటి ప్రత్యక్ష చర్చల్లో పాల్గొనడంలేదని ఇరాన్ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా తెలియజేసింది. అందుకే షరతులు విధించినట్లు పేర్కొంది. హోర్ముజ్ జలసంధి ఇరాన్‌దేనని, జలసంధి ఎప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే ఉంటుందన్న వాస్తవాన్ని అమెరికా అంగీకరించాలని, అదేవిధంగా స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లు అంగీకరిస్తేనే చర్చల బల్ల వద్దకు వస్తామని పేర్కొంది.అణు పదార్థం గురించి తుది దశలోనే చర్చలు కొనసాగిస్తామని తెలియజేసింది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నిర్దేశించిన, ఇరాన్ ప్రాదేశిక జలాలలోంచి ఏర్పాటు చేసిన వాణిజ్య మార్గాల ద్వారా మాత్రమే నౌకలు ప్రయాణం చేయాలని, అక్రమ మార్గాలకు అవకాశం లేదన్న విషయాన్ని అమెరికా అంగీకరించాలని ప్రధాన షరతుగా విధించింది.

చర్చలు జరపాలని ఇరాన్ తమను వేడుకుంటోందని ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ విదేశీ వ్యవహారాలశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి తీవ్రంగా ఖండించారు. యుద్ధంకోసం, శాంతికోసం తామెప్పుడూ అమెరికాను ప్రాధేయపడలేదన్నారు. మమ్మల్ని మేం రక్షించుకుంటామన్నారు. పర్షియన్ గల్ఫ్ సహకార మండలి (సిజిసిసి) సభ్యదేశాలతో తమకు ఎలాంటి శత్రుత్వం లేదన్నారు.

ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ మాట్లాడుతూ, ఇరాన్‌కు ట్రంప్ ఒక మంచి వెసులుబాటు కల్పించారన్నారు. అమెరికా యుద్ధ సామాగ్రి నిల్వలు తగ్గిపోయాయన్న వార్తలను ఖండించారు. దీనిపై బఖాయి స్పందిస్తూ, మూడు రోజుల్లో ఇరాన్‌ను కుప్పకూల్చి యుద్ధం ముగిస్తామని ట్రంప్ ప్రకటనలు గుప్పించారని, యుద్ధం మొదలై ఐదు నెలలు గడచిన తర్వాత ఈనాడు వారి ఊబిలో వారే కూరుకుపోతున్నారని అన్నారు. జియోనిస్టు పాలకుల ప్రలోభాలకు లొంగి వారు అవమానాలను కొన్ని తెచ్చుకున్నారని విమర్శించారు. వారు యుద్ధం చేయడంలేదని, అప్పుడప్పుడు యుద్ధ నేరాలు చేస్తూ గర్విస్తున్నారని అన్నారు. ఇరాన్‌కు జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని, ఈ విషయంలో అందరూ సమష్టిగా నిర్ణయం తీసుకుంటామన్నారు. యుద్ధ సమయంలోనూ,చర్చల సమయంలోనూ అమెరికా మాట తీరు,వైఖరి, చట్టాల ఉల్లంఘన,నీతి నియమాల ఉల్లంఘన వంటివన్నీ ఒక మాఫియా ముఠాను పోలి ఉన్నాయని ఇరాన్ నిశితంగా విమర్శించింది. ఇలాంటి వైఖరి కొనసాగినంతకాలం ఒక హేతుబద్ధమైన ప్రక్రియ ఆవిర్భవిస్తుందని, అందుకు తగ్గ వాతావరణం నెలకుంటుందని ఆశించలేకపోతున్నామని బఖాయి అన్నారు.అందుకే వారిలో చర్చల్లో పాల్గొనేందుకు ఇష్టపడటంలేదని అన్నారు. డోనాల్డ్ ట్రంప్‌తో పాటు అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో కూడా గడచిన మూడు రోజులుగా చేస్తున్న ప్రకటనల్లో ఇవే మాటలు వినిపించాయి. చర్చించడానికి,ఒప్పందం చేసుకోవడానికి ఇరాన్ సిద్ధంగా లేదని వారు అన్నారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం ద్వారా అమెరికా–ఇరాన్ మధ్య "ఇస్లామాబాద్ ఒప్పందం"పై జూన్ 17,18 తేదీలలో సంతకాల ప్రక్రియ పూర్తయిన తర్వాత హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధాన్ని అమెరికా ఎత్తివేసింది. జలసంధిలో నౌకల రాకపోకలను ఇరాన్ పునరుద్ధరించింది. కానీ అసలు చిక్కు అప్పుడే ప్రారంభమైంది. ఇరాన్ ప్రాదేశిక జలాలలోంచి కాకుండా దొడ్డిదారుల్లో నౌకలను నడిపించేందుకు అమెరికా ప్రయత్నాలు చేయడంతో ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే గాలివానగా మారి మళ్ళీ యుద్ధానికి దారితీసింది. ఆ తర్వాత మళ్ళీ రాజీకి వచ్చినప్పటికీ జులై ఏడో తేదీన రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేయడంతో యుద్ధం మొదలైంది. ఈ సమయంలోనే ఎంఒయు నుండి పూర్తిగా వైదొలగినట్లు ఇరాన్ ప్రకటించింది. వరుసగా 13 రోజులపాటు పరస్పరం ఉద్ధృత దాడులు కొనసాగిన తర్వాత జులై 25వ తేదీ తెల్లవారుజాము నుండి రెండు దేశాలమధ్యా దాడులు నిలిచిపోయాయి. ఇప్పుడు మళ్ళీ చర్చలమార్గం పడుతున్నారు.

# ఉక్రేన్‌కు ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్:** కాస్పియన్ సముద్రంలో తమ నౌకపై దాడి చేసినందుకు ఖచ్చితంగా ఊహించని పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉక్రేన్‌కు ఇరాన్ హెచ్చరిక చేసింది.ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి ఇస్మాయిల్ బఖాయి టెహ్రాన్‌లో పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఉక్రేన్ చర్య ఐక్యరాజ్యసమితి చట్టాలకు విరుద్ధమని విమర్శించారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కాస్పియన్ సముద్రంలో సైనిక సరుకులు రవాణా చేస్తున్న అన్ని ఇరాన్ నౌకలపై దాడులు చేసినట్లు శనివారం ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఈ దాడుల్లో ఇరాన్ నౌక పేలిపోయి దగ్ధం కాగా, ఒక నావికుడు మరణించాడు. మరో నావికుడు గాయపడ్డాడు. దీనిపై బఖాయి మాట్లాడుతూ, ఇది ప్రమాదకరమైన సాహకృత్యమని,తగిన ప్రతీకారం తీర్చుకుంటామని, ఈ చర్చలకు ఇరాన్ మూల్యం చెల్లించాలన్నారు. జెలెన్‌స్కీ ప్రవర్తన మొదటి ప్రపంచ యుద్ధానికి ముందున్న యూరప్ అరాచకవాదులను గుర్తు చేస్తోందన్నారు. లేని ప్రాధాన్యతను ప్రభావాన్ని చూపించడానికి ఆయన ప్రయత్నం చేస్తున్నారని, పశ్చిమాసియా యుద్ధంలో ఉక్రేన్‌కు ఎలాంటి ప్రమేయం లేదని అన్నారు. కానీ జెలెన్‌స్కీ మాత్రం రష్యా కృత్రిమ ఉపగ్రహాలు పశ్చిమాసియాలో ఇరాన్ దాడులు చేయడానికి ఉపయోగపడుతున్నాయని ఆరోపించారు.

**రష్యాపై ఉక్రేన్ దాడి గిడ్డంగులు, భవంతులు ధ్వంసం**

మాస్కో:రష్యాపై ఉక్రేన్ చేసిన దాడుల్లో ఒక బాలిక సహా ఐదుగురు మరణించారు. సోమవారం తెల్లవారకముందుగానే ఈ దాడులు జరిగాయని రష్యా వర్గాలు ప్రకటించాయి. ఈ దాడిలో గిడ్డంగులు,ఒక అపార్ట్‌మెంట్ బ్లాక్ సహా భవంతులు కూడా తగలబడిపోయాయి. దాడుల్లో 12 మంది గాయపడ్డారు. మృతుల్లో ఒక జంట,చిన్నారి ఉన్నారు. వీరంతా



రోస్టోవ్ ప్రాంతానికి చెందినవారే. పశ్చిమ రోస్టోవ్ ప్రాంతంలోని ఒక ఎగుమతి టెర్మినల్‌పైన, యుద్ధ ప్రాంతానికి దూరంగా ఉన్న యూరోస్లావ్,ఉడ్ముర్టియా ప్రాంతాలలో ఉన్న చమురు కేంద్రాలపైనా కూడా ఉక్రేన్ డ్రోన్లు, క్షిపణులు దాడులు చేసినట్లు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఉక్రేన్ సరిహద్దులకు 1300 కి.మీ దూరంలో ఉన్న రష్యాలోని లోతైన ప్రాంతాలలో డ్రోన్లు,క్షిపణులు దాడులు చేస్తున్నాయి. రష్యాను ఎలాగైనా చర్చలకు రప్పించాలనే లక్ష్యంతో ఇటీవలి కాలంలో ఉక్రేన్ దాడుల తీవ్రత పెంచింది.

## యుద్ధ విరామ సమయంలో నేడు ట్రంప్–నెతన్యాహూ కీలక చర్చ

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ మంగళవారం (జులై 28) చర్చలు జరుపుతారు. అమెరికా–ఇరాన్ మధ్య శనివారం తెల్లవారుజాము నుండి పోరాటం నిలిచిపోయింది. చర్చల వాతావరణానికి అనుకూలంగా ఈ యుద్ధ విరామం వచ్చినప్పటికీ ఇరాన్ ఎంత మాత్రం అమెరికాను నమ్మడం లేదు. నెతన్యాహూ మాయలో పడి దాడులను ఉద్ధృతం చేస్తే యుద్ధం మరింతగా విస్తరిస్తుందని ఈ సమావేశానికి రెండు రోజుల ముందే ఇరాన్ తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. పోరాటం నిలిచిపోయినప్పటికీ అమెరికాతో ప్రస్తుతం ఎలాంటి చర్చలకు తాము సుముఖంగా లేమని, వారిపై నమ్మకం లేదని ఇరాన్ ప్రకటించింది. ట్రంప్ విశ్వసనీయత రుజువుచేసుకోవడం కోసం రెండు షరతులను విధించింది. తాము విధించిన రెండు షరతులను ఒప్పుకుంటే చర్చలకు వస్తామని స్పష్టం చేసింది. ఈ దశలో నెతన్యాహూతో ట్రంప్ సమావేశం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. పోరాటం నిలిచిపోయినప్పటికీ భారీ ఎత్తున ఇరాన్‌పై యుద్ధ దాడులకు ట్రంప్ ప్రణాళిక చేస్తూనే ఉన్నారని ఇజ్రాయెలీ పత్రికలు ఊహాగానాలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు రాస్తున్నాయి. నెతన్యాహూ సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు బీర్షెబాలోని నెవాటిమ్ వైమానిక స్థావరం నుండి వాషింగ్టన్ డి.సికి బయలుదేరారు. మంగళవారం ఉదయం వారిద్దరూ ముఖాముఖీ సమావేశం జరుపుతారు.

## 30 శాతమే (మొదటి పేజీ తరువాయి)

వరకు కేవలం 51 శాతం మాత్రమే సాగు అయింది. రాష్ట్రంలో ఉన్న 87 ప్రధాన రిజర్వాయర్లలో ప్రస్తుత నిల్వ 335.47 టిఎంసిలు (31.67 శాతం) మాత్రమే ఉన్నాయి. గత వారం రోజులుగా రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఒకే జిల్లాలో కూడా కొన్ని మండలాల్లో వరద పరిస్థితులు, మరికొన్ని మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కారణంగా ఒకే జిల్లాలో రైతులు పంటల సాగు విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, భూగర్భ జలాలపై దీని ప్రభావం పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రానున్న రెండు నుంచి మూడు వారాల్లో కురిసే వర్షాలే ఈ ఖరీఫ్ సీజన్ భవితవ్యాన్ని నిర్ణయించే అవకాశం ఉందని వ్యవసాయ, నీటిపారుదల రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్రంలోని 87 ప్రధాన రిజర్వాయర్లలో కేవలం 335.47 టిఎంసిలే**

రాష్ట్రంలో గోదావరి, కృష్ణ రెండు బేసిన్‌లలో కలిపి మొత్తం 87 ప్రధాన రిజర్వాయర్లు ఉండగా, వీటి మొత్తం నిల్వ సామర్థ్యం 1059.3 టిఎంసిలు కాగా ప్రస్తుత నిల్వ 335.47 (31.67 శాతం) టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి శ్రీరాంసాగర్, మిడ్ మానేరు, లోయర్ మానేరు, నాగార్జునసాగర్, శ్రీశైలం, సింగూర్, నిజాంసాగర్, ఎల్లంపల్లి తదితర ప్రధాన రిజర్వాయర్లలో 649.96 టిఎంసిలు ఉన్నాయి. గత 10 ఏళ్లపాటు సగటున చూసుకుంటే ప్రతి ఏటా ఈ కాలానికి 527.17 టిఎంసి నీటి నిల్వలు ఉండగా, ఈ ఏడాది మాత్రం కేవలం 335.47 టిఎంసిలకు మాత్రమే ఉన్నాయి. మరోవైపు రాష్ట్రంలో మొత్తం 21500 చెరువులు ఉండగా, వాటిలో నీటి నిల్వ సామర్థ్యం253.8 టిఎంసిలు కాగా, ఈ ఏడాది వీటిలో కేవలం 64.08 (25.5శాతం) టిఎంసిలు ఉన్నాయి. దీంతో అటు రిజర్వాయర్లలో నీటి చెరువులో నీరు లేకపోవడంతో బోరు బావులపై తీవ్ర భారం పడుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే భూగర్భ జలాలు మరింత అడుగంటి పోయి వ్యవసాయం మరింత సంక్షోభంలో పడే అవకాశం ఉంది.

**సాధారణ ఖరీఫ్ లక్ష్యంలో సగమే సాగు**

ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.35 కోట్ల ఎకరాలలో సాగును నిర్ధేశించుకోగా, ఇప్పటివరకు 68.4 లక్షల ఎకరాల్లో ( 51 శాతం ) మాత్రమే సాగు జరుగుతున్నది. ఇంకా 66.06 లక్షలకు పైగా ఎకరాలు సాగు కావాల్సింది. ఇందులో ప్రధాన పంటల సాగు వివరాలను పరిశీలిస్తే వరి11.0 లక్షల ఎకరాలు సాగు కాగా గత ఏడాది కంటే చాలా తక్కువ. ఈ ఏడాది పత్తి కాస్తా విస్తీర్ణం పెరిగినప్పటికీ రైతులు తమ పంటను రక్షించుకునేందుకు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. మొక్కజొన్న 4.09 లక్షల ఎకరాలు సాగు కాగా గత ఏడాదికంటే తగ్గింది. కంది3.68 లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది స్వల్పంగా పెరుగగా జొన్న 0.19 లక్షల ఎకరాలు కూడా సాగు కాకపోవడంతో గత ఏడాదితో పోల్చితే తగ్గింది.

**జిల్లాల వారీగా పరిస్థితి**


ఉత్తర తెలంగాణలో ఆదిలాబాద్, కుమురంభీమ్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినా విస్తృతంగా పడకపోవడంతో పత్తి, సోయాబీన్ సాగు కొనసాగుతున్నప్పటికీ నేల తేమ సరిపోకపోవడంతో రైతులు బిక్కుబిక్కుమ ంటున్నారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలో వర్ష భావ పరిస్థితుల కారణంగా వరి నాట్లు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. దక్షిణ తెలంగాణలో నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో లోటు వర్షపాతం కారణంగా బోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పశ్చిమ తెలంగాణకు సంబంధించి సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పత్తి సాగు కొనసాగుతున్నప్పటికీ వర్షాలు అత్యవసరంగా మారాయి.

# రంగనాథ్‌ను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

ధిక్కరణ కేసులు నమోదవడం, అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడం అత్యంత తీవ్రమైన అంశమని పేర్కొంది. చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వ అధికారులు కోర్టు ఆదేశాలనే విస్మరిస్తే ప్రజలు న్యాయవ్యవస్థపై విశ్వాసం ఎలా ఉంచగలరని హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం ఒక అంశమైతే, కోర్టు ఎదుట ఇచ్చిన హామీని ధిక్కరించడం మరింత తీవ్రమైన కోర్టు ధిక్కారమని స్పష్టం చేసింది. ప్రజా ఆస్తులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వ సంస్థలపై ఉన్నప్పటికీ, ఆ బాధ్యత పేరుతో చట్టాన్ని అతిక్రమించే హక్కు ఎవరికీ లేదని తేల్చిచెప్పింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామం సర్వే నెం. 1, 2లోని 40 ఎకరాల భూమిలో ఈనెల 17 హైడ్రా కూల్చివేతలు చేపట్టడాన్ని సవా లు చేస్తూ శాంతా శ్రీరాం కన్స్ట్రక్షన్స్ ప్రైవే ట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చే సింది. దీనిని జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ సో మ వారం విచారణ జరిపి పైవిధంగా సమగ్ర ఉత్తర్వులను వెలువరించారు.హైడ్రా కమిషనర్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు రిజిస్ట్రీ సమర్పించిన నివేదికను ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. ఇన్ని కేసులు నమోదైనా సంబంధిత అధికారిలో మార్పు కనిపించకపోవడం ఆందోళనకరమని పేర్కొంది. ప్రస్తు తం విచారణలో ఉన్న కేసులోనే కోర్టు ఆదేశాలను వరుసగా మూడుసార్లు ఉల్లంఘించడం యాదృచ్ఛికం కాదని, అది ఉద్దేశపూర్వక చర్యగానే కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ నెల 20న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరైన రంగనాథ్, నగర ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసమే చర్యలు తీసుకున్నామని చెప్పిన వివరణను కూడా హైకోర్టు తిరస్కరించింది. ఆ వాదన చట్టబద్ధమైన సమర్థన కాదని స్పష్టం చేసింది. కోర్టు ఎదుట ఇచ్చే హామీ కూడా కోర్టు ఉత్తర్వులతో సమానమేనని న్యాయస్థానం మరోసారి గుర్తు చేసింది. ఒకసారి హామీ ఇచ్చిన తర్వాత దానికి విరుద్ధంగా వ్యవహరించడానికి ఎలాంటి చట్టబద్ధమైన ఆధారం ఉండదని పేర్కొంది. ప్రజా ప్రయోజనం పేరుతో కోర్టు ఆదేశాలను పక్కనబెట్టి చర్యలు తీసుకోవడానికి చట్టంలో ఎక్కడా అవకాశం లేదని, అలాంటి చర్యలను ఏ న్యాయస్థానమూ సమర్థించదని స్పష్టం చేసింది. కోర్టు తీర్పుల అమలే రాజ్యాంగబద్ధ పాలనకు పునాది అని, వాటిని అమలు చేయకపోవడం ఉద్దేశపూర్వక ధిక్కారంగానే పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ సంస్థలు తమను తాము స్వతంత్ర అధికార కేంద్రాలుగా భావించి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేస్తే అది న్యాయపాలనకు 'మత్యు ఘంటిక' మోగించినట్లేనని ఘాటుగా వ్యాఖ్యానించింది. అధికార దుర్వినియోగాన్ని సహించే ప్రసక్తే లేదని, హైడ్రా కూడా చట్టం నిర్దేశించిన హద్దుల్లోనే పనిచేయాలని స్పష్టం చేసింది. రంగనాథ్ దాఖలు చేసిన క్షమాపణ అఫిడవిట్‌ను కూడా హైకోర్టు అంగీకరించలేదు. నిజమైన క్షమాపణ అనేది శిక్ష తప్పించుకునేందుకు చివరి క్షణంలో చెప్పేది కాదని, తప్పు తెలుసుకున్న వెంటనే హృదయపూర్వకంగా వ్యక్తం చేయాల్సిందని పేర్కొంది. గత విచారణలో క్షమాపణ చెబితేనే కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు అనుమతించిన విషయాన్ని గుర్తు చేస్తూ, చివరి దశలో సమర్పించిన క్షమాపణను నిజాయితీతో కూడినదిగా పరిగణించలేమని స్పష్టం చేసింది.కోర్టు ఆదేశాలను అమలు చేయించడం, వాటిని ధిక్కరించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం న్యాయస్థానాల రాజ్యాంగబద్ధ బాధ్యత అని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించి, కొత్త అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు పునరావతం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేసింది.

## క్షమాపణ చెబుతూ రంగనాథ్ అఫిడవిట్



హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ తనపై పెండింగ్‌లో ఉన్న కోర్టు ధిక్కరణ కేసును కొట్టివేయాలని సోమవారం దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో హైకోర్టును కోరారు. బేషరతుగా క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. కోర్టుల పట్ల గౌరవం ఉందని, కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. శాంతా శ్రీరామ్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. తన చర్యలు కోర్టు ప్రతిష్టకు భంగం వాటిల్లినట్టుగా భావించి ఉంటే అందుకు క్షమాపణలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. హైకోర్టు అధికారాన్ని, గౌరవాన్ని గౌరవిస్తామని, న్యాయస్థానం పట్ల తనకు సంపూర్ణ గౌరవం ఉందని స్పష్టం చేశారు. కోర్టు పట్ల ఉన్న అత్యంత గౌరవంతోనే ఈ క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు పిటిషనర్ పేర్కొన్న రంగారెడ్డి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో హైడ్రా ఎలాంటి జోక్యం చేసుకోలేదని, ప్రస్తుతం కూడా జోక్యం చేసుకోవడం లేదని అఫిడవిట్‌లో వివరించారు. అలాగే పిటిషనర్ ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని కోర్టుధిక్కరణ కేసును కొట్టేయాలని కోరారు.

## రాజ్యాంగ హక్కు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించారంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. 'శాంతియుత నిరసన హక్కు రాజ్యాంగంలో పొందుపరచబడింది. అది సంపూర్ణంగా హామీ ఇవ్వబడిన హక్కు. దాన్ని ఎవరూ నిరాకరించలేరు. కేవలం ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసుల అతిగా బలప్రయోగాన్ని సమర్థించలేం. ఎవరైనా శాంతియుతంగా ఆందోళన చేయాలనుకుంటే అందుకు ఒక నిర్దిష్ట ప్రోటోకాల్ ఉండాలి. అలాంటి నిరసనలకు తగిన స్థలాన్ని కూడా కల్పించాలి. అందులో ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే సంఘవిద్రోహ శక్తులు చొరబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. ఇది దేశవ్యాప్తంగా వర్తించే అంశం. ఒకే విధమైన ప్రోటోకాల్ అవసరం ఉంది. ఎవరి బాధ్యతలు ఏమిటి? ఎలాంటి తప్పనిసరి మార్గదర్శకాలు ఉండాలి? అనే విషయాలను పరిశీలిస్తాం. ఈ ప్రక్రియలో స్వీయ క్రమశిక్షణ కూడా చాలా ముఖ్యమైనది' అని సిజెఐ సూర్యకాంత్ పేర్కొన్నారు.

**పోలీసుల భద్రత కూడా ముఖ్యమే**

విచారణ సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దాడులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీనియర్ న్యాయవాదులు గోపాల్ శంకరనారాయణన్, కాలిన్ గోన్సాల్వెస్, వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. మరోవైపు విచారణ సందర్భంగా నిరసనల్లో కొందరు పోలీసు సిబ్బందిపై కూడా దాడులు జరిగాయని ఒక న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జోయ్‌మాల్య బాగ్చి, 'వారు ఎవరైనా సరే, ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదే. పోలీసు సిబ్బంది భద్రత కూడా అంతే ముఖ్యమైనది. వారికి తగిన భద్రత ఎందుకు కల్పించలేదో రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరే అంశాన్ని కూడా పరిశీలిస్తాం' అని అన్నారు. పోలీసుల కుటుంబ సభ్యులు దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను కూడా ఇతర పిటిషన్లతో కలిసి విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

**మంగళవారం తదుపరి విచారణ**

విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి సంబంధించిన పిటిషన్లతో పాటు, పోలీసు సిబ్బందిపై జరిగిన దాడుల అంశానికి సంబంధించిన పిటిషన్‌ను కూడా కలిపి మంగళవారం విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణకు సంబంధించిన ఏకరూప మార్గదర్శకాల అంశంపైనా కోర్టు పరిశీలన జరిపే అవకాశం ఉంది.

## అర్ధాకలితో ఉండొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సువర్ణక్షరాలతో లిఖించాల్సిన అంశమన్నారు. హరేకృష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకానైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధిరలో తాత్కాలిక సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 16 మండలాల స్కూళ్లకు వాహనాల్లో అల్పాహారాన్ని అందిస్తున్నామన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు తెలిపారు. పాలన అంటే హోదా కాదని అధికారం అంటే పెత్తనం చెలాయించడం కాదన్నారు. ఉన్న వనరులను పోగేసి సమాజహితం కోసం ప్రణాళికలు తయారు చేయడం వారి అభివృద్ధి కోసం పునాదులు వేయడమేనన్నారు. ఇండ్లు లేని వారి కోసం ఐదు లక్షల సాయంతో ఇండ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజల కష్టాలను కనులారా చూశానని నాడు రూపుదిద్దుకున్న నా ఆలోచనలే నేడు పథకాలుగా అమలవుతున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్, ఎంఎల్‌సి శ్రీపాల్‌రెడ్డి, వైరా ఎంఎల్‌ఎ మాలోత్ రాందాస్ నాయక్, హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్, ది అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షులు సత్య గౌరా చంద్ర దాస స్వామిజీ, సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్ జ్యోతి, హరేకృష్ణ ఫౌండేషన్ సిఈవో కౌంతేయ స్వామిజీ, కార్పొరేషన్ ఛైర్మెన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, డిఈవో సదానందం, ఖమ్మం ఆర్టివో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్అండ్‌బి ఎస్ఈ యుగంధర్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సిపివో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అల్పాహార కార్యక్రమం భవిష్యత్తులో దిగ్విజయంగా సాగాలని జరిపించిన నృసింహ మహా యాగంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని అనంతరం కిచెన్‌ను ప్రారంభించారు. అల్పాహారంతో పాటు మిల్క్ యూనిట్, యంత్రాలను, కూరగాయలు శుద్ధి చేసే మిషన్లు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఉప ముఖ్యమంత్రి అల్పాహారం చేశారు. అనంతరం వివిధ పాఠశాలలకు అల్పాహారం అందించే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

## బిల్లుపై నేడు చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సమస్యను పరిష్కరించుకుని ఏకాభిప్రాయానికి రావడానికి మూడు సమయం ఇస్తున్నానని ఓంబిర్లా ప్రకటించారు. ఆ తర్వాత ఆయన చొరవతో చర్చలు జరిగాయి.

ఓం బిర్లా చొరవ తీసుకుని అన్ని రాజకీయపార్టీలతో సుదీర్ఘ చర్చించి ఈ సవరణ బిల్లుపై చర్చకు అన్ని పార్టీల సభాపక్ష నాయకులను ఒప్పించారని,సభలో వివాదం ముగిసినట్టేనని పార్లమెంటరీ వర్గాలు సోమవారం సాయంత్రం ప్రకటించాయి. ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు–2026పై మంగళవారం సభలో చర్చించడానికి ప్రతిపక్షాలు అంగీకరించాయని వర్గాలు తెలియజేశాయి.తామంతా ఈ విషయంలో ఏకాభిప్రాయంతో వ్యవహరిస్తామని లోక్‌సభాపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తొలుత ప్రకటించారు.

ప్రభుత్వం సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నదని, ఈ సవరణ బిల్లు ద్వారా కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధపడిందని, ఈ మేరకు ఒక అత్యున్నతాధికారాలుగల టాస్క్‌ఫోర్స్‌ను కూడా ప్రభుత్వం నిపుణులతో ఏర్పాటు చేసినందువల్ల విశ్వసనీయత సాధించేందుకు సహకరించాలని,ఇది నినాదాలకు సమయం కాదని, బిల్లుపై చర్చిద్దామని, ఆ సమయంలో అభిప్రాయాలను సభ్యులు తెలియజేయాలని ఓంబిర్లా లోక్‌సభలో వివిధ పక్షాల నాయకులకు చర్చల్లో విజ్ఞప్తులు చేసిన తర్వాత బిల్లుపై చర్చకు అన్ని రాజకీయ పార్టీలు అంగీకరించాయి. కాగా మరోవైపు కిరెణ్ రిజుజు మాట్లాడుతూ, ఈ బిల్లుపై చర్చించేందుకు అనేకమంది ఎంపీలు,ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నారని, కానీ కాంగ్రెస్‌పార్టీ ఈ వాతావరణాన్ని చెడగొట్టి చర్చ జరగకుండా అడ్డుపడిందని ఆరోపించారు.

ఈ సవరణ బిల్లులో ఉన్న ప్రత్యేకతలు, పొందుపరచిన కఠినమైన శిక్షలు,జరిమానాల గురించి పూర్తి వివరాలు గందరగోళం మధ్యే జితేంద్ర సింగ్ సభకు వివరించారు. సభ సోమవారం సమావేశం కాగానే మొదట ఈ బిల్లును పరిచయం చేశారు. ఆ తర్వాత బిల్లుకు వ్యతిరేకంగా సభలో తమ అభిప్రాయాలు చెప్పాలనుకున్న ప్రతిపక్ష నాయకులు సౌగతారాయ్ (టిఎంసి),మనీశ్ తివారీ(కాంగ్రెస్),ఎన్‌కె.ప్రేమచంద్రన్ (ఆర్ఎస్‌పి) వంటి వారిని సభా సంప్రదాయాల ప్రకారం స్పీకర్ పేరుపెట్టి పిలిచి చర్చలో పాల్గొని మాట్లాడాలని కోరారు. కానీ ఎవ్వరూ స్పందించకపోవడంతో బిల్లును ప్రవేశపెట్టాల్సిందిగా జితేంద్ర సింగ్‌ను స్పీకర్ కోరారు. మంత్రి బిల్లును సభలో ప్రవేశపెట్టిన తర్వాత నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. స్పీకర్ అందుకు తిరస్కరించారు. దీంతో రోజంతా చర్చలతో,నిరసనతో గడిచింది.

# స్వర్ణం ముద్దాడిన ఈషా...

## కాంస్యం గెలిచిన మను... ఐఎస్ఎస్ ప్రపంచకప్‌లో 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ పోడియంపై విన్నర్లుగా ఇద్దరు భారత షూటర్లు



హాంగ్‌జౌలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ (ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్) ప్రపంచ కప్ 2026లో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ పోడియంపై ఇద్దరు భారత షూటర్లు విన్నర్లుగా నిలిచారు. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు అద్భుత ప్రదర్శనను కొనసాగించారు. ఇందులో ఈషా సింగ్ అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకం ముద్దాడింది. ఒలింపిక్ పతక విజేత సీనియర్ షూటర్ మను భాకర్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. ప్రపంచ రికార్డు హోల్డర్ ఈషా సింగ్ ఫైనల్‌లో ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. ఆమె పోటీ అంతటా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, 50 షాట్‌లకు 40 పాయింట్లు సాధించింది. దీంతో ఆమె స్వర్ణ పతకం దక్కించుకుంది. 37 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఆతిథ్య చైనా షూటర్ యూ జాంగ్‌ను రజత పతకం గెలుచుకుంది. ఇక రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన మను భాకర్ కూడా ఈ పోటీలో ఫేవరెట్‌గా దిగింది. అయితే ఆమె స్వర్ణం కోసం పోరాడగా, కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో ఆమె ఉత్తర కొరియాకు చెందిన హ్యోన్ జియోంగ్ పాక్‌ను ఎదుర్కొంది. డబుల్ షూట్ ఆఫ్‌లో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో మను భాకర్ నెగ్గింది. దీంతో ఈ వరల్డ్‌కప్‌లో భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది.

### రెండో స్వర్ణం

కాగా, ఈ సీజన్‌లో హాంగ్‌జౌలో ఈషా సింగ్‌కు ఇది రెండో ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ స్వర్ణ పతకం కావడం విశేషం. ఆమె ఈ పోటీకి ముందు మే నెలలో జరిగిన మ్యూనిచ్ ప్రపంచ కప్‌లో 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ గెలుచుకుంది. అదే పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లోనూ సత్తా చాటి రజత పతకాన్ని కూడా ముద్దాడింది. మరోవైపు, మను భాకర్‌కు ఈ సీజన్‌లో ఇదే వ్యక్తిగతంగా మొదటి పతకం. 2026లో ఆమె మ్యూనిచ్ ప్రపంచ కప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పతకం సాధించింది.

# వరుసగా మూడో స్వర్ణం.. చరిత్ర సృష్టించిన మీరాబాయి చాను




గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్‌కు స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తొలి స్వర్ణాన్ని అందించింది. భారత దిగ్గజ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను మహిళల 48 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించి భారత కీర్తి పతాకాన్ని ఎగరేశారు. కామన్వెల్త్ క్రీడలలో మీరాబాయి చానుకు ఇది వరుసగా మూడో స్వర్ణ పతకం కావడం విశేషం. పోటీ ప్రారంభం నుంచే మీరాబాయి తన పోటీదారుల కంటే చాలా ముందుంది. స్నాచ్ రౌండ్లో అత్యధికంగా 82 కిలోల బరువును ఎంచుకుని మీరాబాయి చాను అద్భుతంగా రంగప్రవేశం చేసింది. ఆ తర్వాత మీరాబాయి అదే మ్యాచ్లో వరుసగా రెండు రికార్డులను బద్దలు కొట్టింది. తన రెండో ప్రయత్నంలో 82 కిలోలు ఎత్తి కొత్త కామన్వెల్త్ రికార్డును నెలకొల్పగా.. మూడో ప్రయత్నంలో ఏకంగా 85 కిలోలు ఎత్తి తన సొంత రికార్డునే మళ్లీ బద్దలు కొట్టింది.

**క్లీన్ అండ్ జర్క్‌తో స్వర్ణం కైవసం...**క్లీన్ అండ్ జర్క్ రౌండ్‌లో మీరాబాయి 105 కిలోగ్రాముల భారీ బరువుతో ప్రారంభించింది. ఆమె తన మొదటి ప్రయత్నంలో విఫలమైనప్పటికీ.. ఒత్తిడిలో రాణించడం ఎల్లప్పుడూ ఆమె బలం. తన రెండో ప్రయత్నంలో ఆమె 105 కిలోగ్రాములను విజయవంతంగా ఎత్తి, భారతదేశానికి స్వర్ణ పతకాన్ని ఖాయం చేసింది. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ రెండింటిలోనూ మొత్తం 190 కిలోల (85 + 105) బరువును ఎత్తి, కామన్వెల్త్ గేమ్స్‌లో మొత్తం బరువు విభాగంలో కొత్త చారిత్రక రికార్డు సృష్టించి మీరాబాయి చాను స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. ఈ పోటీలో నైజీరియాకు చెందిన రూత్ అజుకువో న్యోంగ్ 168 కేజీల బరువును ఎత్తి రజత పతకాన్ని గెలుచుకోగా, మలేషియాకు చెందిన ఐరీన్ జేన్ హెన్రీ 167 కేజీల బరువును ఎత్తి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు.

## యువతరంగం

# ప్రత్యేక అవసరాలు గల యువతకు ఎఐ ఊతం!

సాంకేతికరంగంలో వేగంగా జరుగుతున్న మార్పులు విద్యావ్యవస్థను కూడా కొత్త దిశగా నడిపిస్తున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఎఐ) అభివృద్ధి వల్ల ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు నాణ్యమైన, సమాన విద్యను అందించే అవకాశాలు విస్తరిస్తున్నాయి. శారీరక, మానసిక, మేధోపరమైన లేదా అభ్యాస సంబంధిత వైకల్యాలు ఉన్న పిల్లలు, యువత తమ సామర్థ్యాలకు అనుగుణంగా నేర్చుకునేలా చేయడంలో ఎఐ కీలక పాత్ర పోషించగలదని నిపుణులు భావిస్తున్నారు. ప్రతి విద్యార్థి నేర్చుకునే విధానం, అభ్యాస వేగం, ఆసక్తులు, సవాళ్లు ఒకేలా ఉండవు. అందువల్ల అందరికీ ఒకే బోధనా విధానాన్ని అనుసరించడం ఆశించిన ఫలితాలను ఇవ్వదు. ఎఐ ఈ సమస్యకు సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తోంది. విద్యార్థుల అభ్యాస తీరు, బలాలు, బలహీనతలను విశ్లేషించి, వారి అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన అభ్యాస ప్రణాళికలను రూపొందించగలదు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడంలో కూడా ఎఐ విశేషంగా ఉపయోగపడుతోంది. చూపులోపం ఉన్నవారికి పాఠ్యాన్ని స్వరరూపంలో వినిపించడం, వినికిడి సమస్యలు ఉన్న విద్యార్థులకు మాట్లాడే మాటలను వెంటనే వచనంగా మార్చడం, మాట్లాడలేని వారికి ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ సాధనాలను అందించడం వంటి సౌకర్యాలు ఇప్పుడు ఎఐ ద్వారా సాధ్యమవుతున్నాయి. దీంతో విద్యార్థులు ఇతరుల మాదిరిగానే తరగతి గదిలో చురుకుగా పాల్గొనే అవకాశం పొందుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు పరిపాలనా బాధ్యతల కంటే విద్యార్థులతో ప్రత్యక్షంగా ఎక్కువ సమయం గడిపి, వారి అభ్యాస అవసరాలపై మరింత శ్రద్ధ చూపగలుగుతారు. జనరేటివ్ ఎఐ అభివృద్ధితో విద్యారంగంలో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. చాట్‌జిపిటి వంటి వ్యవస్థలు సులభమైనభాషలో పాఠాలను రూపొందించడం, కథలు, చిత్రాలు, వివరణలు తయారు చేయడం, విద్యార్థులస్థాయికి అనుగుణంగా కొత్త విద్యాసామగ్రిని సృష్టించడం వంటి పనులను సమర్థంగా నిర్వహిస్తున్నాయి. దీంతో ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు బోధన మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా మారుతోంది. అయితే ఎఐ వినియోగం పూర్తిగా సమస్యలేనిదని చెప్పలేం. సాంకేతికతపై అతిగా ఆధారపడకుండా, ఎఐ అందించే సమాచారం, సూచనలను ఉపాధ్యాయులు, నిపుణులు పరిశీలించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం అవసరం. మొత్తంగా చూస్తే, కృత్రిమ మేధ ప్రత్యేక విద్యలో విప్లవాత్మక మార్పులకు దారితీసే సామర్థ్యాన్ని కలిగి ఉంది.




వ్యక్తిగతీకరించిన అభ్యాసం, అందుబాటు విద్య, ఉపాధ్యాయులకు సమర్థవంతమైన సహకారం వంటి అనేక ప్రయోజనాలను అందించగలదు. అయితే ఇది మానవ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదు, వారి సామర్థ్యాన్ని మరిం త పెంచే సహాయక సాంకేతిక సాధనం మాత్రమే. బాధ్యతాయుతంగా, శాస్త్రీయ దృక్పథంతో ఎఐను వినియోగించినప్పుడే ప్రత్యేక అవసరాలు ఉన్న ప్రతి విద్యార్థికి సమానమైన, నాణ్యమైన విద్యను అందించే లక్ష్యం సాకారం అవుతుంది.

# కోపాన్ని జయిస్తేనే నిజమైన శక్తి

'నిగ్రహాన్ని కోల్పోయి, కోపాన్ని జయించలేకపోతే సర్వం కోల్పోతాం' అనేది ప్రాచీన స్టోయిక్ తత్వశాస్త్రంలోని అత్యంత విలువైన బోధనల్లో ఒకటి. మనల్ని ఎవరైనా రెచ్చగొట్టినప్పుడు వెంటనే కోపంతో స్పందిస్తే, వాస్తవానికి మన భావోద్వేగాలపై నియంత్రణను వారికే అప్పగించినట్లవుతుంది. అందుకే కోపాన్ని అదుపులో ఉంచుకోవడం అనేది కేవలం మంచి అలవాటు మాత్రమే కాదు, వ్యక్తిత్వ బలానికి నిదర్శనం కూడా. నేటి తరం యువత ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. అభ్యసించాలి. ఎందుకంటే, కోపం వచ్చిన క్షణంలో మన ఆలోచనా శక్తి మందగిస్తుంది. సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. ఆవేశంలో మాట్లాడిన మాటలు, తీసుకున్న నిర్ణయాలు తర్వాత పశ్చాత్తాపానికి దారితీస్తాయి. అంతేకాదు, సమస్యను పరిష్కరించాల్సిన చోట మరింత క్లిష్టం చేసే అవకాశం కూడా ఉంటుంది. కానీ ప్రశాంతంగా ఉండగలిగిన వ్యక్తి పరిస్థితిని స్పష్టంగా అర్థం చేసుకొని, సమయోచితంగా స్పందించే అవకాశాన్ని పొందుతాడు. అందుకే నిజమైన బలం శారీరక శక్తిలో కాదు, భావోద్వేగాలను నియంత్రించగల సామర్థ్యంలోనే ఉంటుంది. ఎవరైనా మనల్ని కావాలనే రెచ్చగొట్టినప్పుడు, 'నా స్పందన నా నియంత్రణలోనే ఉంటుంది' అనే భావనను గుర్తుంచుకోవడం ఎంతో ఉపయోగపడుతుంది. ఇతరుల ప్రవర్తనను మనం నియంత్రించలేకపోవచ్చు. కానీ వారికి ఎలా స్పందించాలనేది పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుంది. ఈ అవగాహన పెరిగినప్పుడు కోపం క్రమంగా తగ్గి, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం పెరుగుతాయి. ఆత్మనియంత్రణ ఒక్కరోజులో అలవడదు. అది నిరంతర సాధనతోనే సాధ్యమవుతుంది. ప్రతి రోజూ కొంతసేపు ధ్యానం చేయడం, యోగా సాధన చేయడం, లోతుగా శ్వాస తీసుకునే వ్యాయామాలు చేయడం వంటి అలవాట్లు మనసును ప్రశాంతంగా ఉంచుతాయి. ముఖ్యంగా కోపం వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా, కొన్ని క్షణాలు ఆగి మూడు సార్లు లోతుగా శ్వాస తీసుకోవడం మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఈ చిన్న విరామమే ఆవేశపూరిత స్పందనను ఆలోచనాత్మక నిర్ణయంగా మార్చగలదు. జీవితంలో ప్రతి పరిస్థితిని మనం నియంత్రించలేము. కానీ ఆ పరిస్థితులకు మన స్పందనను మాత్రం నియంత్రించగలం. అదే నిజమైన మానసిక బలం. కోపాన్ని అదుపులో ఉంచి, సంయమనంతో వ్యవహరించడం ద్వారా మన వ్యక్తిత్వం మరింత పరిపక్వంగా మారుతుంది. ప్రశాంతతను అలవర్చుకున్న వ్యక్తి తన జీవితాన్నే కాదు, చుట్టూ ఉన్న పరిస్థితులను కూడా మరింత సమర్థంగా ఎదుర్కోగలుగుతాడు. అందుకే కోపాన్ని జయించడం అంటే ఇతరులను కాదు, ముందుగా మనల్ని మనం జయించడం.



# కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసించండి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో అశోక్ స్టాలిన్ అధ్యక్షతన సిపిఐ హనుమకొండ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పన్నెండు సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా పాలన చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం, తన అహంకారపూరిత నిర్ణయాలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తోందని, ప్రజల గొంతుకను అణచివేయాలని చూస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టి లేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతలతోనే నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. అవినీతి, అసమర్థ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ యువతరం గళం విప్పుతున్నదని, ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ రోజుల తరబడి విద్యార్థి, యువకుల ఆందోళనే ఇందుకు నిదర్శనం అన్నారు. అయోధ్య రామ మందిరంలో పెద్ద ఎత్తున రామ భక్తుల కానుకల చోరీ జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, కుంభకోణం బయట పడినా నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అయోధ్య దేవాలయంలో దోపిడీకి బిజెపి బాధ్యత వహించాలన్నారు. హిందూత్వం పేరుచెప్పి ఆలయ సంపద దోపిడీ చేశారని, బిజెపి నాయకులు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ అన్ని జిల్లాల్లో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 6 నుండి 14 వరకు నియోజకవర్గాల్లో పాదయాత్రలు జరుగుతాయని, సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేసి, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు మండ సదాలక్ష్మి, సిరబోయిన కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్రలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఆగస్టు 6 నుండి 14 వరకు సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహిస్తున్నామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఏం.బాలనరసింహ పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో వి.రవీందర్ అధ్యక్షతన పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎం.బాలనరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం 12 సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్న ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ యువతను మతం పేరిట కులం పేరిట రెచ్చగొడుతూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందన్నారు. విద్యార్థి యువకులు మేలుకొని ఇక చెల్లవు. మీ ఆటలు అని చెప్పడానికి ప్రస్తుతం నడుస్తున్న జెన్‌జి ఉద్యమమే నిదర్శనమన్నారు. రాముడి పేరుతో అధికారంలోకి వచ్చి అయోధ్య రామాలయం విరాళాలను మింగిన చరిత్ర బిజెపి వారిదేనని, చివరకు దేశ ప్రజలను కాకుండా దేవుడిని కూడా బిజెపి వాళ్లు మోసం చేశారని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తు దేశ ప్రజలను మోసం చేసిన విధానాన్ని ఈ పాదయాత్రల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. సిపిఐ జాతీయ కౌన్సిల్ పిలుపులో భాగంగా ఆగస్టు 6 నుండి 14 వరకు జరిగే పాదయాత్రలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పోకడకు వ్యతిరేకంగా, సంక్షేమ పథకాలలో పాదర్శకత కోసం, వాటి అమలు కోసం పాదయాత్రల ద్వారా ఊరురా తిరుగుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వాల మెడలు వంచి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ పాదయాత్రలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో జరిగే పాదయాత్రలను సిపిఐ శ్రేణులు విజయవంతం చేయాలని బాలనరసింహ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలలో ఒకటి రెండు తప్ప మిగతా ఏ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అధికార పార్టీ వాళ్లు నిజమైన అర్హులకు కాకుండా వారి ఇష్టానుసారంగా వారికి నచ్చిన వారికి ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అలాకాకుండా ప్రభుత్వ పారదర్శకంగా ప్రతి ఊరిలో ప్రభుత్వ అధికారుల చేత సర్వే నిర్వహించి అర్హులైన వారికి రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా పథకాలలో అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, ఆర్.ఇందిరమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు బిజ్జ శ్రీనివాసులు, కుతుబుద్దీన్, కాజా మైనుద్దీన్, తుమ్మల శివుడు, బండి లక్ష్మి పతి, కిరణ్‌కుమార్, టీ.మల్లయ్య, పరుశురాములు, మధుగౌడ్, శివశంకర్, వెంకటమ్మ, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మిషన్ భగీరథ ఇఇ రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలు కాలయాపన చేయకుండా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, ఎక్స్‌గ్రేషియా, ప్రమాద బీమా, రిటైర్మెంట్ ప్రయోజనాలు, ఉద్యోగ భద్రత, ఇఎస్ఐ, ఇపిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరి చిరంజీవి, చాపిడి బాలేష్, జంషద్, షకీర్, వెంకటేష్, రవీందర్, గౌతమ్, కలీం, కుమార్ పాల్గొన్నారు.

# 'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పనులను కొనసాగిస్తుందని, కార్మిక, కర్షక, రైతు, విద్యార్థి, యువత, మహిళ వ్యతిరేక విధానాలతో కార్పోరేట్ కనుకూలంగా పాలన సాగుతుందని, దీనిని వ్యతిరేకిస్తూ ప్రజాపాలనకు సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పశ్య పద్మ వెల్లడించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని శద్ధానంద్ గంజ్ కిసాన్ హాల్‌లో సిపిఐ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కార్యకర్తల రాజకీయ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను ప్రారంభించి ఆమె మాట్లాడారు. సోమ, మంగళవారం రెండు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందని ఆమె తెలిపారు. శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర భూమన్న వ్యవహరించగా పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను ఆగస్టు 6 నుండి 14 వరకు సిపిఐ గ్రామ గ్రామాన పాదయాత్ర చేపడుతూ వివరిస్తుందన్నారు. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభ, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. బిజెపి పాలనలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. దాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్పోరేట్ శక్తులకనుకూలంగా కార్మిక రైతు చట్టాలను అమలు చేస్తూ అదాని, అంబానీలకు దేశ సంపదను దోచి పెట్టే విధానానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాటం ఉంటుందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టపర్చాలని ప్రభుత్వం అన్ని పాశాలలల్లో డ్రాపౌట్లను గుర్తించి వారిని బడికి వచ్చే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. దేశంలో బిజెపి అవలంభిస్తున్న విధానాలపై యువత ఆగ్రహంగా ఉందన్నారు. దేశ రాజధానిలో చేపట్టిన ఆందోళనలో యువ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం ఇందుకు నిదర్శనమన్నారు. సిపిఐ చేపట్టే పాదయాత్రలలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పశ్య పద్మ కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శిపి. సుధాకర్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, రాజన్న రాజిరెడ్డి, స్వరూప రాణి, దుబాస్ రాములు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సమగ్ర అభ్యున్నతే లక్ష్యం

### మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మహిళల సమగ్ర అభ్యున్నతే లక్ష్యంగా జాతీయ మహిళ సమాఖ్య పనిచేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళ సమాఖ్య 4వ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. సభలో సృజన మాట్లాడుతూ మహిళల పరిస్థితి నేటికి సమాజంలో సవాళ్లతో నిండిఉన్నదని, వారికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు విస్తరించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వాలు మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సృజన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్త్రీలపై హింస, వివక్షత కొనసాగడం సమాజానికి మంచిది కాదన్నారు. మహిళల రక్షణ కుటుంబ రక్షణ అన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, పట్టణ అధ్యక్షురాలు యల్లావుల ఉమా, అయిలపురం లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, సింగినం పుల్లమ్మ, సుందరి పద్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, కెవిఎన్ మూర్తి, దూళిపాళ ధనుంజయనాయుడు, పోకల వెంకటేశ్వర్లు, కొప్పోజు సూర్యనారాయణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చెనగాని సైదులు, యల్లావుల రమేష్, జక్కుల శ్రీను పాల్గొన్నారు.



# ఐఐటి, నీట్ సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులదే

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఐఐటి, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సిద్ధం చేసే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. అంతకుముందు సిఎస్‌కు విద్యార్థులు,ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన కార్యదర్శి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు, మొక్కలను అందజేసి వారిని అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ప్రధాన కార్యదర్శి,పాఠశాలలో బోధన విధానం,తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమర్థవంతంగా బోధిస్తున్నారా అని విద్యార్థులను ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలోనే చదివి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగారని గుర్తు చేస్తూ,ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని చెప్పారు. విద్యార్థులు జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు.పలువురు విద్యార్థులను వారి భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకొని, వారి ఆశయాలను అభినందించారు.

**ఐఎఎస్ అధికారిని చూసి స్ఫూర్తి పొందాను : సిఎస్ సంజయ్ జాజు**

తాను కూడా దాదాపు నలభై సంవత్సరాల క్రితం తన పాఠశాలకు వచ్చిన ఒక ఐఎఎస్ అధికారిని చూసి స్ఫూర్తి పొంది, ఐఎఎస్ అధికారి కావాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకున్నానని తన అనుభవాన్ని సిఎస్ విద్యార్థులతో పంచుకున్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే ఐఐటి, నీట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించే దిశగా కృషి చేయాలని సిఎస్ సంజయ్ జాజు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.గోపితో సమావేశమైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన సహాయం ఏదైనా ఉంటే సంబంధిత అధికారులను లేదా తనను నేరుగా సంప్రదించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటిన ప్రధాన కార్యదర్శి, పాఠశాలను అత్యుత్తమంగా నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు గోపి, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండి కె.శశాంక,జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, స్థానిక ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపిడిఒ,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై మార్గనిర్దేశం చేయడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులు గోపి హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ కృష్ణారెడ్డి కేసులో దర్యాప్తు వేగవంతం

బాధిత మహిళా అధికారి వాంగ్మూలం నమోదు

హైకోర్టులో క్వాష్ పిటిషన్ పెండింగ్..

నిందితుడి ఆచూకీ కోసం గాలింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ పోలీసు అకాడమీ (ఎన్‌పిఎ) ట్రైనీ ఐపిఎస్ అధికారి ములగాని ఉదయ కృష్ణారెడ్డిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. కేసు విచారణలో భాగంగా మహిళా భద్రత విభాగం పోలీసులు బాధిత మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారి వాంగ్మూలాన్ని నమోదు చేయగా, ఘటనకు సంబంధించిన ఇతర సాక్షుల వాంగ్మూలాలను కూడా సేకరిస్తున్నారు. మరోవైపు, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉదయ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన క్వాష్ పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది. అయితే ముందస్తు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న అభ్యర్థనకు హైకోర్టు ఊరట ఇవ్వలేదని సమాచారం. ఇదిలా ఉండగా, దర్యాప్తు అధికారులు నిందితుడిని సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులో లేరని, మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా, జూలై 18న సహ ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారి ఫిర్యాదు మేరకు ఉదయ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, స్టాకింగ్, బెదిరింపులు, అనుమతి లేకుండా వ్యక్తిగత వీడియో చిత్రీకరణ తదితర ఆరోపణలపై కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారనే వార్తలు వెలువడగా, వైద్య పరీక్షల్లో విషపదార్థాల ఆనవాళ్లు లేవని వైద్యులు వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, హైకోర్టు విచారణతో పాటు పోలీసుల తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. అధికారులు సేకరిస్తున్న సాక్ష్యాధారాల ఆధారంగా తదుపరి న్యాయపరమైన చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

# టూరిజం కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి

సంస్థ ఎండిని కోరిన ఎఐటియుసి నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత రెండు దశాబ్దాలకు పైగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా, అరకొర వేతనాలతో సేవలు అందిస్తున్న తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు టూరిజం అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమిని ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఎ చాడా వెంకట్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పదవీ విరమణ వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచాలని, శాశ్వత ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందించి క్రమబద్ధీకరించాలని వారు కోరారు. అలాగే గతంలో మాదిరిగా రిస్క్ అలవెన్స్, బస్సు పాస్ సౌకర్యం, గ్రాట్యుటీ తదితర సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం, సోమశిల, కరీంనగర్ ప్రాంతాలను టూరిజం హబ్‌లుగా మార్చడంతో పాటు, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిన హోటల్స్, రెస్టారెంట్ల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల పర్యాటకులు పడుతున్న ఇక్కట్లను సరిదిద్దాలని కోరారు. టూరిజం ప్లాజాకు జనరల్ మేనేజర్ వ్యవస్థను పునరుద్ధరించి, విజిలెన్స్ విభాగాన్ని పటిష్ఠం చేయాలని ఎఐటియుసి నేతలు స్పష్టం చేశారు. అలాగే కొత్తగూడెం, సోమశిల, కరీంనగర్ ప్రాంతాలను టూరిజం హబ్‌లుగా మార్చాలని, నాగార్జున సాగర్, వికారాబాద్, రామప్ప తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిన హోటల్స్, రెస్టారెంట్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో పర్యాటకులకు కలుగుతున్న ఇబ్బందులను సరిదిద్దాలని కోరారు. టూరిజం ప్లాజా హోటల్స్‌కు గతంలో ఉన్న ప్రత్యేక జనరల్ మేనేజర్ వ్యవస్థను పునరుద్ధరించాలని, విజిలెన్స్ విభాగాన్ని మరింత పకడ్బందీగా మార్చాలని కోరారు.

# హైడ్రా హైదరాబాద్ నగరానికి అత్యంత అవసర వ్యవస్థ

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా హైదరాబాద్ నగరానికి అత్యంత అవసరమైన వ్యవస్థ అని, కమిషనర్ రంగనాథ్ సేవలను కొనసాగించాలని హైదరాబాద్ ప్రజల తరఫున హైకోర్టుకు విజ్ఞప్తి చేస్తున్నట్లు భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. హైడ్రా కమిషనర్‌ను తప్పించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన స్పందిస్తూ పేర్కొన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ సందర్భంగా తెలిపారు. హైడ్రా ద్వారా చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, రోడ్లు ఆక్రమణల నుంచి రక్షించబడ్డాయని, మున్సిపల్, పోలీసు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడిందని అన్నారు. అక్రమ నిర్మాణాల వల్ల కొంతమంది ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, అత్యధిక మంది ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రంగనాథ్ రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేశారని, హైడ్రా ద్వారా భారీ విలువైన ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించబడ్డాయని పేర్కొన్నారు. మంచి అధికారిని తప్పిస్తే భూ మాఫియాకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని, సామాజిక సంస్థలు, నగర ప్రజలు హైడ్రా వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

# తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా మారిపల్లి మాధవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా మారిపల్లి మాధవి నియమితులయ్యారు. ఈ మేరకు జాగృతి వ్యవస్థాపక చైర్‌పర్సన్ కల్వకుంట్ల కవిత సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవం కోసం రెండు దశాబ్దాలుగా పాటుపడుతుందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో ఈ ప్రాంత సాంస్కృతిక వైభవాన్ని, చారిత్రక నేపథ్యాన్ని పరిరక్షించి ప్రపంచానికి పరిచయం చేసేందుకు 2006లో తెలంగాణ జాగృతిని స్థాపించామని, ఈ సంస్థ బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసిందని కవిత పేర్కొన్నారు. ఈ సంస్థకు తాను వ్యవస్థాపక చైర్‌పర్సన్‌గా కొనసాగుతూ,జాగృతి నూతన అధ్యక్షులుగా మాధవిని నియమించినట్టు వివరించారు.

# 19 నియోజకవర్గాలకు టిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని మరో 19 నియోజక వర్గాలకు, 9 లోక్‌సభ నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జ్‌లను నియమించినట్టు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. ఈ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండో విడతలోనూ 19 స్థానాల్లో పది మంది బీసీలకు అవకాశం కల్పించినట్టు కవిత పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రక్షణ సేన మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా పడాల మనోజ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కనగల చైతన్య, ఉపాధ్యక్షురాలిగా అయిలి కవితను నియమించారు. విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా జానపాటి రాము యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మునుకుంట్ల నవీన్ గౌడ్, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లంపల్లి రామకోటి, ప్రధాన కార్యదర్శి గా గౌరిగె నర్సింహాను నియమించారు. అలాగే గ్రేటర్ వరంగల్ అధ్యక్షులుగా నడిపెల్లి వెంకటేశ్వరరావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా కుందూరు దేవేందర్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సుమలత సుధాకర్ శర్మను నియమించారు.

# ప్రొబేషనరీ డిఎస్‌పిలకు గుర్రపు స్వారీ శిక్షణ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆధునిక పోలీసింగ్‌లో శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, ప్రజా నియంత్రణ సామర్థ్యాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ అకాడమీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి)ల కోసం మూడు వారాల ప్రత్యేక ఈక్వెస్ట్రియన్ (గుర్రపు స్వారీ) శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్ సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ మౌంటెడ్ పోలీస్ విభాగంలో ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ప్రత్యేక చొరవతో ఈ శిక్షణను ప్రవేశపెట్టారు. గుర్రపు స్వారీ ద్వారా శారీరక దృఢత్వం, మానసిక సమతుల్యత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించే నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. శిక్షణలో భాగంగా 112 మంది డిఎస్‌పిలను మూడు బ్యాచ్‌లుగా విభజించి, ఒక్కో బ్యాచ్‌కు వారం రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం సిటీ మౌంటెడ్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో గుర్రపు స్వారీపై ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా అవుట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ టి. భరత్ మాట్లాడుతూ, భారీ ఉత్సవాలు, మతపరమైన వేడుకలు, ర్యాలీలు, నిరసనలు, విఐపి బందోబస్తు వంటి సందర్భాల్లో మౌంటెడ్ పోలీసింగ్ అత్యంత సమర్థవంతమైన ప్రజా నియంత్రణ సాధనంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. శిక్షణతో అధికారులు ప్రజలతో సమర్థవంతంగా వ్యవహరించడమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా, వేగంగా నిర్ణయాలు తీసుకునే నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటారని చెప్పారు.

# విద్య, ఉపాధే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

విద్యార్థులు, నిరుద్యోగులపై మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదు : బల్మూర్ వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్య, ఉపాధి రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ త్వరలోనే పోలీసు ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు, మరో 30 వేల ఉద్యోగాల నియామకాలకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని, వాటి భర్తీ ప్రక్రియ కూడా త్వరలో ప్రారంభమవుతుందని వెల్లడించారు. విద్యార్థులు, నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత బిజెపికి లేదని ఆయన విమర్శించారు. యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు.

**జెన్–జికి అవకాశాలపై రేవంత్ ఆలోచన :**

చట్టసభలకు పోటీ చేసే కనీస వయస్సును 21 ఏళ్లకు తగ్గించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనను అభినందించాల్సిందిపోయి విమర్శించడం సరికాదన్నారు. విద్యా రంగంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్లలో ఒక్క పేపర్ లీక్ కూడా జరగకుండా పరీక్షలు నిర్వహించామన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో విద్యా, ఉద్యోగ పరీక్షల్లో అనేక పేపర్ లీకులు జరిగాయని ఆరోపించారు. కేంద్రంలో 12 ఏళ్ల బిజెపి పాలన, తెలంగాణలో రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు డాక్టర్ బల్మూర్ వెంకట్ సవాల్ విసిరారు.

# 100వ మైలురాయిని చేరుకున్న ‘రైతు నేస్తం’

నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు వేదికల్లో 100వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వ్యవసాయ రంగంలో సాంకేతిక విజ్ఞానాన్ని రైతుల ముంగిటకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రైతు నేస్తం’ కార్యక్రమం మంగళవారం ప్రతిష్ఠాత్మకమైన 100వ ఎపిసోడ్‌ను చేరుకోనుంది. వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గత రెండున్నరేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందింది.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, రైతు వేదికలను కేవలం సమావేశాల కేంద్రాలుగా కాకుండా, వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించింది. రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సాంకేతికతతో వ్యవసాయ శాస్త్రవేత్తలను నేరుగా రైతులతో అనుసంధానం చేసి, పంటల సాగు నుంచి మార్కెటింగ్ వరకు అవసరమైన శాస్త్రీయ సమాచారాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత.ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాల అసమాన పంపిణీ, ఆలస్యమైన ఖరీఫ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల అవసరం వంటి పరిస్థితులు నెలకొన్న వేళ ‘రైతు నేస్తం’ కార్యక్రమం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఏ పంటలు సాగు చేయాలి, నేలలో తేమను ఎలా కాపాడుకోవాలి, తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటల ఎంపిక ఎలా ఉండాలి వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ మార్గనిర్దేశం అందుతోంది. 100వ ఎపిసోడ్ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి రైతు వేదికలో నిర్వహించే కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌నినో సవాళ్లకు సంసిద్ధం

మూడు రోజుల విత్తన పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంపై విసురుతున్న సవాళ్లను అధిగమించడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ సంసిద్ధమైంది. ఇందులో భాగంగా రైతు వేదికల ద్వారా రైతులకు విత్తన పంపిణీ కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఈనెల 29వ తేదీ వరకు కొనసాగించనుంది. కేవలం విత్తనాలు పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలి, ఏ రకాల విత్తనాలు అనుకూలం, నేల తేమను ఎలా కాపాడుకోవాలి, నకిలీ విత్తనాల మోసాన్ని అరికట్టడం, రైతులకు శాస్త్రీయ సలహాలు అందించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మూడు రోజుల పాటు ప్రభుత్వం చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమం రైతులకు కీలక భరోసాగా మారనుంది. రైతు వేదికలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా వ్యవసాయ సేవల కేంద్రాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

నాణ్యమైన విత్తనాల సరఫరాతో పాటు శాస్త్రీయ వ్యవసాయ సూచనలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం ద్వారా ఈ కార్యక్రమం ఖరీఫ్ సీజన్‌ను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి రైతు వేదికను విత్తన పంపిణీ కేంద్రంగా మార్చి, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రైతులకు విత్తనాలు అందజేస్తున్నారు.

**ధృవీకరించిన విత్తనాల పంపిణీ :** రైతు వేదికల ద్వారా ప్రాంతాల వారీగా వర్షపాతం, నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు వివిధ పంటల విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుములు, సోయాబీన్, జొన్నసజ్జ, వంటి పంటల విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. ఎల్‌నినోపరిస్థితుల నేపథ్యంలో తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే, తక్కువ నీరు అవసరమయ్యే రకాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. కంది, పెసర, మినుములు జొన్న, సజ్జ, ఇతర చిరుధాన్యాలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచిస్తున్నారు. విత్తనాల పంపిణీతోనే సరిపెట్టకుండ తగిన ఎరువులు, సాగునీటి నిర్వహణ, విద్యుత్ సరఫరా, మార్కెట్ భరోసా, పంటల కొనుగోలు వంటి అంశాల్లో కూడా సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు. నకిలీ విత్తనాల విక్రయాలపై కేసుల నమోదును వేగవంతం చేశారు.

# కీచక సిఐ

**స్టేషన్‌కు వచ్చిన యువతిని లొంగదీసుకుని, గర్భవతిని చేసి బలవంతంగా అబార్షన్ ..**

**వీడియోలతో బెదిరించి రూ.2కోట్లు వసూలు..**

**రెండేళ్లుగా నరక యాతన డిజిపికి ఫిర్యాదు చేసిన బాధితురాలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీలో ట్రైనీ ఐపిఎస్ అధికారి లైంగిక వేధింపుల ఘటన దర్యాప్తు కొనసాగుతుండగానే .. మరోపక్క హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విఐపి జోన్‌లో పోలీసు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (సిఐ)గా విధులు నిర్వహిస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ లైంగిక నిర్వాకం వెలుగు చూసింది. ఫిర్యాదు కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చిన యువతిని (27) లోబర్చుకున్న సదరు ఇన్‌స్పెక్టర్ రెండేళ్లుగా ఆమెపై అఘాయిత్యానికి పాల్పడటం..కొన్ని వీడియోలు తీసి బెదిరించి ఆమె నుంచి రెండు కోట్ల రూపాయలు తీసుకోవడం..చిత్రహింసలకు గురిచేయడంతో చివరకు బాధితురాలు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్‌ను ఆశ్రయించి తన గోడు వెల్లబోసుకుంది. తన ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కోరింది. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఓ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ (సిఐ)గా పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్‌గా మూడేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహించాడు. ఆ సమయంలో అదే జిల్లాలో నివాసముంటున్న ఓ మహిళ తన భర్త వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు సదరు ఇన్‌స్పెక్టర్ వద్దకు వెళ్లాలని, ఆ సమయంలో తనను మాయమాటలు చెప్పి అతని ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె పేర్కొంది. అదే సమయంలో తీసిన కొన్ని వీడియోలను చూపించి బ్లాక్ మెయిల్ చేశాడని, అతని వేధింపులు భరించలేక సుమారు రూ.2 కోట్ల రూపాయలు ఇచ్చానని, అందుకు సంబంధించిన సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. రెండేళ్లపాటు తనను చిత్రహింసలకు గురిచేశాడని, తనపై దాడులు కూడా చేశాడని, గర్భందాల్చిన తనకు బలవంతంగా నగర శివార్లలోని ఓ ఆసుపత్రిలో అబార్షన్ కూడా చేయించాడని ఆమె డిజిపికి తెలిపింది. ఈ ఘటనల కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని ఫిర్యాదులో పేర్కొంది. తన వద్ద నుంచి తీసుకున్న రూ.2 కోట్లను ఇన్‌స్పెక్టర్ వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నారని కూడా ఆమె ఆరోపించింది. ఈ విషయంపై గత ఏడాది డిసెంబర్‌లో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంది.ఇన్‌స్పెక్టర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని, హెచ్‌హెచ్‌వో పోస్టు కోసం రూ.25 లక్షలు చెల్లించి ఆ పదవిని పొందారని తనకు సమాచారం ఉందని ఫిర్యాదులో ప్రస్తావించింది. ఈ అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను పలుమార్లు కలిసి ఫిర్యాదు అందజేయడానికి ప్రయత్నించినప్పటికీ, సంబంధిత అధికారులు తనను లోపలికి అనుమతించలేదని బాధితురాలు ఆరోపించింది. తాను కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడ కొందరు తనను అడ్డుకున్నారని కూడా ఫిర్యాదులో పేర్కొంది. ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సందర్భాల్లో ‘నువ్వు ఏం చేసుకుంటావో చేసుకో, నాకు పైస్థాయిలో అండ ఉంది‘ అంటూ అవమానించారని, తనపై ఫిర్యాదు చేస్తే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారని కూడా ఆమె ఆరోపించింది. ఈ బెదిరింపుల కారణంగా ప్రస్తుతం తన ప్రాణ భద్రతపై తీవ్ర ఆందోళనలో ఉన్నానని పేర్కొంది.ఇదే విధంగా మరికొంత మంది మహిళలు కూడా సదరు అధికారితో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తనకు సమాచారం ఉందని, ఈ వ్యవహారంపై స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరిగితే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.ఈ నేపథ్యంలో తన ఫిర్యాదును స్వీకరించి సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేయడంతో పాటు, తనకు తగిన భద్రత కల్పించి న్యాయం చేయాలని డిజిపిని కోరింది. అలాగే, మహిళలపై అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం సదరు ఇన్‌స్పెక్టర్‌పై శాఖపరమైన దర్యాప్తు కొనసాగుతుంది.

# యువత దృష్టిని మళ్లించేందుకే సిఎం కొత్త ప్రతిపాదన

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను,అమలు చేయని హామీల నుంచి ప్రజల,‘జెన్‌జీ’ యువత దృష్టిని మళ్లించేందుకే ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుండి 21 ఏళ్లకు తగ్గించాలని సిఎం రేవంత్ రెడ్డి కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. విద్యాశాఖలో పూర్తిగా విఫలమైనందుకు సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా నైతిక బాధ్యత వహించి, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యాశాఖ బాధ్యతలను కాంగ్రెస్ యువ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డికి అప్పగించాలని సూచించారు. రాష్ట్రంలో రూ.12వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆయా కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలోని 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నిధులు, అధ్యాపకుల కొరతతో తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలకు రూ.1,000 కోట్లు ఇస్తామని చెప్పి, ఇప్పటి వరకు రూపాయి కూడా విడుదల చేయలేదని, ఉపాధ్యాయులకు జీతాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేక విద్యా వ్యవస్థ కుదేలైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ వీలునామాలు..

కోట్లాది రూపాయల ఆస్తుల కోసం..

12 మందిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు వీలునామాలు (విల్స్) నకిలీ చేసి కోర్టులో అసలైన పత్రాలుగా వినియోగించారన్న ఆరోపణలపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఒకే కుటుంబానికి చెందిన సభ్యులతో పాటు మొత్తం 12 మందిని నిందితులుగా చేర్చి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, తన తండ్రి సోదరి మధు శర్మ తన అమ్మమ్మ సుశీలా శర్మ, తండ్రి అరుణ్ కుమార్ శర్మ సంతకాలను నకిలీ చేసి 1999 ఏప్రిల్ 17, 2000 జనవరి 2, 2008 మార్చి 8 తేదీలతో మూడు వీలునామాలను సృష్టించారని జూబ్లీహిల్స్‌కు చెందిన అంకూర్ శర్మ ఆరోపించారు. 2000 జనవరి 2 తేదీతో ఉన్న వీలునామాలో సాక్షిగా పేర్కొన్న వ్యక్తి చిరునామాలో ‘ఉత్తరాంచల్‘ రాష్ట్రం పేరు ఉండటం గమనార్హమని, అయితే ఉత్తరాంచల్ రాష్ట్రం 2000 నవంబర్ 9న మాత్రమే ఏర్పడిందని, అంతకుముందే ఆ రాష్ట్రం పేరు పత్రంలో ఉండటం ఆ వీలునామా నకిలీ అని సూచిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, నకిలీ వీలునామాలను ఢిల్లీ హైకోర్టులో అసలైన పత్రాలుగా సమర్పించి ఆస్తులపై అక్రమ హక్కులు సాధించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఇటీవల చేతిరాత నిపుణుల అభిప్రాయం తీసుకోగా, వీలునామాలపై ఉన్న సంతకాలు తన తండ్రి, అమ్మమ్మ అసలు సంతకాలతో సరిపోలలేదని, అవి నకిలీవేనని నిర్ధారణకు వచ్చినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని హిమాయత్ సాగర్ ప్రాంతంలో ఉన్న ఆస్తి కూడా ఈ నకిలీ వీలునామాల ద్వారా బదిలీ చేసే ప్రయత్నం జరిగినందున కేసు హైదరాబాద్‌లో నమోదైనట్లు పోలీసులు తెలిపారు. విచారణలో మధు శర్మతో పాటు మృతుడు రామాకాంత్ శర్మ, పుష్పాంజలి శర్మ, విక్రమ్ శర్మ, హర్ష్ శర్మ, రమా శర్మ, రాకేష్ కుమార్, శ్రీకాంత్ కోటియాల్, గంగా ప్రసాద్ బిమల్, శైలేంద్ర ప్రకాష్ సిన్హా, నీర్జా మాలా సిన్హా, దేవాంతల్ సిద్ధాలను కూడా నిందితులుగా చేర్చారు.సిసిఎస్ ఇఒడబ్ల్యూ టీం 4కు చెందిన ఎసిపి ఎస్.రామచంద్రారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నూతనంగా ఎన్నికైన పట్టణ, మండల అధ్యక్షులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు విశేష కృషి చేయాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా పార్టీని మరింత బలపర్చాలని నూతన అధ్యక్షులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ వన్ టౌన్ అధ్యక్షుడు కోడిరెక్క ఇంద్రకుమార్, టూ టౌన్ అధ్యక్షుడు మహ్మద్ మోయిజ్, మిర్యాలగూడ మండల అధ్యక్షుడు గుండు నరేందర్‌గౌడ్, వేములపల్లి మండల అధ్యక్షుడు రేగట్ల రవీందర్‌రెడ్డి, దామరచర్ల మండల అధ్యక్షుడు కొర్ర నాగునాయక్ లను శాసనసభ్యులు ప్రత్యేకంగా అభినందించి ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధులు స్కైలాబ్ నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నారగుట్టపై మైనింగ్ క్రషర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దు : సిపిఐ



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** నారగుట్టపై మైనింగ్ క్రషర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వవద్దని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ కలెక్టర్‌కి విషయాన్ని వివరిస్తూ భువనగిరి మండలంలోని గౌస్ నగర్, తుక్కాపురం, ఎర్రంబెల్లి, నమాతపల్లి గ్రామాల మధ్యన ఉన్న నారగుట్టపై మైనింగ్ క్రషర్‌కు అనుమతి ఇవ్వరాదని తెలిపారు. ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 119, 139లో 50 ఎకరాల నారగుట్టలో మెసర్స్ ఆర్కే స్టోన్ ఇండస్ట్రీస్‌కు మైనింగ్ అనుమతి ప్రతిపాదనలను తక్షణం రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వారసత్వానికి జీవ వైవిధ్యానికి భూగర్భ జలాల సంరక్షణ, జంతువులకు, పక్షులకు ఆవాసాలకు ప్రత్యేకమైన నారగుట్టను మైనింగ్‌కు అప్పగించడం వలన ప్రజా రోగ్య పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, మండల కార్యవర్గ సభ్యులు చొప్పరి సత్తయ్య, కోట శంకర్, నాయకులు ఏదునూరి శంకర్ ఉన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు ప్రజా ఉద్యమాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేంత వరకు అలుపెరుగని ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంజనాపురి కాలనీ దగ్గర జాతీయ రహదారి 65 పై అఖిల పక్ష పార్టీలు, ప్రజాసంఘాలు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారిపై ఉన్న ప్రధాన వాణిజ్య పట్టణని, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రజలకు కీలక రవాణా కేంద్రంగా నిలిచిందన్నారు. గత 20 సంవత్సరాలుగా రైల్వే మార్గం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రాకుంటే సూర్యాపేట జిల్లా అంధకారంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోగా పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్ యాదవ్, ఊర రామ్మూర్తి యాదవ్, చల్లమల్ల నరసింహ, మల్లు నాగార్జున్ రెడ్డి, కుంట్ల ధర్మార్జున్, బూర వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శివ కుమార్, గంట నాగయ్య, షేక్ నజీర్, సతీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు, వామపక్షాలు నిరసన

భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వామ పక్షాలు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీ నాయకులు, బాధిత రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా తహశీల్దార్ రైతుల పట్ల ప్రవర్తిస్తున్న నిర్లక్ష్య తీరు నశించాలని అన్నారు. రైతు సమస్యలు పరిష్కరించని తహసీల్దార్ పై జిల్లా ఉన్నత అధికారులు విచారణ జరపాలని, రైతు సమస్యలపై వార్తలు రాస్తున్న విలేకరులపై లీగల్ నోటీసులంటూ, జర్నలిస్టులను తీవ్రంగా విమర్శిస్తూ, అవమానించే విధంగా నోటీసులో పేర్కొన్నారు. ఎమ్మార్వో తీరును మార్చుకోకుంటే పెద్ద ఎత్తున కలెక్టరేట్ ను ముట్టడిస్తాం అని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో స్పందిస్తూ నిరసన చేస్తున్న వారిని మీ సమస్యలు ఏంటో తెలుపాలని కోరారు.వారి వద్ద నుంచి వినతిపత్రాన్ని తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న భూ సమస్యలపై వెంటనే విచారణ చేపట్టి సమస్యలు పరిష్కస్తామని తెలిపారు. ముల్కలపల్లీ భూ సమస్యపై వివరణ ఇస్తూ అట్టి భూమిపై వారసుల అభ్యంతరం ఉంది కాబట్టి పౌతీ చేయలేదని తెలిపారు. డీ ఫామ్ పట్టాలకు సంబంధించిన పని ప్రాసెస్ నడుస్తుందని, ఆ సమస్య క్లియర్ కాగానే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



# పొరపాట్లు, లోపాలకు తావులేదు

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ వేగవంతంగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల మండల రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులతో విడివిడిగా సమావేశమైన ఆయన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు, లోపాలకు తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు,బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ నిర్ణీత గడువులోపు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి స్థాయి సమన్వయకర్త చామల శ్రీనివాస్, తహశీల్దార్‌లు యశ్వంత్ రాజ్, పుష్పలత,జ్యోతి,కట్టంగూరు మాజీ జెడ్పిటిసి మాదా యాదగిరి,జిల్లా కార్యదర్శి చౌగోని శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు లింగాల వెంకన్న, ఎడ్ల ప్రవీణ్ కంపసాటి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీ 17వ వార్డులో సోమవారం ఇందిరా మహిళా శక్తి చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి మహిళకు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.

## పాత ఇనుప దుకాణంలో బ్యాలెట్ బాక్స్ ప్రత్యక్షం

స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు ఎలా వచ్చిందన్న అనుమానాలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే బ్యాలెట్ బాక్స్ నల్లగొండ పట్టణంలోని ఓపాత ఇనుప సామాను దుకాణంలో ప్రత్యక్షమవడంతో సంచలనం రేగింది. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఆ దుకాణంలో బ్యాలెట్ బాక్స్ కనిపించడం పలు అనుమానాలకు తావిస్తోంది.సాధారణంగా ఎన్నికలు ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సంబంధిత అధికారుల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారు. అలాంటి బాక్స్ బయట దుకాణంలో కనిపించడంతో చర్చనీయాంశమైంది. బాక్స్‌పై ఉన్న అక్షరాలను పరిశీలిస్తే అది జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందినదిగా తెలుస్తోంది.ఈ బ్యాలెట్ బాక్స్ స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు ఎలా వచ్చింది. ఎన్నికల సంఘం అధికారికంగా పాత సామానుగా వేలం వేసిందా? లేక మరేదైనా మార్గంలో బయటకు చేరిందా..అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలాంటి బాక్సులు మరెన్ని బయటకు వచ్చాయనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.మరోవైపు బాక్స్‌ను కట్టర్‌తో కోసిన ఆనవాళ్లు కనిపించడం మరింత అనుమానాలకు కారణమవుతోంది. దీనిపై దుకాణ యజమానిని ప్రశ్నించగా, సుమారు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఈ బాక్స్‌ను తమకు విక్రయించినట్లు ఆయన తెలిపినట్లు సమాచారం.ఈ ఘటనపై ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టి బ్యాలెట్ బాక్స్ అక్కడికి ఎలా చేరిందనే నిజానిజాలు వెలికితీయాలని, సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 134 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 64, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 17, సర్వే ల్యాండ్స్ 8, మున్సిపాలిటీ 8,డి.పి. ఓ 6, మైనింగ్ 4, ఉపాధి కల్పన 3, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య 2,ఇరిగేషన్ 2,జిల్లా పరిషత్2, వ్యవసాయ 2,విద్య శాఖ 2, సివిల్ సప్లై,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,విద్యుత్,ఎల్.డి. ఎం, డి . సి. ఓ (TGSWREI), ఆర్టీసీ,హౌసింగ్, చేనేత మరియు జౌళి ,కోపరేటివ్,పౌర సంబంధాలు,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ స్టేట్ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి కి బదులు ప్రత్యామ్నాయ (తక్కువ నీటి) పంటలు వేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ నెల 28వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎల్ ని నో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సాగునీటి వినియోగం తదితర అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల స్పెషల్ అధికారులకు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు పాల్గొన్నారు.



## రైస్ మిల్లులపై ఆకస్మిక తనిఖీలు

జెపి, ఎస్‌విఆర్ఐ రైస్ మిల్లులపై 6-ఏ కేసు నమోదు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్/సూర్యాపేట రూరల్ :** నల్లగొండ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల బృందం సంయుక్తంగా సోమవారం సూర్యాపేట జిల్లాలోని పలు రైస్‌మిల్లులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... పెన్‌పహాడ్ మండలం, మాచారం గ్రామంలోని జెపి రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టగా గత ఆరు నెలలుగా ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్లుడ్ రైస్ (సిఎంఆర్) సరఫరా చేయలేదని గుర్తించారు. భౌతిక తనిఖీలో ప్రభుత్వానికి సంబంధించిన 4,886.50 మెట్రిక్ టన్నుల ధాన్యం లోటు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో సంబంధిత మిల్లు యాజమాన్యంపై అత్యావశ్యక వస్తువుల చట్టం 1955 ప్రకారం సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేశారు. లోటుగా గుర్తించిన ధాన్యం విలువ సుమారు రూ.11.67 కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. సూర్యాపేట మండలంలోని కాసరాబాద్ గ్రామంలోని ఎస్‌విఆర్ఐ రైస్ మిల్లు కూడా ఆక్షన్ ప్యాడి, సిఎంఆర్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ప్రభుత్వానికి సంబంధించి 11,400.843 మెట్రిక్ టన్నుల ధాన్యం లోటు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో ఆ మిల్లు యాజమాన్యంపై కూడా సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ.27.23 కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. ఈ రెండు మిల్లుల వ్యవహారాల్లో తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీధర్ రెడ్డికి సంబంధిత అధికారులు సిఫార్సు చేశారు. జిల్లాలో ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలు, సిఎంఆర్ సరఫరా విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా వాటిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలలో నల్లగొండ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటి తహశీల్దార్లు ప్రదీప్ రెడ్డి, రాజశేఖర్, విజిలెన్స్ సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



## పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిజి ఐపాస్, టీప్రైడ్ పథకాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిజి ఐపాస్ పోర్టల్ ద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఈ పథకం కింద 25 యూనిట్లకు సంబంధించి వివిధ శాఖల నుంచి మొత్తం 57 అనుమతుల కోసం దరఖాస్తులు అందాయని వివరించారు. ఇందులో ఇప్పటికే 37 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని, మిగిలిన 20 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం వేగంగా క్లియర్ చేయాలని ఆదేశించారు. దళిత, గిరిజన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న టిప్రైడ్ పథకంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ పథకం కింద ఎస్‌సి కేటగిరిలో 5 దరఖాస్తులు, ఎస్‌టి కేటగిరిలో 16 దరఖాస్తులను కమిటి ఆమోదించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగాలని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిఎం ఇండస్ట్రీస్ భారతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, ఎంఈఐ ఆదిత్య పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో విద్యుత్ బకాయిల వసూళ్ళు

నల్లగొండ డివిజన్‌లో చిట్యాల టాప్

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో పేరుకు పోయిన విద్యుత్ బకాయిలను మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో వసూలు చేశారు. జిల్లా ఎస్‌సి ఎ శ్రీనివాస్ మౌఖిక ఆదేశాల మేరకు విద్యుత్ బకాయి వసూళ్ళ కోసం జిల్లా నుండి వచ్చిన అధికారులు ఈ నెల 23, 24, 27 తేదీలలో మండలంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. అత్యధికంగా బకాయిలను వసూళ్ళ చేసిన నల్లగొండ జిల్లాలోనే చిట్యాల మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపారు. జులై నెల వరకు మండలంలోని అన్ని గ్రామాలలోని వాణిజ్య, వ్యాపార, గృహా వినియోగదారులు సుమారు రూ. 11 లక్షల బకాయిలు విద్యుత్ సంస్థకు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే విధంగా జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ విద్యుత్ డివిజన్‌లలో పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. జులై 3న జిల్లా విద్యుత్ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఏ శ్రీనివాస్ విద్యుత్ బకాయిల మీద దృష్టి సారించారు. అన్ని డివిజన్‌లలో బకాయిల వసూళ్ళకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దీం తో విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై బకాయిల వసూళ్ళ కోసం అహర్నిశలు శ్రమించారు. మండల వ్యాప్తంగా మూడు రో జుల్లో సుమారు రూ. 7లక్షల వరకు వసూలు చేశారు. మూ డు రోజులుగా జరుగుతున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి ప్ర త్యేక అధికారి అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి కె భిక్షపతి నేతృ త్వం వహించారు. సోమవారం ఎ.డి ఎల్ శ్రీను నాయక్ స్వయంగా వినియోగదారుల దగ్గర బకాయిలను వసూలు చేశారు.






## కెవైసి చేస్తామంటూ కుచ్చుటోపీ.. ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

30 గ్రాముల బంగారం, బైక్, ఐఫోన్ స్వాధీనం

డిఎస్‌పి బి.రవీందర్ వెల్లడి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం పథకం పేరుతో వృద్ధులను నమ్మించి బంగారు తాళిబొట్లు అపహరించిన ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్థులను అరెస్టు చేసినట్టు భువనగిరి డిఎస్‌పి బి.రవీందర్ తెలిపారు. అరెస్టు చేసిన వారి వద్ద నుంచి 30 గ్రాముల బంగారు మంగళసూత్రం, ఎన్ఎస్200 పల్సర్ బైక్, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12న బీబీనగర్ పట్టణానికి చెందిన కుక్కదోవు అండాలు (65) ఏళ్ల మహిళ ఇంటికి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వం ఉచిత బియ్యం అందించేందుకు కేవైసీ, ఫొటో అవసరమని నమ్మించారు. మెడలోని బంగారు తాళిని తీసేయాలని సూచించారు. దీంతో ఆ మహిళ తన వద్ద ఉన్న పుస్తెలతాడును తీసి తన భర్త చేతిలో పెట్టగా అదే అదునుగా చూసి ఆ దుండగులు తాళిబొట్టును అపహరించి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టామని అన్నారు. దర్యాప్తులో నిందితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సింహాద్రి గంగాధరప్ప, కర్ణాటకకు చెందిన జంగాల శివరాజ్గా గుర్తించామన్నారు. జూలై 26న నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 30 గ్రాముల బంగారు మంగళసూత్రం, ఎన్ఎస్200 పల్సర్ బైక్, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పర్యవేక్షణలో, ఇన్స్పెక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ ఎన్.రమేష్‌తో పాటు బీబీనగర్, భువనగిరి టౌన్ పోలీసు సిబ్బంది సమన్వయంతో కేసును త్వరితగతిన ఛేదించినట్లు పేర్కొన్నారు.

## నిర్దేశిత గడువులోగా సర్ పూర్తి

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్) :** నిర్ధేశిత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సూచించారు. సోమవారం ఆత్మకూర్(ఎస్) మండలంలోని బొప్పారం గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను, బిఎల్ఓల, బిఎల్ఏల పని తీరును క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎలాంటి అర్హులైన ఓటరు జాబితా నుంచి మిగిలిపోకుండా, ఇంటింటికి వెళ్లి పూర్తిస్థాయిలో ధృవీకరణ చేపట్టాలని సూచించారు. సర్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేసేందుకు బిఎల్ఓలకు బిఎల్ఏలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముస్కు రామచంద్రారెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ గోపగాని పెద్ద వెంకన్న, గోపగాని రవి, భాషపంగు లింగయ్య, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, పచ్చిపాల వెంకన్న, తన్నీరు పురుషోత్తం పాల్గొన్నారు.



## ప్రత్యామ్నాయ పంటల విత్తనమేల..

**ప్రజాపక్షం/హాలియా:** ఎల్ నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు నెలకొని వరి పంట సాగు చేసుకునే పరిస్థితులు లేకపోవడంతో దానికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి వెంకన్న,కొత్తపల్లి సర్పంచ్ అలుగుబెల్లి బ్రహ్మారెడ్డి లు తెలిపారు.సోమవారం కొత్తపల్లి రైతు వేదికలో విత్తనమేల కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని చెప్పారు.దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ ఖరీఫ్ లో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. దీనిలో భాగంగానే రైతు వేదికలో ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, కందులు, మినుములు, పెసర్లు తదితర పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు బూడిద ఏసు,బండి ఆంజనేయులు,ఉప సర్పంచ్ గార్లపాటి జనార్ధన్ పాల్గొన్నారు.

## ఎఐటియుసి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** వచ్చే నెల 1వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే ఎఐటియుసి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు లేబర్‌కార్డులు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఎంతోమంది కార్మికులకు ఇప్పటి వరకు లేబర్‌కార్డులు లేవని, కార్మికులందరికి లేబర్ కార్డులు పొందాలని కోరారు. కార్మికులకు అందరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలపై జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు యడవెల్లి వెంకటేశ్వర్లు, బండ్ల ఆనందరావు, బెజ్జం రమేష్, సిమెంట్ బ్రిక్స్ కార్మికులు తవడబోయిన నవీన్, గండెల శైలజ, రెడ్డబోయిన కోటమ్మ, ప్రధాని రమ, రమణ, రాధిక, స్వాతి, సైదులు, ఈరమ్మ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
మంగళవారం
28-07-2026
www.prajapaksham.in

‘ విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక కుటుంబ కథా చిత్రం ఆదర్శ కుటుంబం (ఎకె) హౌస్ నెం.47 ప్రచార కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ’

రీల్




# ‘అదే నీవు అదే నేను’ ట్రైలర్ రిలీజ్


కమిటీ కుర్రోళ్లు’ మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, సిద్ధార్థ్ రాయ్ సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా ‘అదే నీవు అదే నేను‘. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవిందు కాండ్రేగుల నిర్మిస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో దర్శకుడు కొండల్ రూపొందిస్తున్నారు. ఈ నెల 31న థియేట్రికల్ రిలీజ్‌కు ఈ సినిమా రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ ను పాన్ ఇండియా యాక్టర్ సునీల్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ‘అదే నీవు అదే నేను‘ సినిమా ట్రైలర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. షాకింగ్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్స్ లోకి వస్తోంది. తప్పకుండా థియేటర్స్ లో చూడండి. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేయండి అన్నారు. సమాజంలో జరుగుతున్న కొన్ని వాస్తవ ఘటనల ఇన్స్పిరేషన్ తో ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు కొండల్ ‘అదే నీవు అదే నేను‘ సినిమాను ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించినట్లు నిర్మాత గోవిందు కాండ్రేగుల చెప్పారు. ఒక గేటెడ కమ్యూనిటీలో జరిగే సరికొత్త రొమాంటిక్ థ్రిల్లర్ కథతో అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆద్యంతం ఆసక్తిని పంచేలా ఈ సినిమా ఉండబోతోందని అన్నారు. త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, తన్వి నేగి, సహర్ కృష్ణన్, కల్పలత, సునయన, బిత్తిరి సత్తి, మీర్, సూర్యతేజ, నరేందర్, రమణ భార్గవ్ నటిస్తున్నారు.

# ‘ఎకె 47’లో చిట్టిబాబుగా వెంకటేష్

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక కుటుంబ కథా చిత్రం ఆదర్శ కుటుంబం (ఎకె) హౌస్ నెం.47 ప్రచార కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చిత్రంలోని ప్రధాన పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తొలి పాత్రగా విక్టరీ వెంకటేష్ పోషిస్తున్న ‘చిట్టిబాబు’ పాత్రను పరిచయం చేయగా, అనంతరం శ్రీనిధి శెట్టి, యువినా పార్థవి, రాజా ప్రజ్వల్ పాత్రలను పరిచయం చేయనున్నారు. ఈ నలుగురి పాత్రలు ఈ ఆత్మీయ కుటుంబ కథకు హృదయంగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ చిట్టిబాబు పాత్రలో అలరించనున్నారు. కుటుంబాన్ని ప్రేమతో, ఆప్యాయతతో, బాధ్యతతో ఒకే తాటిపై నడిపించే కుటుంబ పెద్దగా ఆయన పాత్ర ఆకట్టుకోనుంది. విడుదలైన పాత్ర పరిచయ వీడియోలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్ కనిపిస్తూ, నవ్వులు, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలతో నిండిన చిత్ర ప్రపంచాన్ని అందంగా పరిచయం చేశారు.సహజమైన నటన, అద్భుతమైన కామెడీ టైమింగ్, కుటుంబ కథా చిత్రాల్లో తనదైన ముద్ర వేసిన వెంకటేష్ మరోసారి అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే పాత్రతో రాబోతున్నారు. చిట్టిబాబు పాత్ర ఆయన కెరీర్‌లో మరో చిరస్మరణీయమైన పాత్రగా నిలిచేలా కనిపిస్తోంది. ఆనందం, అనుబంధాలు, కుటుంబ విలువలకు ప్రతిరూపంగా ఈ పాత్ర ఉండబోతోంది.తొలి పాత్ర పరిచయంతోనే చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక వరుసగా రానున్న ఇతర పాత్రల పరిచయాలు కూడా ‘ఆదర్శ కుటుంబం’ ప్రపంచాన్ని మరింత ఆసక్తికరంగా ప్రేక్షకులకు చేరువ చేయనున్నాయి.‘హారిక అండ్ హాసిని క్రియేషన్స్‘పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ప్రతిష్టాత్మకంగానిర్మిస్తున్న ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 చిత్రం 2026 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, కెవిన్ కుమార్ యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సంపూర్ణ పండుగ వినోద చిత్రంగా ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 ప్రేక్షకుల ముందుకు రానుంది.







# ‘ఆయా షేర్’ @200 మిలియన్ వ్యూస్

నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న క్రేజీ పాన్ ఇండియా మూవీ ’ది ప్యారడైజ్’ విడుదలకు ముందే మ్యూజిక్‌తో సంచలనం సృష్టిస్తోంది. ఈ చిత్రం నుంచి విడుదలైన తొలి పాట ’ఆయా షేర్’ ఏకంగా 200 మిలియన్ వ్యూస్ దాటుతూ ఈ ఏడాది అతిపెద్ద చార్ట్‌బస్టర్ పాటల్లో ఒకటిగా నిలిచింది.విడుదలైనప్పటి నుంచి ’ఆయా షేర్’ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా కొనసాగుతోంది. సోషల్ మీడియా యూజర్స్, కాలేజ్ స్టూడెంట్స్, చిన్నారులు, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ పాట ఆకట్టుకుంది. క్యాచీ ట్యూన్, ఎనర్జిటిక్ కొరియోగ్రఫీ, పవర్‌ఫుల్ విజువల్స్‌తో ఈ పాట సెలబ్రేషన్స్, పబ్లిక్ ఈవెంట్స్‌లో తప్పనిసరిగా వినిపించే సాంగ్‌గా మారింది.అనిరుధ్ రవిచందర్ అందించిన ఎనర్జిటిక్ మ్యూజిక్‌కు కాసర్ల శ్యామ్ రాసిన పవర్‌ఫుల్ లిరిక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అద్దుల జంగిరెడ్డి, అర్జున్ చాందీ ఎనర్జిటిక్ వోకల్స్ ఈ పాటను మరింత వైరల్ అయ్యేలా చేశాయి.దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ సినిమాలో నానిని మరోసారి పూర్తిగా కొత్త అవతార్‌లో చూపించారు.

# ‘తీరం’ టైటిల్ సాంగ్ విడుదల



శ్రీ భవానీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ‘తీరం’ సినిమా టైటిల్ సాంగ్‌ను ఘనంగా విడుదల చేశారు. ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ‘పుష్ప’ ఫేమ్ నటుడు జగదీష్, ఫన్ బకెట్ మహేష్ విట్ట, నటుడు రాజ్‌కుమార్ కసిరెడ్డి, దర్శకుడు ప్రసాద్, జబర్దస్త్ సద్దాం, నటుడు కుమానన్ తదితరులు హాజరై టైటిల్ సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు వంశీ మునగాల మాట్లాడుతూ ‘తీరం’ ప్రతి ఒక్కరి హృదయాలను తాకేలా భావోద్వేగభరితమైన కథతో రూపొందుతోందన్నారు. చిత్రీకరణ విజయవంతంగా పూర్తై ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన నిర్మాత, సాంకేతిక నిపుణులు, నటీనటులు, చిత్ర యూనిట్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను అత్యంత నాణ్యతతో రూపొందిస్తున్నామని, ప్రతి ఒక్కరి సహకారంతో ఈ సినిమా అందంగా రూపుదిద్దుకుంటోందని చెప్పారు.నిర్మాత ఉపేందర్ గంగావెల్లి మాట్లాడుతూ, దర్శకుడు వంశీ మునగాల కథ వినిపించిన వెంటనే ఎంతో నచ్చిందన్నారు. కథపై నమ్మకంతోనే ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చానని తెలిపారు. సినిమా నిర్మాణం తుది దశకు చేరుకుందని, విడుదల తేదీతో పాటు ఇతర విశేషాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. చిత్ర బృందం ఎంతో అంకిత భావంతో పనిచేసిందని, ప్రేక్షకులకు తప్పకుండా మంచి సినిమా అందిస్తామనే నమ్మకం వ్యక్తం చేశారు.హీరో ప్రభు, నటుడు జగదీష్.హీరోయిన్ హరిప్రియా, నటుడు రమణ, సంగీత దర్శకుడు సాధ్విక్ సన్స్ ఫన్ బకెట్ నటులు ఫణి, మహేష్ మాట్లాడుతూ, చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేస్తూ ‘తీరం’ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.కోడైరెక్టర్, క్రియేటివ్ హెడ్ ,ఎడిటర్ విజయ్ శెట్టి.

# ‘మహేంద్రగిరి వారాహి’లో ట్విస్టులు


## ప్రెస్‌మీట్‌లో హీరో సుమంత్

సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ ‘మహేంద్రగిరి వారాహి’. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘మహేంద్రగిరి వారాహి’ మహేంద్రగిరి నేపథ్యంగా, వారాహి మాత డివైన్ పవర్ చుట్టూ సాగే ఈ కథలో ఎన్నో అంతుచిక్కని సంఘటనలు, రహస్యాలు, మిస్టరీతో ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించబోతుంది. ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకురానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ ప్రెస్ మీట్ నిర్వహించారు. రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ ’మహేంద్రగిరి వారాహి’ జర్నీ రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమైంది. ఈ సినిమాలో ఇంకా చాలా సర్‌ప్రైజ్ ట్విస్టులు, ఊహించని సన్నివేశాలు, ఆసక్తికరమైన మలుపులు ఉన్నాయి. అమ్మవారి ఆశీస్సులతో సెప్టెంబర్ 11న థియేటర్లలోకి వస్తున్నాం. ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే సినిమా అవుతుంది. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన లక్ష్మణ్ కి, మధుకి ధన్యవాదాలు. అలాగే సుమంత్ కూడా నన్ను బలంగా నమ్మారు. మా టెక్నికల్ టీమ్, డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ అందరికీ థ్యాంక్స్. ప్రతి ఒక్కరూ ఈ సినిమాలో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. సెప్టెంబర్ 11న సినిమా రిలీజ్ అవుతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మధు, సీనియర్ నటి మంజు భార్గవి , మీనాక్షి గోస్వామి పాల్గొన్నారు.



# అసెంబ్లీని సందర్శించిన యుపి స్పీకర్ సతీష్ మహానా

## శాసనసభల నిర్వహణపై ఇరువురు స్పీకర్ల మధ్య చర్చ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ సతీష్ మహానా, ఆయన సతీమణి అనితా మహానా తెలంగాణ రాష్ట్ర శాసనసభను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ వారికి ఘన స్వాగతం పలికారు. అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంపతులను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి, జ్ఞాపికను (మెమెంటో) బహూకరించారు. అనంతరం ఇరువురు స్పీకర్లు సమావేశమై తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసనసభల నిర్వహణ, శాసన ప్రక్రియలు, పరిపాలనా విధానాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి చేపడుతున్న చర్యలపై పరస్పరం చర్చించారు. ఇరు రాష్ట్రాల శాసనసభల పనితీరుకు సంబంధించిన అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు.

ఈ సమావేశంలో శాసనమండలి కార్యదర్శి డా. వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంపతుల తెలంగాణ శాసనసభ సందర్శన స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# తప్పుడు సమాచారంతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు...

## రెండేళ్ల కాలంలో రూ. 1.50 లక్షల కోట్లు ఆస్తులు రక్షించాం హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెండేళ్ల కాలంలో హైడ్రా కమిషనర్‌గా రాజ్యాంగ స్ఫూర్తి ననుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21,48 ఎ ప్రకారం ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులను రక్షించానని, మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ రూ. 1.50 లక్షల కోట్లు అని హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ అన్నారు. ఆరు చెరువులను పూర్తి స్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, బడా బాబులు ఆక్రమించిన వందల చెరువులను, పార్కులను, వేల ఎకరాల ప్రభుత్వ భూముల ను హైడ్రా వెనక్కి తీసుకుని, ప్రభుత్వానికి అప్పగించిందని గుర్తు చేశారు. బడా భూ కబ్జా దారులే తనపైన 63 కంటెంప్ట్ కేసులు వేశారని రంగనాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజం వైపు నిజాయితీగా నిర్భయంగా, నిబద్ధతతో పని చేస్తానని, అందుకే ల్యాండ్ మాఫియా, భూ కబ్జా దారులు తప్పుడు సమాచారం తో కోర్ట్ లను తప్పు దోవ పట్టిస్తున్నారన్నారు. లోతు కుంట భూమి విషయం లో దాదాపు పది వేల కోట్ల రూపాయల భూమిని శాంతా శ్రీరామ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కొట్టేయాలని చూసిందని, అనుమతి లేకుండానే రూ 2500 కోట్ల విలువ చేసే హెరిటేజ్ గుట్టలను బ్లాస్టింగ్ చేస్తూ వందల చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా విధ్వంసం చేశారని పేర్కొన్నారు. సేవ్ ది రాక్స్ సొసైటీ, పర్యావరణ వేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు హైడ్రా రంగం లోకి దిగిందని, ఎక్కడో మూడు కిలోమీటర్ల అవతల ఉండాల్సిన, లేని భూమిని చూపిస్తూ, ఈ బిల్డర్ 120 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి వచ్చి ఆక్రమించి, తనపైన కంటెంప్ట్ కేసు వేశారని వివరించారు. బతుకమ్మ కుంట చెరువును మింగేయాలని చూసిన ఒకరు, లోతుకుంటలో రూ. వేల కోట్ల ప్రభుత్వ భూమి ని కొట్టేయాలని చూసిన ఇంకొకరు, సామాన్యుల ప్లాట్లు కొట్టేసి బడా కాంప్లెక్స్ లు కట్టాలని చూస్తున్న సంధ్యా శ్రీధర్ రావు, వేల సంఖ్యలో ఉన్న సింగరేణి కార్మికుల ప్లాట్స్ ను కొట్టేయాలని చూసిన నల్ల మల్లా రెడ్డి, క్రిమినల్ మాఫియా గా చెలామణి అవుతూ రూ. వేల కోట్ల విలువైన సామాన్యుల ప్లాట్స్, ప్రభుత్వ భూములు ఆక్రమించిన ముఖీం ఇలా అందరికీ హైడ్రా కమిషనర్‌గా అడ్డు పడడటమే తాను చేసిన తప్పు అని అన్నారు. వీరంతా తనపైన 63 కోర్ట్ ధిక్కార కేసులు వేశారని, వీటిని తాను చట్ట పరంగానే ఎదుర్కుంటానన్నారు. తనకు న్యాయ స్థానాలు అంటే పూర్తి నమ్మకమని, ప్రభుత్వాలు తనకు గతంలో, ఇప్పుడు, మున్ముందు ఏ బాధ్యతలు అప్పగించినా, తాను వంద శాతం ఫలితాలు వచ్చే విధంగా పని చేస్తున్నానని రంగనాథ్ అన్నారు.

# దద్దరిల్లిన ఉభయసభలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతుండటంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. 20న సిజెపి నేతృత్వంలో పార్లమెంటు వరకు విద్యార్థులు నిర్వహించిన నిరసన యాత్ర సందర్భంగా వారిపై పోలీసులు జరిపిన అణచివేతపై ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నీట్‌యుజి పేపర్ లీక్, ఇతర సమస్యలపై విద్యార్థులు నెల రోజులకు పైగా చేస్తున్న నిరసనల నేపథ్యంలో, రెండేళ్ల క్రితం నాటి పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించే లక్ష్యంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

**రాజ్యసభలోనూ నినాదాలు**

మరోవైపు నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు చేస్తున్న పోలీసుల చర్యల అంశాన్ని లేవనెత్తేందుకు ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేయడంతో రాజ్యసభ సోమవారం సాయంత్రం 5:15 గంటల వరకు నాల్గవసారి వాయిదా పడింది. రోజంతా పలుమార్లు వాయిదా పడిన అనంతరం, మధ్యాహ్నం 3 గంటలకు రాజ్యసభ సమావేశమైన వెంటనే, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నిరసన చేస్తున్న సభ్యులను తమ తమ స్థానాల్లో కూర్చోవాలని, కార్యకలాపాల జాబితాలో పరిశీలన, ఆమోదం కోసం ఉన్న ‘దేశ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) బిల్లు, 2026’పై చర్చించి ముందుకు తీసుకెళ్లేందుకు వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ప్రతిపక్ష సభ్యుల నినాదాలు కొనసాగుతుండటంతో, హరివంశ్ రాజ్యసభను సాయంత్రం 5:15 గంటల వరకు వాయిదా వేశారు. అంతకుముందు, విద్యార్థులపై పోలీసుల అమానుష దాడి ఆరోపణల అంశాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తేందుకు ప్రయత్నించడంతో, సభ రెండు సార్లు వాయిదా పడగా, అనంతరం, మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైన తరువాత కూడా వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు తొలి వాయిదా అనంతరం, మధ్యాహ్నం 12 గంటలకు రాజ్యసభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష ఎంపిలు మరోసారి పోలీసుల అమానుష దాడి ఆరోపణల అంశాన్ని లేవనెత్తారు.

# ఎంపిల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ప్రియాంక గాంధీలతో పాటు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, టిఎంసికి చెందిన మహువా మోయిత్రా, జెఎంఎంకు చెందిన మహువా మాజీ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. తరువాత, వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను నిషేధించాలని డిమాండ్ చేస్తూ డిఎంకె ఎంపిలు విడిగా నిరసన చేపట్టారు. విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం పార్లమెంటులో ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెంచింది. ఈ అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ షాకు లేఖ రాశారు. పెల్లెట్ గన్‌లతో సహా ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి ఎవరు అనుమతించారని ఆయన ప్రశ్నించారు.

# ఉసురుతీసింది!

(మొదటి పేజీ తరువాయి)

ప్లకార్డులు ప్రదర్శిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించి కూనంనేని మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువజనులు ప్రదర్శించిన అసమాన పోరాట పటిమ ఎంతో అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తును నాశనం చేసే నీట్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉద్యమ విరమణ హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే అమల్లోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను వ్యాపారీకరిస్తూ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే ఎలాంటి నిర్ణయాన్నైనా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్యవర్గ సభ్యులు కంచర్ల జములయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, కందుల భాస్కర్, వాసిరెడ్డి మురళి, ఎస్కే ఫహీన్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, సపవట్ రవి, ఎండి యూసుఫ్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బోయిన విజయకుమార్, బండి నరసింహ, దర్గయ్య, గడ్డం సతీష్, రాకేష్, షాహిన్, కైసర్, గోవిందు, జహీర్, పి సుధాకర్, హతిరం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మారణహోమం

(మొదటి పేజీ తరువాయి)

డెల్‌రియోలో జరిగిన ఒక సభలో అధ్యక్షుడు డయాజ్ కానెల్ మాట్లాడారు. బాటిస్టా సైన్యాలపై ఫైడెల్ కాస్ట్రో తిరుగుబాటు గెరిల్లాలు మొదటిసారి దాడిచేసి జులై 26వ తేదీ నాటికి 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. తిరుగుబాటు ప్రారంభమైన ఐదేళ్ళకు బాటిస్టా ప్రభుత్వం కుప్పకూలిపోయింది. క్యూబా విప్లవం విజయవంతమైంది. క్యూబా విప్లవ క్యాలెండర్‌లో అత్యంత ముఖ్యమైన ఈ పర్వదినం సందర్భంగా క్యూబా వ్యాప్తంగా ప్రదర్శనలు,కళాకారుల నృత్యకార్యాక్రమాలు,వేడుకలు జరిగాయి.

డెల్‌రియో సభలో కానెల్ ప్రసంగిస్తూ, అనేక దశాబ్దాలుగా అమెరికా చేస్తున్న కుట్రలు కూహకాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. దిగ్బంధనం పేరుతో క్యూబాపై జరుగుతున్న రాజకీయ మారణహోమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ట్రంప్ సృష్టించిన కృత్రిమ సంక్షోభం కారణంగా పర్యాటక ఆర్థిక రంగాలలో అనేక కంపెనీలు తమ కార్యకలాపాలను నిలిపివేశాయి. అమెరికా అమలు చేస్తున్న చమురు ఆంక్షలు,కఠిన నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ట్రంప్ క్యూబాలో రాజకీయ మారణహోమం సాగిస్తున్నారన్నారు. అమెరికా ప్రభుత్వంలోకి క్యూబా చొరబడిందని, అమెరికాలో అంతర్గతంగా వామపక్ష ఉగ్రవాదాన్ని అమలు చేస్తోందని ఆ దేశ విదేశాంగమంత్రి మార్కో రుబియో ఇటీవల విడుదల చేసిన నివేదికను డయాజ్ కానెల్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇటీవలి కాలంలో ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ఉన్న వామపక్షవాదులపై దాడులను ఉద్ధృతం చేసింది. క్యూబాపై వామపక్ష తీవ్రవాదం పేరుతో ఆరోపణలు చేయడం ద్వారా దేశాన్ని ఒక బలిపశువుగా మార్చాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పేదలను మరింత పేదలుగా, ధనవంతులను మరింత ధనవంతులుగా మార్చే అమెరికాలోని వ్యవస్థవల్ల దెబ్బతిన్న వర్గాలు వ్యక్తం చేస్తున్న నిరసన నుండి తప్పించుకోవడానికి క్యూబాపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విమర్శల నుండి తప్పించుకోవడానికి ట్రంప్ ప్రభుత్వం కొత్త సాకులు వెతుకుతోందన్నారు.ట్రంప్ ప్రభుత్వం విధించిన ఈ ఆంక్షలు దశాబ్దకాలంగా అమెరికా వల్ల ఎదురైన సమస్యలను క్యూబాలో మరింత పెంచాయి. దీనివల్ల క్యూబాలో చమురు సంక్షోభం,విద్యుత్ సంక్షోభం పరాకాష్ఠకు చేరుకుని ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో డయాజ్ కానెల్ తీవ్రస్థాయిలో అమెరికా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

# విజయోత్సవ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

ఫలితమని వారు అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కాచిగూడ నుంచి బర్కత్‌పుర సిగ్నల్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్, ఎఐడీఎస్‌ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నితీష్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, సిబిఎస్‌ఈ మూల్యాంకనంలో వైఫల్యాలు, సియూఈటి పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఎ చేసిన తప్పిదాలు, విద్య కేంద్రీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం నిర్బంధాలతో అణచివేయాలని ప్రయత్నించిందని ఆరోపించారు.ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ సందర్భంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి, బాష్పవాయువు, పెల్లెట్ దాడులు జరిపినప్పటికీ విద్యార్థులు వెనక్కి తగ్గలేదని పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతకు అభినందనలు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం ముగియలేదని, జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి, ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే నీట్ వంటి కేంద్రీకృత ప్రవేశ పరీక్షలను రద్దు చేసి, రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించే హక్కును కల్పించాలని కోరారు. సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా విద్యపై రాష్ట్రాల హక్కులను పరిరక్షించేందుకు రానున్న రోజుల్లో మరింత విస్తృత ఉద్యమాలను చేపడతామని ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర సమితి సభ్యులు అనిల్, హరీష్, ఎఐడిఎస్‌ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, పిడిఎస్‌యూ రాష్ట్ర నాయకులు శ్రీను, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com